www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 26-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 118 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: విదియ రా.10.42 తదుపరి తదియ; నక్షత్రం: ఆశ్లేష మ.3.52 తదుపరి మఖ; వర్జ్యం: శేషం ఉ.6.19, తె.4.07-5.45; దుర్ముహూర్తం: ఉ.5.56-7.39; అమృతఘడియలు: మ.2.16-3.52; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.56; సూర్యాస్తమయం: 6.47 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వరంగల్ ఎయిర్‌పోర్టుకు 205 కోట్లు విడుదల

టైటిల్ క్లియర్‌గా ఉన్న 15 మంది రైతులకు రూ.13.74 కోట్లు చెల్లింపు

ఇళ్లు కోల్పోతున్న కుటుంబాలకిచ్చే పరిహారంపై రాని స్పష్టత

కోచి తరహాలో విమానాశ్రయం: సురేఖ

12



12

ప్రైవేట్ అన్-ఎయిడెడ్ కాలేజీల్లో

ఫీజుల నిర్ధారణకు కమిటీ

ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆధ్వర్యంలో ఏర్పాటు

డ్రోన్ నుంచి దూసుకెళ్లిన స్వదేశీ క్షిపణి



యూఎల్‌పీజీఎం-వీ3 పరీక్ష విజయవంతం

కర్నూలులోని ఎన్ఓపీఆర్‌లో పరీక్షించిన డీఆర్‌డీవో

లక్ష్యాలను కచ్చితంగా ఛేదించే 12.5 కిలోల క్షిపణి

రక్షణ వ్యవస్థలో ఇదో మైలురాయి: రాజ్‌నాథ్

ఏపీ భాగస్వామ్యం గర్వకారణం: చంద్రబాబు

న్యూఢిల్లీ/ఓర్వకల్లు/అల్వాల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మన దేశ ఆయుధ బలం రోజురోజుకు పదునెక్కుతోంది. స్వదేశీ ఆయుధాల సామర్థ్యంలో తాజాగా మరో ముందడుగు పడింది. డ్రోన్ల నుంచి లక్ష్యాలపైకి దూసుకెళ్లే మరో తేలికపాటి క్షిపణి ప్రయోగం విజయవంతమైంది. యూఏవీ లాంచ్డ్ ప్రెసిషన్ గైడెడ్ మిసైల్ (యూఎల్‌పీజీఎం)-వీ3ని

మిగతా 2వ పేజీలో...

కుప్పకూలిన స్కూల్ భవనం

రాజస్థాన్‌లో దుర్ఘటన.. ఏడుగురు విద్యార్థుల మృతి

మరో 28 మందికి గాయాలు.. కొందరి పరిస్థితి విషమం

ఉదయం వేళ ప్రార్థనకు సిద్ధమవుతుండగా ఘటన

వర్షాలతో నిలిచిన వరద.. గోడలు దెబ్బతినడంతోనే ప్రమాదం

పాఠశాల హెడ్‌మాస్టర్ సహా ఐదుగురు టీచర్ల సస్పెన్షన్

సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్

2



కారును గోడెక్కించేశాడు!

మద్యం మత్తులో డ్రైవర్ నిర్లక్ష్యం.. అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు

పల్టీలు కొట్టి గాల్లోకి లేచి ఇంటి ప్రహరీపైకి.. పరారీలో డ్రైవర్

కారులో ఉన్న ఇద్దరికి గాయాలు.. హైదరాబాద్ దుండిగల్‌లో ఘటన

3

ఆరోగ్యశ్రీలో 27% కిడ్నీ చికిత్సలే!

తర్వాత స్థానాల్లో క్యాన్సర్, పాలీట్రామా

ఏడాదిన్నరలో 10.70 లక్షల చికిత్సలు.. ఐదు విభాగాల్లోనే 6.55 లక్షల కేసులు

ఆరోగ్యశ్రీలో 461కి పెరిగిన ప్రైవేటు ఆస్పత్రులు.. ఎంప్యానెల్ కోసం పోటీ పడుతున్న వైనం

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ కింద అందించే వైద్య చికిత్సల్లో మూత్రపిండాలకు సంబంధించిన కేసులే ఎక్కువగా ఉంటున్నాయి. మొత్తం కేసుల్లో 27 శాతం ఇవే ఉన్నాయి! ఆ తర్వాత స్థానంలో క్యాన్సర్ కేసులు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ కింద అందించే వైద్య చికిత్సల్లో 52 శాతం కేసులు కిడ్నీ, క్యాన్సర్, పాలీట్రామాకు సంబంధించినవే ఉంటున్నాయి. కిడ్నీ 27 శాతం, క్యాన్సర్ 17, పాలీట్రామా 8 శాతం ఉన్నాయి. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ కింద కేవలం 18 నెలల్లోనే రికార్డు స్థాయిలో 10,70,206 లక్షల చికిత్సలు జరిగాయి. ఇందులో అత్యధికంగా హైదరాబాద్‌లో 1.25 లక్షలు, రంగారెడ్డిలో 68 వేలు, నల్లగొండలో 59 వేలు, మేడ్చల్‌లో 52 వేల చికిత్సలు జరిగాయి. ఆరోగ్యశ్రీ ట్రస్టు తాజాగా సర్కారుకు అందించిన నివేదికలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. కేవలం 5 విభాగాల్లోనే 65 శాతం చికిత్సలు అందించినట్లు తెలిపింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో 1042 సర్కారీ దవాఖానాలు ఉండగా.. ప్రైవేటు ఆస్పత్రుల సంఖ్య 461కి పెరిగింది. అంతేగాక చికిత్సల రేట్లను కూడా పెంచారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు

మిగతా 13వ పేజీలో...



భారీగా పెరగడానికి కారణాలివే..

బీఆర్ఎస్ హయాంలో ఆరోగ్యశ్రీ కింద నెలకు సగటున 25 వేల వైద్య చికిత్సలు అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ సంఖ్య దాదాపు 60 వేలకు పెరిగింది. అందుకు కారణాలు.. వైద్య పరిమితిని రూ.10 లక్షలకు పెంచారు. ప్రైవేటు ఎంప్యానెల్ ఆస్పత్రుల సంఖ్య 374 నుంచి 461కి పెరిగింది. ఆరోగ్యశ్రీ కింద చికిత్సల సంఖ్య 898 నుంచి 1835కి పెరిగింది. 1375 చికిత్సల ధరలను 20-25% మేర పెంచారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రతి నెలా క్రమం తప్పకుండా సగటున రూ.50-60 కోట్ల బిల్లులు చెల్లిస్తున్నారు. దీంతో గతంలో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపేసిన ప్రైవేటు ఆస్పత్రులు సైతం మళ్లీ తిరిగి ఆ సేవలను కొనసాగిస్తున్నాయి.



ఐఏఎస్ శ్రీలక్ష్మి పూర్తిస్థాయి విచారణ

ఎదుర్కోవాల్సిందే!

ఓఎంసీ కేసులో హైకోర్టు స్పష్టీకరణ

శ్రీలక్ష్మికి హైకోర్టు గతంలో ఊరట కల్పించడంపై సుప్రీంకు వెళ్లిన సీబీఐ

మళ్లీ విచారించాలని హైకోర్టుకు ఆదేశం

రెండోసారి విచారించి శ్రీలక్ష్మి పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు ధర్మాసనం

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో ఏపీకి చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారిణి వై.శ్రీలక్ష్మికి భారీ ఎదురుదెబ్బ తగిలిగింది. ఈ కేసులో ఆరోపిందితురాలిగా ఉన్న శ్రీలక్ష్మి సీబీఐ కోర్టులో పూర్తిస్థాయి విచారణ ఎదుర్కోవాల్సిందేనని తెలంగాణ హైకోర్టు స్పష్టంచేసింది. ఆమె దాఖలు చేసిన

మిగతా 3వ పేజీలో...



12

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో నియోజకవర్గాల పునర్విభజనకు

సుప్రీం తిరస్కృతి

అసెంబ్లీ సీట్లు పెంచాలన్న పిటిషన్ కొట్టివేత

తెలుగు రాష్ట్రాల్తో కశ్మీర్‌తో పోల్చలేమని వెల్లడి

మేం అధికారంలో ఉన్నప్పుడే

కులగణన చేయాల్సింది

- అవకాశాల్లో న్యాయమైన వాటా ఇవ్వాల్సిందే
- రెట్టింపు వేగంతో పనిచేసి ఆ తప్పు దిద్దుకుంటా
- తెలంగాణ కులగణన.. దేశ రాజకీయాల్లో కుదుపు
- విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో దీంతో పెను మార్పు
- రిజర్వేషన్లలో 50 శాతం అడ్డుగోడను కూల్చేశారు
- ప్రైవేట్ విద్యలోనూ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కోటా
- మోదీదంతా ప్రదర్శనే.. ఆయనలో సరుకేమీ లేదు
- మీడియా ఆయన ఇమేజీని అతిగా పెంచేసింది
- కాంగ్రెస్ భాగీదారీ న్యాయ సమ్మేళనంలో రాహుల్

న్యూఢిల్లీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కుల గణన దేశ రాజకీయాలను కుదిపేసేంత కీలకమైనదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రకటించారు. ఇప్పుడు దేశమంతా తెలంగాణ నమూనా గురించే చర్చిస్తోందన్నారు. కుల గణన తర్వాత రాష్ట్రంలో విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో పెనుమార్పులు వస్తాయని అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో కాంగ్రెస్ ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన భాగీదారీ న్యాయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగంలో రాహుల్‌గాంధీ తాను ఓబీసీ వర్గాలను అర్థం చేసుకోవడం ఆలస్యమైందని అంగీకరించారు. తప్పు చేశానని, 15 ఏళ్ల క్రితమే అధికారంలో ఉండగా కులగణన చేసి ఉండాల్సిందని

మిగతా 13వ పేజీలో...

నా నాయకుడి మాటలు స్ఫూర్తినిచ్చాయి

13 కులగణనపై రాహుల్ వ్యాఖ్యల మీద రేవంత్ స్పందన



బీసీల నోటి కాడి బువ్వను కాజేసేందుకు

బీజేపీ కుట్రలు

బీసీ రిజర్వేషన్లు అడ్డుకుంటే సకల జనుల సమ్మెను మించి పోరాటం

మంత్రులు పొన్నం, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి

ఢిల్లీలో భాగీదారీ న్యాయ సమ్మేళనంలో పాల్గొన్న నేతలు

13



సోషలిస్టు, సెక్యులర్ పదాలను

తొలగించే యోచన కేంద్రానికి లేదు


అవి రాజ్యాంగంలో అంతర్భాగమని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టతనిచ్చింది

బయట జరిగే చర్చలకు ప్రభుత్వానికి సంబంధం లేదు

కేంద్ర న్యాయమంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్

ఎస్పీ ఎంపీ ప్రశ్నకు లిఖితపూర్వక జవాబు

2



లంచం తీసుకుంటూ పట్టుబడ్డ

డిప్యూటీ కమిషనర్

నిబంధనల పేరుతో హోటల్ యజమానికి జీహెచ్‌ఎంసీ డీసీ రవికుమార్ బెదిరింపు

రూ.5 లక్షల లంచం డిమాండ్

2 లక్షలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ

14

జస్టిస్ వర్మ అభిశంసన

లోక్‌సభలోనే!

నోటీసును రాజ్యసభ అనుమతించలేదు!

అధికార వర్గాల పేరుతో ప్రభుత్వం వెల్లడి

లోక్‌సభ సభ్యులతోనే విచారణ కమిటీ

అభిశంసన అన్ని పార్టీల నిర్ణయం: రిజిజు

ధన్‌ఖడ్‌కు వీడ్కోలు విందు యోచనలో విపక్షం.. ఆయన హాజరు అనుమానమే

ఆగస్టులోగా కొత్త ఉప రాష్ట్రపతి: ఈసీ



న్యూఢిల్లీ, జూలై 25: జస్టిస్ యశ్వంత్ వర్మను హైకోర్టు జడ్జి పదవి నుంచి తప్పించేందుకు ఉద్దేశించిన అభిశంసన తీర్మానాన్ని లోక్‌సభలోనే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ తీర్మానం కోసం లోక్‌సభలో బీజేపీ, రాజ్యసభలో కాంగ్రెస్ నోటీసు ఇచ్చాయి. కాంగ్రెస్ ఇచ్చిన నోటీసును అనుసరించి అభిశంసన తీర్మానాన్ని చేపట్టాలని నిర్ణయం తీసుకొని అధికార పార్టీ ఆగ్రహానికి గురైన రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ అదేరోజు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆయన పదవి నుంచి తప్పుకోవడంతో కొత్త ఉప రాష్ట్రపతి వచ్చేవరకు రాజ్యసభ నిర్వహణ బాధ్యత రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో ఆయన కార్యాలయం కాంగ్రెస్ ఇచ్చిన నోటీసును రాజ్యసభ అనుమతించలేదని

మిగతా 2వ పేజీలో...



పొన్నం లేదా మహేశ్‌గౌడ్‌ను

సీఎం చేయాలి!

- బీసీలపై రేవంత్‌కున్న ప్రేమను చాటుకోవాలి
- దత్తాత్రేయను ఉపరాష్ట్రపతి చేయాలన్న ముఖ్యమంత్రి డిమాండ్ సంతోషకరం
- రేవంత్ తన విమర్శలతో మోదీనే కాదు బీసీలనూ అవమానించారు
- బండి, ఈటల వివాదం సమసిపోతుంది
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

ముందు మీ నాయకుడిది ఏ కులమో చెప్పు!

- ప్రధాని మోదీని కన్వర్టెడ్ బీసీ అంటావా?
- సీఎం వ్యాఖ్యలకు కిషన్‌రెడ్డి కౌంటర్

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నేత, హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను ఉపరాష్ట్రపతిని చేయాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేయడం సంతోషకరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. అదేసమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ లేదా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ముఖ్యమంత్రిని చేసి.. బీసీల పట్ల తనకున్న ప్రేమను రేవంత్ చాటుకోవాలని

మిగతా 3వ పేజీలో...



మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జుతో ప్రధాని మోదీ

₹4,850 కోట్లు.. మాల్దీవులకు రుణ సాయం

ఆ దేశ పర్యటనలో ప్రకటించిన మోదీ

ప్రధానికి ఘన స్వాగతం పలికిన ముయిజ్జు

ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి చర్చలు

మాలె, జూలై 25: మాల్దీవులకు రూ. 4,850 కోట్ల రుణ సాయం చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆ దేశానికి భారత్ నమ్మకమైన మిత్రుడని పేర్కొన్నారు. శనివారం జరగనున్న మాల్దీవుల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు మాల్దీవుల రాజధాని మాలెలో శుక్రవారం ఉదయం ఘన స్వాగతం

మిగతా 2వ పేజీలో...

హెచ్‌సీఏ కార్యదర్శి

దేవరాజ్ అరెస్టు

పుణెలో అరెస్టు.. హైదరాబాద్‌కు తరలింపు

క్రికెట్ వేసవి శిబిరాల పేరుతో రూ.4 కోట్ల నిధులు స్వాహా?

హెచ్‌సీఏ అధ్యక్షుడిగా జగన్ మాయ

ముగ్గురు నిందితులకు బెయిల్ మంజూరు

హెచ్‌సీఏ లీగ్ మ్యాచ్‌ల నిర్వహణకు ఏకసభ్య కమిటీ.. హైకోర్టు ఆదేశం

12

ఆకలి చావుల అంచున గాజా



పిట్టల్లా రాలిపోతున్న చిన్నారులు

నిత్యావసరాల సరఫరాపై ఇజ్రాయెల్ ఆంక్షలే కారణం

ఇజ్రాయెల్-హమాస్ మధ్య శాంతి చర్చలు నిలిపివేసిన అమెరికా!

పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించనున్న ఫ్రాన్స్

గాజా, పారిస్, వాషింగ్టన్, జూలై 25: ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి జరిపిన 2023 అక్టోబర్ 7 తర్వాత నుంచి గాజాలో పరిస్థితులు దారుణంగా మారుతున్నాయి. యుద్ధం కారణంగా మహిళలు, చిన్నారుల పరిస్థితి దయనీయంగా తయారైంది. ముఖ్యంగా పోషకాహార లోపం, ఆకలితో చిన్నారులు అల్లాడిపోతున్నారు. శరీరం బక్కచిక్కి, పొత్తి కడుపులు ముడుచుకుపోయి, ఎముకలు

మిగతా 10వ పేజీలో...

నిలువ నీడ లేక సర్కారు

బడిలోనే ఆశ్రయం

సిద్దిపేట జిల్లా మైసమ్మవాగు తండా మాజీ సర్పంచ్ కుటుంబం దీనస్థితి

అప్పులు చేసి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టిన సర్పంచ్ లావణ్య

బిల్లులు రాక 2 ఎకరాల భూమి, సొంతింటిని అమ్ముకున్న వైనం

మూతబడ్డ స్కూల్లో ఆశ్రయం

3

33 దేశాలు.. 362 కోట్లు!

» 2021-25 మధ్య ప్రధాని మోదీ విదేశీ పర్యటన ఖర్చు ఇది

న్యూఢిల్లీ, జూలై 25: ప్రధాని మోదీ 2021-25 మధ్య 33 దేశాల్లో పర్యటించారని.. ఆయా దేశాల్లో పర్యటనలకు సంబంధించి రూ.362 కోట్లు ఖర్చయిందని కేంద్రం పేర్కొంది. గురువారం రాజ్యసభలో భారత విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ ఆయా పర్యటనలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ జాబితాలో ప్రస్తుత బ్రిటన్, మాల్దీవుల పర్యటనకు సంబంధించిన ఖర్చులను చేర్చలేదన్నారు. ఈ నెల మొదట్లో వెళ్లిన ఐదు దేశాల పర్యటన సహా మొత్తం ఐదేళ్లలో ప్రధాని 33 దేశాల్లో పర్యటించారని తెలిపారు. అయితే కెనడా, బ్రెజిల్, మారిషస్ దేశాల పర్యటన బిల్లులను పూర్తిగా చెల్లించనందున వాటిని లెక్కల్లో చేర్చలేదని పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫ్రాన్స్, అమెరికా, ఏప్రిల్‌లో థాయ్‌లాండ్, శ్రీలంక, సౌదీ అరేబియాలలో పర్యటించారని.. వీటి ఖర్చు రూ.67కోట్లు అయిందన్నారు. వీటిలో ఫ్రాన్స్, అమెరికాలలో పర్యటించినప్పుడు ఎక్కువ ఖర్చు చేయాల్సి వచ్చిందని.. ఇది రూ.25.59 కోట్లుగా ఉందన్నారు. ఫిబ్రవరి 13న ప్రధాని అమెరికాలో పర్యటించారని.. ఆ ఒక్క రోజే రూ.16.54 కోట్లు ఖర్చు పెట్టాల్సి వచ్చిందని తెలిపారు.



కమల్‌ను సత్కరిస్తున్న రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ తదితరులు

రాజ్యసభ సభ్యుడిగా కమల్‌హాసన్ ప్రమాణం

చెన్నై, జూలై25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు నుంచి రాజ్యసభకు ఎంపికైన 'మక్కల్ నీదిమయ్యం' అధినేత, ప్రముఖ సినీ నటుడు కమల్‌హాసన్ సహా ఆరుగురు శుక్రవారం పార్లమెంట్‌లో ప్రమాణస్వీకారం చేశారు. డీఎంకేకు చెందిన రాజ్యసభ సభ్యులు పి.విల్సన్, షణ్ముగం, అబ్దుల్లా, అన్నాడీఎంకేకు చెందిన చంద్రశేఖరన్, ఎండీఎంకే నేత వైగో, పీఎంకే సభ్యుడు అన్బుమణి పదవీకాలం గురువారంతో ముగిసింది. వీరి స్థానంలో తమిళనాడు నుంచి డీఎంకే మద్దతుతో ఎంపికైన కమల్‌హాసన్, ఆ పార్టీకి చెందిన సీనియర్ న్యాయవాది విల్సన్, కవయిత్రి సల్మా, ఎస్ ఆర్ శివలింగం, అన్నాడీఎంకే తరఫున ఎంపికైన ఇన్బదురై, ధనపాల్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. వీరంతా తమిళంలోనే ప్రమాణం చేశారు. 2018లో కమల్ 'మక్కల్ నీదిమయ్యం' పార్టీ స్థాపించారు. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆపార్టీ ఘోరపరాజయం పాలైంది. అయితే 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కమల్ పార్టీ డీఎంకే కూటమికి మద్దతు పలికింది. ఆ ఎన్నికల్లో ఎలాంటి స్థానం కేటాయించని డీఎంకే అధినేత స్టాలిన్.. భవిష్యత్తులో కమల్‌ను రాజ్యసభకు పంపుతామని హామీనిచ్చారు. ఆ మేరకు ఇప్పుడు కమల్ డీఎంకే మద్దతుతో ఏకగ్రీవంగా ఎన్నికై రాజ్యసభలోకి అడుగు పెట్టారు.

ఉద్యోగాల కల్పనకు కేంద్రం ప్రోత్సాహకాలు

» పీఎంవీబీఆర్‌వై ఆవిష్కారం.. ఆగస్టు 1 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ, జూలై 25: కొత్తగా ఉద్యోగాల కల్పనను ప్రోత్సహించేందుకు కేంద్రం నూతన పథకాన్ని ఆవిష్కరించింది. పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పీఎంవీబీఆర్‌వై) పేరుతో ఉద్యోగ అనుసంధాన ప్రోత్సాహక పథకాన్ని ప్రారంభించినట్టు శుక్రవారం కార్మిక శాఖ తెలిపింది. ఈ పథకం ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానుందని, వచ్చే రెండేళ్లలో 3.5 కోట్లకు ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంతో ఈ పథకానికి రూ.99,446 కోట్లు కేటాయించినట్టు తెలిపింది. ఇందులో 1.92 కోట్ల మంది మొదటిసారిగా ఉద్యోగం పొందిన వారు ఉండాలని ఆశయంగా పెట్టుకొంది. 2025 ఆగస్టు ఒకటో తేదీ నుంచి 2027 జూలై 31లోగా ఈ ఉద్యోగాలను కల్పించాల్సి ఉంటుంది. కొత్తగా ఉద్యోగాలు పొందినవారితోపాటు ఉద్యోగాలు కల్పించిన యజమానులకూ ప్రోత్సాహకాలు అందించనుండడం ఈ పథకం ప్రత్యేకత. వస్తువుల తయారీ రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వనుంది. ఈ పథకం పార్ట్-ఏలో తొలిసారిగా ఉద్యోగాలు పొందిన వారికి, పార్ట్-బిలో యజమానులకు అందించే ప్రోత్సాహకాలను ప్రస్తావించారు. తొలిసారిగా ఉద్యోగాలు పొందిన వారు ఈపీఎఫ్‌వోలో పేరు నమోదు చేసుకొని ఉంటే వారికి ఒక నెల ఈపీఎఫ్ వేతనాన్ని ప్రోత్సాహకంగా ఇస్తారు. ఇది గరిష్ఠంగా రూ.15,000 వరకు ఉంటుంది. రూ.లక్ష వరకు వేతనం పొందే వారూ ఈ ప్రోత్సాహకం పొందేందుకు అర్హులే. ఆరు నెలల సర్వీసు పూర్తయిన తర్వాత తొలి విడత ప్రోత్సాహకం లభిస్తుంది. 12 నెలలు ఉద్యోగం చేసి, యాజమాని నిర్వహించే 'ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమా'న్ని పూర్తి చేసిన తర్వాత రెండో విడత ప్రోత్సాహకం చెల్లిస్తారు. దీన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలోగానీ, సేవింగ్స్ పత్రాల రూపంలోగానీ కొంతకాలంపాటు డిపాజిట్ చేయాలి. కొత్తగా సృష్టించే ఉద్యోగాలకే ఈ ప్రోత్సాహకం లభిస్తుంది. పార్ట్-బి ప్రకారం అదనంగా కల్పించే ప్రతి ఉద్యోగానికి ప్రోత్సాహకం కింద యజమానికి ప్రతినెలా రూ.3,000 చొప్పున రెండేళ్లు ఇస్తారు. తయారీ రంగ యజమానులకైతే మూడు, నాలుగేళ్లపాటు కూడా ఈ ప్రయోజనం కల్పిస్తారు.

ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం

జైపూర్, జూలై 25: ఎయిరిండియా విమానాల్లో సాంకేతిక లోపాల పరంపర కొనసాగుతోంది. శుక్రవారం మధ్యాహ్నం 1.35 గంటలకు జైపూర్ నుంచి ముంబై బయల్దేరిన విమానం నిమిషాల వ్యవధిలోనే వెనక్కొచ్చింది. టేకాఫ్ అయిన 18 నిమిషాల్లోపే అందులో సాంకేతిక లోపాన్ని పైలట్లు గుర్తించడంతో తిరిగి జైపూర్‌కు మళ్లించారని ఎయిర్‌లైన్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్ రాడార్ పేర్కొంది. ఇటీవల కాలంలో ఎయిరిండియా విమానాల్లో తరచూ సమస్యలు చోటుచేసుకోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా, ఈ ఏడాది జూలై 21 నాటికి ఐదు విమానయాన సంస్థలు మొత్తం 183 సాంకేతిక సమస్యలను నమోదు చేశాయని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ జాబితాలో అత్యధికంగా ఎయిరిండియా గ్రూప్‌నకు చెందినవే 85 వరకూ ఉన్నాయి.

జస్టిస్ వర్మ అభిశంసన లోక్‌సభలోనే!



(మొదటి పేజీ తరువాయి)

చెబుతోంది. దాంతో బీజేపీ కోరుకున్నట్టు లోక్‌సభలో బీజేపీ ఆధ్వర్యంలో జస్టిస్ వర్మ అభిశంసన కార్యక్రమాన్ని చేపట్టే అవకాశం లభించింది. 21వ తేదీన లోక్‌సభ, రాజ్యసభ రెండూ ఒకేసారి అభిశంసన తీర్మానం నోటీసులను అందుకున్న నేపథ్యంలో చట్టం ప్రకారం ఇరు సభల సభ్యులతో కలిపి విచారణ కమిటీ వేయాల్సి ఉంటుందని జగదీప్ ధన్‌ఖడ్ అదేరోజు ప్రకటించారు. అయితే, ఇప్పుడు రాజ్యసభలో నోటీసే లేనందున రెండు సభల్లో కలిపి విచారణ కమిటీ వేయడం ఉండదని భావిస్తున్నారు. ఇప్పుడు లోక్‌సభలో చేపట్టాలని నిర్ణయించడంతో అన్నీ లోక్‌సభ ద్వారా జరగనున్నాయి. రాజ్యసభలో అభిశంసన తీర్మానాన్ని చేపట్టాలన్న ఉద్దేశాన్ని జగదీప్ ధన్‌ఖడ్ వ్యక్తపరచి ఉంటే రాజ్యసభలో బీజేపీ ఎంపీలే చొరవ తీసుకొని సంతకాలు పెట్టించే వారని, ఈ అవకాశాన్ని కాంగ్రెస్ చేతుల్లో పెట్టడంపైనే తమ అభ్యంతరమని బీజేపీ వర్గాలు తెలిపాయి. జస్టిస్ వర్మను ఇంటికి పంపాలన్నది అన్ని పార్టీలు తీసుకున్న నిర్ణయమని, లోక్‌సభ నోటీసును బీజేపీ చేపట్టినప్పటికీ అన్ని పార్టీల వారు సంతకాలు చేశారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. లోక్‌సభలో తీర్మానం తర్వాత రాజ్యసభ ఈ అంశాన్ని చేపడుతుందన్నారు. మరోపక్క ఎన్నికల సంఘం ఉప రాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియను మొదలు పెట్టింది. ఆగస్టు నెలాఖరుకు కొత్త ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటారని ఈసీ వర్గాలు తెలిపాయి.

ధన్‌ఖడ్‌కు విపక్షం వీడ్కోలు?

మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌కు వీడ్కోలు కార్యక్రమం చేపట్టడానికి అధికార పక్షం సిద్ధంగా లేని నేపథ్యంలో విపక్షమే ఆయనకు వీడ్కోలు విందు కార్యక్రమాన్ని చేపట్టాలని యోచిస్తోంది. బీజేపీ ఇష్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రతిపాదించిన అభిశంసన నోటీసును చేపట్టి అధినాయకత్వం ఆగ్రహానికి గురైన ధన్‌ఖడ్ సోమవారం హడావిడిగా రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఆయనకు రాజ్యసభలో తుది ప్రసంగం చేసే అవకాశం కూడా రాలేదు. ఈ నేపథ్యంలో ఆయనకు జరిగిన అవమానాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకైనా ఆయనకు విందు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ యోచిస్తోంది. అయితే, ఈ విందుకు ధన్‌ఖడ్ వస్తారా? అన్నది అనుమానమే.

సోషలిస్టు, సెక్యులర్ పదాలను తొలగించే యోచన కేంద్రానికి లేదు

» అవి రాజ్యాంగంలో అంతర్భాగమని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టతనిచ్చింది

» బయట జరిగే చర్చలకు ప్రభుత్వానికి సంబంధం లేదు: అర్జున్ మేఘ్వాల్

న్యూఢిల్లీ, జూలై 25: రాజ్యాంగం ప్రవేశిక నుండి 'సోషలిస్టు', 'సెక్యులర్' పదాలను తొలగించే యోచన కేంద్ర ప్రభుత్వానికి ఏమీ లేదని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ స్పష్టం చేశారు. సోషలిజం అంటే మన దేశ పరిస్థితుల ప్రకారం సంక్షేమ రాజ్యమేగానీ ప్రైవేటురంగం వృద్ధిని అడ్డుకోవటం కాదని, అలాగే రాజ్యాంగం మౌలిక స్వరూపంలో సెక్యులరిజం అంతర్భాగమని సుప్రీంకోర్టు గతేడాది ఇచ్చిన తీర్పును మంత్రి ఉటంకించారు. ఈ మేరకు రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలే ఇటీవల ఓ సభలో మాట్లాడుతూ.. సోషలిస్టు, సెక్యులర్ పదాలు రాజ్యాంగం ప్రవేశికలో వాస్తవానికి లేవని తెలిపారు. 1976లో ఇందిరాగాంధీ హయాంలో దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు, 42వ రాజ్యాంగ సవరణ ద్వారా వాటిని చేర్చారని గుర్తు చేశారు. మధ్యలో చేర్చిన ఈ పదాలను తొలగించాల్సిన అవసరం ఉందని, దీనిపై చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై సమాజ్‌వాదీపార్టీ ఎంపీ రాంజీలాల్ సుమన్.. ప్రభుత్వ వివరణ కోరారు. రాజ్యాంగం ప్రవేశిక నుండి సోషలిస్టు, సెక్యులర్ పదాలను తొలగించటానికి అవసరమైన వాతావరణాన్ని సృష్టించటంలో భాగంగానే ఇటువంటి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయా అని ప్రశ్నించారు. దీనిపై మంత్రి అర్జున్ మేఘ్వాల్ సమాధానం ఇస్తూ.. రాజకీయ వర్గాల్లో, ప్రజల్లో ఈ అంశంపై చర్చలు జరుగుతుండవచ్చుగానీ.. ప్రభుత్వం మాత్రం సదరు పదాలను తొలగించటంపై అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదని, ఆ యోచన కూడా లేదని తెలిపారు. బయట జరుగుతున్న చర్చలకు ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. ప్రవేశికలో ఏమైనా సవరణలు చేపట్టాలంటే సమగ్రమైన చర్చలు, విస్తృత ఆమోదంతోనే అది సాధ్యమని.. ప్రవేశికలో మార్పులు చేపట్టే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని చెప్పారు.

లోకం తీరు



పహల్గాంపై చర్చకు సై

న్యూఢిల్లీ, జులై 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడిపై పార్లమెంటులో చర్చించేందుకు కేంద్రం ఎట్టకేలకు అంగీకరించింది. శుక్రవారం జరిగిన సభా వ్యవహారాల సలహా కమిటీ సమావేశంలో.. లోక్‌సభలో 16 గంటల పాటు రాజ్యసభలో 16 గంటల పాటు చర్చ నిర్వహించాలని నిర్ణయించారు. చర్చను రక్షణమంత్రి రాజ్‌నాథ్ ప్రారంభిస్తారని, హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జై శంకర్ చర్చల్లో పాల్గొంటారని బీజేపీ వర్గాలు తెలిపాయి. ప్రధాని మోదీ ఈ చర్చలో పాలు పంచుకుంటారని వెల్లడించాయి. కాంగ్రెస్ నుంచి రాహుల్, ప్రియాంక, సమాజ్‌వాది పార్టీ ఎంపీ అఖిలేశ్ యాదవ్ తదితరులు పహల్గాం ఘటనపై ప్రశ్నలు లేవనెత్తేందుకు సిద్ధపడుతున్నారు. దీనితో సోమవారం సభ వాడి వేడిగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. పహల్గాంలో నిఘా వైఫల్యం, దాడి చేసిన ఉగ్రవాదులను అరెస్టు చేయలేకపోవడం, భారత యుద్ధ విమానాల కూల్చివేతపై ట్రంప్ ప్రకటన, దౌత్య వైఫల్యాలపై నిలదీసేందుకు ప్రతిపక్షాలు సమాయత్తం అవుతున్నాయి.

ఉభయసభల్లో 'సర్' గందరగోళం

బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై విపక్ష సభ్యుల నిరసన

న్యూఢిల్లీ, జూలై 25: పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో గందరగోళం కొనసాగుతూనే ఉంది. విపక్ష సభ్యుల ఆందోళనలతో ఉభయసభల్లో ఎలాంటి కార్యకలాపాలూ కొనసాగడం లేదు. బిహార్‌లో 'ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్‌ఐఆర్-సర్)'పై శుక్రవారం కూడా ప్రతిపక్షాలు నిరసనలు కొనసాగించాయి. ఫలితంగా వర్షాకాల సమావేశాల్లో తొలి వారం మొత్తం తుడిచిపెట్టుకు పోయినట్లయింది. ఏ అంశంపైన అయినా చర్చించేందుకు సిద్ధమని కేంద్ర ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తున్నా.. విపక్ష సభ్యులు మాత్రం పట్టించుకోకుండా ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. శుక్రవారం లోక్‌సభ సమావేశమైన వెంటనే విపక్ష సభ్యులు నినాదాలు, ప్లకార్డులతో నిరసనకు దిగడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. 2 గంటలకు సమావేశమైన తర్వాత కూడా ప్రతిపక్ష సభ్యులు సర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. స్పీకర్ స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ స్పందిస్తూ.. "ఈ గందరగోళం, రభస వల్ల ఎవ్వరికీ ప్రయోజనం ఉండదు. ప్రజలు వారి సమస్యలను లేవనెత్తుతారని మిమ్మల్ని ఇక్కడికి పంపించారు. కానీ, మీరు సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్నారు. సభను వాయిదా వేయించడం అంటే ఏదో సాధించినట్లు కాదు. ఇది ఆందోళనకరమైన అంశం. యావత్ దేశానికే హానికరం" అని విపక్ష సభ్యులకు హితవు పలికారు. రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి కొనసాగడంతో ఎలాంటి కార్యకలాపాలూ జరగకుండానే సభ వాయిదా పడింది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా ఇండీ కూటమికి చెందిన పలువురు ఎంపీలు 'సర్' పోస్టర్లను చించివేశారు. పార్లమెంటు భవన సముదాయంలోని చెత్తబుట్టల్లో వాటిని పడేసి, నిరసన ప్రదర్శన చేశారు. సర్‌ను ఉపసంహరించుకోవాలని, దీనిపై ఉభయసభల్లో చర్చ జరపాలని అన్నారు.



'సర్' ప్లకార్డులతో రాహుల్, ప్రియాంక నిరసన

నిప్పుతో చెలగాటం వద్దు: స్టాలిన్

బిహార్‌లో ఓట్ల తొలగింపుపై తమిళనాడు సీఎం స్టాలిన్ తీవ్రంగా స్పందించారు. నిప్పుతో చెలగాటమాడవద్దని బీజేపీని హెచ్చరించారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్టాలిన్ శుక్రవారం ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ప్రకటన విడుదల చేశారు. ఇదిలా ఉండగా, బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్‌ఐఆర్) పేరుతో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రక్షాళన 99.8% పూర్తయినట్లు ఆ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) కార్యాలయం ప్రకటించింది.

ఇందిరా గాంధీ రికార్డును అధిగమించిన మోదీ

ప్రధానిగా 4,078 రోజుల పాటు పదవిలో

న్యూఢిల్లీ, జూలై 25: ప్రధాని నరేంద్ర మోదీ మరో ఘనతను సాధించారు. అత్యధిక కాలంపాటు పదవిలో కొనసాగిన రెండో ప్రధానిగా ఇందిరాగాంధీ పేరుతో ఉన్న రికార్డును ఆయన శుక్రవారం అధిగమించారు. ఇందిరాగాంధీ 1966 జనవరి 24 నుంచి 1977 మార్చి 24 వరకు ఏకధాటిగా 4,077 రోజుల పాటు పదవిలో కొనసాగారు. ప్రస్తుతం మోదీ శుక్రవారం నాటికి 4,088 రోజుల పదవీ కాలాన్ని పూర్తి చేశారు. ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఓటమిని ఎరగకుండా అత్యధిక కాలం పాటు పదవిలో కొనసాగారు. వరుసగా మూడుసార్లు కాంగ్రెస్‌కు విజయం సాధించిపెట్టారు. 1947 ఆగస్టు 15 నుంచి 1964 మే 27 వరకు మొత్తం 6,130 రోజులు పదవిలో కొనసాగారు. ప్రస్తుతం ఆ తర్వాతి స్థానంలో మోదీ ఉన్నారు. పదవిలో కొనసాగుతూ వరుసగా బీజేపీని గెలిపిస్తున్న రాజకీయ నాయకునిగా ఇప్పటికే మోదీ ఘనత సాధించారు. ఆయన 2002, 2007, 2012ల్లో జరిగిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి సీఎంగా బాధ్యతలు నిర్వహించారు. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి ప్రధాని పదవిని చేపట్టారు. ఇంతవరకు ఏ ఎన్నికల్లోనూ ఆయన ఓడిపోలేదు. వరుసగా ఆరు ఎన్నికల్లో విజయం సాధించి సీఎంగా, పీఎంగా కొనసాగిన ఏకైక నాయకుడు మోదీయే కావడం విశేషం. ప్రధానిగా రెండు టర్ములు పూర్తి చేసుకున్న కాంగ్రెసేతర నేత కూడా ఆయనే కావడం మరో విశేషం.

రాజస్థాన్‌లో కుప్పకూలిన స్కూల్ భవనం

ఏడుగురు విద్యార్థుల దుర్మరణం.. మరో 28 మందికి గాయాలు

» కొందరి పరిస్థితి విషమం.. ఉదయం ప్రార్థనకు సిద్ధమవుతుండగా ఘటన

» వర్షాలతో నిలిచిన వరద.. ఆ నీటికి గోడలు దెబ్బతినడంతోనే ప్రమాదం

ఝలావర్, జూలై 25: రాజస్థాన్‌లో ఘోరం జరిగింది. ఝలావర్ జిల్లా పిప్లోడి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల భవనంలోని ఓ భాగం కూలిపోయింది. ఈ ఘటనలో స్లాబు, ఇటుక గోడల శిథిలాల కింద చిక్కుకొని ఏడుగురు విద్యార్థులు మృతి చెందారు. మరో 28 మంది పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం ఉదయం 7:45 గంటలకు విద్యార్థులు ప్రార్థన కోసం సిద్ధమవుతుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన విద్యార్థులను చికిత్స నిమిత్తం ఝలావర్‌లోని ఆస్పత్రికి తరలించారు. వీరిలో 9మందికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ బడిలో ఐదు తరగతి గదులు, ఒక కార్యాలయ గది ఉన్నాయి. స్కూలు భవనాన్ని 1994లో నిర్మించారు. 2011లో అదనంగా కొన్ని గదులను నిర్మించారు. ప్రస్తుతం కూలిపోయింది 31 ఏళ్ల క్రితం నిర్మించిన భవనంలోని పోర్షనే! అందులో 6, 7 తరగతుల విద్యార్థులు కూర్చుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాత భవనం చుట్టూ వరద చేరిందని.. ఆ నీటి చెమ్మకు గోడలు ఉబ్బిపోయి.. పూర్తిగా దెబ్బతినడం వల్లే భవనం కూలిపోయిందని జిల్లా విద్యాశాఖ అధికారి చెప్పారు. ప్రమాదంలో మొత్తంగా 35 మంది విద్యార్థులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. ఘటనపై ఉన్నతాధికారులకు సమాచారమిచ్చిన 45 నిమిషాల తర్వాత అంబులెన్స్ వచ్చింది. ఆ లోపు ఉపాధ్యాయులు, స్థానికులు, పిల్లల తల్లిదండ్రులు వచ్చి శిథిలాలను తొలగించే ప్రయత్నం చేశారు. స్థానికుల్లో ఒకరు తన ఎక్స్‌కావేటర్‌ను తెచ్చి శిథిలాలను తొలగించారు. గాయపడిన విద్యార్థులను ద్విచక్రవాహనాల మీదే ఆస్పత్రికి తరలించారు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని.. స్కూలు భవనం శిథిలావస్థకు చేరుకుందని కొన్నాళ్ల క్రితమే అధికారులను కలిసి ఫిర్యాదు చేసినా వారు స్పందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాద ఘటనకు బాధ్యులను చేస్తూ ప్రధానోపాధ్యాయురాలు మీనా గార్గ్ సహా ఐదుగురు ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. ఈ ఘటనను రాజస్థాన్ మానవ హక్కుల సంఘం సుమోటోగా స్వీకరించింది. ప్రమాదంపై సమగ్ర నివేదిక అందజేయాలని, ప్రమాదానికి బాధ్యులపై తీసుకునే చర్యలు, మృతుల కుటుంబాలకు అందజేయనున్న పరిహారం వివరాలు తెలపాలని ఝలావర్ జిల్లా విద్యాధికారికి, బికనెర్‌లోని డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు, ఝలావర్ ఎస్పీకి నోటీసులు జారీచేసింది. ఈ ప్రమాదంపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గాయపడిన పిల్లలు వేగంగా కోలుకోవాలని ముర్ము ఎక్స్ వేదికగా ఆకాంక్షించారు. ఈ ఘటన తీవ్ర బాధాకరం అని.. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు అధికారులు సాధ్యమైనన్ని చర్యలు తీసుకుంటున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు.



శిథిలాల నుంచి విద్యార్థులను వెలికి తీస్తున్న స్థానికులు

మాల్దీవులకు 4,850 కోట్ల రుణ సాయం

(మొదటి పేజీ తరువాయి)

లభించింది. ఈ సందర్భంగా ఆ దేశ అధ్యక్షుడు మహమద్ ముయిజ్జు, పలువురు ఆ దేశ మంత్రులు స్వయంగా మాలెలోని వెలెనా అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చి ప్రధానికి స్వాగతం పలికారు. అనంతరం రిపబ్లిక్ స్క్వేర్‌లో సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికి సైనిక వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఇద్దరూ స్వయంగా పలు అంశాలపై చర్చలు జరిపారు. అనంతరం ఇరు దేశాల ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. వాణిజ్యం, రక్షణ, మౌలిక వసతులు వంటి అంశాల్లో సహకరించుకోవాలని నిర్ణయించారు. కొంతకాలంగా ఇరు దేశాల మధ్య సంబంధాలు పలు కారణాల వల్ల దెబ్బతిన్న తర్వాత తాజా పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఇరు దేశాలు ఒక ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం చేసుకొనేందుకు చర్చలు జరుపుతున్నట్లు ప్రధాని మోదీ చెప్పారు. అంతేగాక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపైనా చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. పొరుగు దేశాలకు ప్రథమ ప్రాధాన్యం, మహాసాగర్(మ్యూచువల్ అండ్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్ ఫర్ సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఎక్రాస్ రీజియన్స్) అనే భారత విధానంలో మాల్దీవులకు ప్రధాన పాత్ర ఉందని పేర్కొన్నారు. రక్షణ, భద్రత అంశాల్లో సహకారం పరస్పర విశ్వాసానికి కీలకం అన్నారు. మాల్దీవుల రక్షణ రంగం బలోపేతానికి భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందన్నారు. 'అధ్యక్షుడు ముయిజ్జు స్వయంగా విమానాశ్రయానికి వచ్చి స్వాగతం పలకడం నా హృదయానికి హత్తుకుంది.. రానున్నకాలంలో ఇరు దేశాల సంబంధాలు ఎంతో ఉన్నత స్థాయికి చేరతాయి' అని మోదీ ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో విశ్వాసం వ్యక్తంచేశారు. కాగా ప్రధాని మోదీ మాల్దీవుల పర్యటనతో ఇరు దేశాల దౌత్య సంబంధాల్లో సానుకూల మార్పు వస్తుందని విశ్లేషకుల అంచనా. మాల్దీవుల్లో ఏకీకృత చెల్లింపుల విధానం(యూపీఐ)ని కూడా ఈ సందర్భంగా ప్రారంభించనున్నారు. కాగా మాల్దీవులపై చైనా పట్టును సడలింపజేసి హిందూ మహా సముద్ర ప్రాంతంలో ఆ దేశ ఆధిపత్యం లేకుండా చూడాలని భారత్ ఆశిస్తోంది.



'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమం ప్రచారంలో భాగంగా మాలేలో మొక్కను నాటుతున్న మోదీ, చిత్రంలో ముయిజ్జు

క్లింటన్‌కూ ఎప్‌స్టైన్‌తో సంబంధాలు!

ఎప్‌స్టైన్‌కు బిల్ క్లింటన్ లేఖ..వాల్ స్ట్రీట్ జర్నల్ వెల్లడి

వాషింగ్టన్, జూలై 25: ఫెడరల్ సెక్స్ ట్రాఫికింగ్ ఆరోపణలతో అరెస్టై.. జైలులో మరణించిన జెఫ్రీ ఎప్‌స్టైన్‌తో అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్‌కు కూడా సంబంధాలున్నాయని వాల్ స్ట్రీట్ జర్నల్ ఓ కథనాన్ని ప్రచురించింది. ఎప్‌స్టైన్ 50వ పుట్టిన రోజు సందర్భంగా రూపొందించిన ప్రత్యేక ఆల్బమ్‌లో క్లింటన్ రాసిన ఓ లేఖకు కూడా చోటు కల్పించినట్లు.. అందులో క్లింటన్ స్వహస్తాలతో రాసిన అక్షరాల్లో స్పష్టంగా కనిపిస్తున్న భాగాలను వాల్ స్ట్రీట్ జర్నల్ ప్రచురించింది. ఈ పుస్తకాన్ని ఎప్‌స్టైన్ మాజీ ప్రేయసి మ్యాక్స్‌వెల్ ఆధ్వర్యంలో తయారు చేశారు. అందులో ట్రంప్, క్లింటన్ సహా.. వాల్ స్ట్రీట్ బిలియనీర్ లియోన్ బ్లాక్, ఫ్యాషన్ డిజైనర్ వేరావాంగ్, మీడియా అధినేత మోర్ట్ జుకెర్మన్ రాసిన లేఖలున్నాయి. బిల్ క్లింటన్ కవితాత్మకంగా అందులో లేఖ రాశారు. ఎప్‌స్టైన్‌ది చిన్నపిల్లాడి మనస్తత్వమని, సుదీర్ఘకాలం స్నేహాలను కొనసాగిస్తారని అందులో కొనియాడారు. 50 ఏళ్లు వచ్చినా.. ఇంకా కుర్రాడిలా ఉత్సాహంగా ఉంటారని, సాహసాలు చేస్తుంటారని పేర్కొన్నారు. క్లింటన్ రాసిన కొన్ని పదాలు అస్పష్టంగా ఉన్నట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. కాగా.. 2019లో ఎప్‌స్టైన్ అరెస్టు కాక ముందు.. క్లింటన్ అతనితో నాలుగు సార్లు ప్రైవేట్ జెట్‌లో ప్రయాణించడం గమనార్హం..! ఈ ప్రయాణాలన్నీ క్లింటన్ ఫౌండేషన్ ద్వారా జరిగినట్లు సమాచారం. వీరిద్దరూ 1993లో వైట్‌హౌస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఫొటో దిగారు. కాగా.. ఎప్‌స్టైన్ పుట్టిన రోజు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ లేఖ రాశారంటూ ఇటీవల వాల్ స్ట్రీట్ జర్నల్ ఓ కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే..! ఆ కథనాన్ని ఖండించిన ట్రంప్.. వాల్ స్ట్రీట్ జర్నల్‌పై 10 బిలియన్ డాలర్ల మేర పరువు నష్టం దావా వేశారు.

డ్రోన్ నుంచి దూసుకెళ్లిన స్వదేశీ క్షిపణి

(మొదటి పేజీ తరువాయి)

డీఆర్‌డీవో కర్నూలులోని నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ (ఎన్‌ఓఏఆర్)లో పరీక్షించింది. దీంతో శత్రుదుర్భేద్యమైన ప్రాంతాల్లో కూడా మానవరహిత ఏరియల్ వెహికిల్ ద్వారా ఈ క్షిపణిని సంధించవచ్చు. విజయవంతమైన ఈ పరీక్ష విషయాన్ని శుక్రవారం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. భారత రక్షణ సామర్థ్యాల్లో ఇదో మైలురాయి అని ఆయన అభివర్ణించారు. స్వదేశీ రక్షణ పరిశ్రమ ఇప్పుడు సంక్లిష్టమైన రక్షణ సాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేయగలదని, అలాగే ఉత్పత్తి చేయగలదని ఆయన అన్నారు. గతంలో డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన యూఎల్‌పీజీఎం-వీ2 కన్నా ఇది మెరుగైన వెర్షన్. యూఎల్‌పీజీఎం-వీ3లో హెచ్‌డీ డ్యూయల్ చానల్ సీకర్‌ను ఏర్పాటు చేయడం వల్ల వివిధ రకాల లక్ష్యాలను ఇది ఛేదించగలదు. మైదాన ప్రాంతాలు, ఎత్తయిన ప్రదేశాల్లోనూ ఈ క్షిపణితో దాడులు చేయవచ్చు. పగలు, రాత్రి వేళల్లో దాడి చేయగల సామర్థ్యం దీని సొంతం అని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. కాగా ఈ క్షిపణిని బెంగళూరుకు చెందిన న్యూస్పేస్ రీసెర్చ్ టెక్నాలజీస్ అనే స్వదేశీ స్టార్టప్ సంస్థ రూపొందించిన డ్రోన్ ద్వారా పరీక్షించారు. అదానీ డిఫెన్స్, బీడీఎల్, 30 ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు ఈ పరీక్షలో భాగస్వాములుగా ఉన్నాయని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కాగా, కర్నూలులోని నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ నుంచి డ్రోన్ ద్వారా క్షిపణి ప్రయోగం విజయవంతం కావడంపై ఏపీ సీఎం చంద్రబాబు కూడా అభినందనలు తెలిపారు.

యూఎల్‌పీజీఎం-వీ3 విశేషాలివీ..

- డ్రోన్ల(యూఏవీ) నుంచి ప్రయోగించే క్షిపణి ఇది.
- రక్షణ సిబ్బందికి ప్రమాదాలు తగ్గించడానికి, పూర్తి కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించడానికి అభివృద్ధి చేశారు.
- అధునాతన యుద్ధాలకు తగ్గట్లుగా సాంకేతిక పరిజ్ఞానం అమర్చారు. కదులుతున్న లక్ష్యాలనూ ఛేదిస్తుంది.
- కవచం ఉన్న అధునాతన సాయుధ వాహనాలను ఇది ధ్వంసం చేయగలదు. బంకర్లలోకి చొచ్చుకెళ్లి పేలే వార్‌హెడ్ దీనిలో ఉంది.,
- చీకట్లోనూ లక్ష్యాలను కచ్చితంగా గుర్తించడానికి ఇమేజింగ్ ఇన్‌ఫ్రారెడ్ సీకర్స్ కెమెరాలను ఏర్పాటు చేశారు.
- ఆకాశం నుంచి భూమి మీద గల లక్ష్యాలను ఛేదిస్తుంది. పగటిపూట 4 కిలో మీటర్లు, రాత్రి 2.5 కిలోమీటర్ల రేంజ్‌ను చేరుకుంటుంది.

2వేల కోట్లతో ఫైర్ కంట్రోల్ రేడార్లు

వైమానిక రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. అధునాతన ఎయిర్ డిఫెన్స్ ఫైర్ కంట్రోల్ రేడార్ల కొనుగోలుకు సంబంధించి భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)తో రూ.2 వేల కోట్ల ఒప్పందం కుదుర్చుకుంది. యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లు సహా అన్ని రకాల వైమానిక ముప్పులను ఈ రేడార్లు గుర్తించగలవని రక్షణ శాఖ తెలిపింది.

నిలువ నీడ లేక సర్కారు బడిలోనే ఆశ్రయం

- సిద్దిపేట జిల్లాలో ఓ మాజీ సర్పంచ్ దీనస్థితి
- అభివృద్ధి పనుల బిల్లులు రాక అప్పులపాలు
- ఆస్తులు అమ్ముకొని అద్దె ఇంట్లోకి కుటుంబం
- యజమాని హఠాన్మరణంతో రోడ్డున పడ్డ వైనం



పాఠశాల భవనంలో వంట చేస్తున్న మాజీ సర్పంచ్ లావణ్య, తాజా మాజీ సర్పంచ్ లావణ్య కుటుంబం

అక్కన్నపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి బిల్లులు వస్తాయనే నమ్మకంతో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టిన ఓ తాజా మాజీ సర్పంచ్‌కు నిలువ నీడ లేకుండా పోయింది. బిల్లులు రాక, అప్పుల పాలై ఉన్న ఆస్తులను అమ్ముకున్న ఆ మాజీ సర్పంచ్ కుటుంబం.. గత్యంతరం లేని పరిస్థితిలో మూతబడిన ప్రభుత్వ పాఠశాలలో ఆశ్రయం పొందుతోంది. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మైసమ్మవాగు తండా తాజా మాజీ సర్పంచ్ సందేబోయిన లావణ్య దీనస్థితి ఇది. 2019లో బీఆర్ఎస్ నుంచి సర్పంచ్‌గా ఎన్నికైన లావణ్య.. బిల్లులు తర్వాత వస్తాయనే నమ్మకంతో అప్పులు చేసి మరీ గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టారు. బిల్లులు రాకపోవడం, అప్పుల భారం పెరగడంతో ఇంటితోపాటు రెండెకరాల భూమిని విక్రయించారు. కానీ అప్పులు తీరలేదు. సొంతింటిని అమ్ముకున్న తర్వాత సమీపంలోని కుందనవానిపల్లి గ్రామంలో ఓ చిన్న ఇంట్లో లావణ్య కుటుంబం అద్దెకు చేరింది. విద్యుదాఘాతానికి గురై ఆ ఇంటి యజమాని గురువారం మరణించగా.. లావణ్య కుటుంబం ఇంటిని ఖాళీ చేయాల్సి వచ్చింది. అయితే, సమయానికి గ్రామంలో మరో ఇల్లు లభించకపోవడంతో లావణ్య కుటుంబం మైసమ్మవాగు తండాలో మూతబడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చేరింది. ప్రభుత్వం, మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని తాజా మాజీ సర్పంచ్ లావణ్య కోరుతున్నారు.

అప్పుల బాధతో సిద్దిపేటలో యువ రైతు ఆత్మహత్య

- విద్యుదాఘాతంతో నిజామాబాద్‌లో అన్నదాత మృతి


బండారి మహేశ్

తొగుట/ భీమ్‌గల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం రాష్ట్రంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు రైతులు దుర్మరణం పాలయ్యారు సిద్దిపేట జిల్లా తొగుట వాసి బండారు మహేశ్ (34) తన 15 గుంటల భూమిలో వ్యవసాయం.. మిగతా వేళ హమాలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవలే ఆరెకరాల భూమి కౌలుకు తీసుకుని, అప్పు చేసి మరీ 4 ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. మిగతా భూమిలో వరి నాటు వేయడానికి దుక్కి సిద్ధం చేశాడు. కానీ, ఇటీవలే మంజూరైన ఇందిరమ్మ ఇల్లు కట్టడానికి డబ్బుల్లేక మహేశ్ మనోవేదనకు గురయ్యాడు. ఒకవైపు కుటుంబ పోషణ, మరొక వైపు అప్పుల బాధలు, ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఈ నెల 22న గడ్డి మందు తాగి అస్వస్థతకు గురైన మహేశ్‌ను కుటుంబ సభ్యులు తొలుత సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి గమనించిన వైద్యులు.. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఆయనకు భార్య లత, కూతుళ్లు ప్రవళ్లిక (8), మను దీపిక (6), తల్లి ఎల్లవ్వ ఉన్నారు. మరోవైపు, నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం రహత్ నగర్‌లో గడ్డి కోసే యంత్రానికి విద్యుత్ సరఫరా కావడంతో దారావత్ రాంసింగ్ (50) అనే రైతు దుర్మరణం పాలయ్యాడు. విద్యుత్ స్తంభం నుంచి బోరు మోటారుకు వేసిన వైర్లు తెగి గడ్డి కోసే యంత్రంపై పడ్డాయి. అప్పటికే ఆ యంత్రంతో గడ్డి కోస్తున్న రాంసింగ్ విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మరణించాడు.

రాహుల్‌ది ఏ కులమో చెప్పు

మోదీని కన్వర్టెడ్ బీసీ అంటావా?.. సీఎం రేవంత్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం



న్యూఢిల్లీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీని కన్వర్టెడ్ బీసీ అంటున్న సీఎం రేవంత్‌రెడ్డి.. మొదట వారి నాయకుడు (రాహుల్ గాంధీ) ఏ సామాజికవర్గమో, ఏ కులమో చెప్పాలని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై ఇచ్చిన ప్రజెంటేషన్‌లో ప్రధాని మోదీని కన్వర్టెడ్ బీసీ అన్నారని.. సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి మిడిమిడి జ్ఞానంతో అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. శుక్రవారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "1994లో గుజరాత్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మండల్ కమిషన్ నివేదిక ప్రకారం.. మోదీ కులాన్ని బీసీ జాబితాలో చేర్చింది. అప్పుడు మోదీ ఎమ్మెల్యేగా కూడా లేరు. అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ కులాన్ని జాతీయ స్థాయిలో ఓబీసీ జాబితాలో చేర్చింది. అదే సమయంలో విశ్వబ్రాహ్మణులతో పాటు మరికొన్ని కులాలను కూడా బీసీల్లో చేర్చారు. ఆ తర్వాత కూడా చాలా కులాలను ఎస్సీ, ఎస్టీల జాబితాలో చేర్చారు. మరి వారందరినీ కూడా కన్వర్టెడ్ కులాలకు చెందిన వారని చెబుతారా?" అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. పెంచిన బీసీ రిజర్వేషన్లతో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలని బీజేపీ కోరుకుంటోందని.. అయితే ఆ 42శాతం రిజర్వేషన్లు అక్బరుద్దీన్, అసదుద్దీన్, అజారుద్దీన్, షబ్బీర్ అలీ వంటి ముస్లిం వర్గానికి కాకుండా పూర్తిగా బీసీలకే అందేలా ఉండాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనలో 56 శాతం బీసీలు ఉన్నట్టు తేలిందంటూ.. అందులోనే 10 శాతం ముస్లింలను చూపించిందన్నారు. 10శాతం ఈబీసీ రిజర్వేషన్లలో ముస్లింలు లబ్ధి పొందే అవకాశం ఉందని, మళ్లీ బీసీల కింద చూపి మరో 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని రేవంత్‌రెడ్డి, రాహుల్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇలా తెచ్చే బీసీ రిజర్వేషన్లతో అసదుద్దీన్ పార్టీ, షబ్బీర్ అలీ, అజారుద్దీన్ వంటి కాంగ్రెస్ నేతలకు లబ్ధి చేకూర్చడమే తప్ప.. బీసీలకు ఒనగూరే ప్రయోజనమేమీ లేదన్నారు. తాము కాంగ్రెస్‌లా తూతూమంత్రపు సర్వేలు చేయబోమని... రాజ్యాంగ బద్ధంగా కులగణన చేసి, బీసీలకు న్యాయం చేస్తామని కిషన్‌రెడ్డి చెప్పారు.

పార్టీ నిర్ణయిస్తే సమర్థిస్తాం..

బండారు దత్తాత్రేయను ఉపరాష్ట్రపతి చేయాలన్న సీఎం రేవంత్ వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా.. కిషన్‌రెడ్డి స్పందిస్తూ.. "వేరే వారికి నీతులు చెప్పే ముందు రేవంత్‌రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేసి, బీసీని ముఖ్యమంత్రిని చేయాలి. దత్తాత్రేయ ఉపరాష్ట్రపతి అభ్యర్థిత్వంపై మా పార్టీ నిర్ణయం తీసుకుంటే తప్పకుండా సమర్థిస్తాం" అని చెప్పారు. తెలంగాణలో ఫోన్‌ట్యాపింగ్‌పై ఇప్పటివరకూ చర్యలేమీ లేవని, కాంగ్రెస్ అధిష్ఠానానికి, బీఆర్ఎస్‌కు మధ్య అవగాహన కుదిరిందని ఆరోపించారు.

బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రణాళికలు: పాయల్ శంకర్

కులగణన ద్వారా బీసీల జనాభా లెక్క తేలినప్పుడు ఆ ప్రాతిపదికన రాష్ట్ర మంత్రివర్గంలో ఎందుకు మంత్రి పదవులు ఇవ్వట్లేదని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ మాటలకు, చేతలకు పొంతన లేదని.. కేవలం బీజేపీని బద్నాం చేసి తప్పించుకోవాలని చూస్తోందని ఆరోపించారు.

పొన్నం లేదా మహేశ్‌గౌడ్‌ను ముఖ్యమంత్రిని చేయాలి!

(మొదటి పేజీ తరువాయి)



సూచించారు. రేవంత్‌రెడ్డికి 'ఆస్కార్ కాదు.. 'భాస్కర్ ' అవార్డు ఇవ్వాలని వ్యంగ్యంగా అన్నారు. ప్రధాని మోదీ కన్వర్టెడ్ బీసీ అంటూ ప్రచారం చేస్తున్నందుకు ఆయనకు గోబెల్స్ బహుమతి ఇవ్వాలని పేర్కొన్నారు. దీనిపై తాము సోనియాకు లేఖ రాస్తామని తెలిపారు. రేవంత్ తన విమర్శల ద్వారా మోదీనే కాదని, బీసీలందరినీ అవమానించారని ధ్వజమెత్తారు. బీజేపీని బీసీలకు దూరం చేసేందుకు కుట్ర జరుగుతోందని రాంచందర్‌రావు అన్నారు. తాను కూడా బీసీ (బ్రాహ్మణ కమ్యూనిటీ)నే అని చమత్కరించారు. బ్రాహ్మణుడినని చెప్పుకొన్న రాహుల్‌కు గాయత్రీ మంత్రం వచ్చా? సంధ్యావందనం చేస్తారా? అని రేవంత్‌ను ప్రశ్నించారు. కులగణన చేసిన కాంగ్రెస్ సర్కారు.. అన్ని కులాల వివరాలను ఎందుకు వెల్లడించడం లేదని నిలదీశారు. శుక్రవారమిక్కడి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మధ్య తలెత్తిన వివాదం సమసిపోతుందని చెప్పారు. అన్ని పార్టీల్లోనూ ఇలాంటివి సహజమన్న ఆయన.. తమ పార్టీలో ఇలాంటివి బహిరంగంగా జరిగి ఉండాల్సింది కాదని అభిప్రాయపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలని రాంచందర్‌రావు సీఎం రేవంత్‌ను డిమాండ్ చేశారు. హైడ్రా ఒక విఫల సంస్థ అని విమర్శించారు. పరువు నష్టం కేసుకు సంబంధించి తాను ఇచ్చిన నోటీసుకు డిప్యూటీ సీఎం భట్టి సమాధానం ఇవ్వలేదని, తదుపరి చర్యగా హైకోర్టును ఆశ్రయిస్తానని చెప్పారు.

మేం బీసీలకు 42 శాతం పదవులిస్తాం

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకున్నా తాము మాత్రం పార్టీలో బీసీలకు 42 శాతం పదవులు ఇస్తామని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మతపరమైన రిజర్వేషన్లకు తాము వ్యతిరేకమన్నారు. కేవలం బీసీలకే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే ప్రభుత్వానికి మద్దతిస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని రాంచందర్‌రావు ప్రకటించారు. క్షేత్రస్థాయిలో పర్యటించాలని, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించాలని పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తనకు నిర్దేశించారని తెలిపారు. శని, ఆదివారాల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో, ఆ తర్వాత ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటిస్తానని చెప్పారు. బీజేపీ రాష్ట్ర కమిటీని వారంలోగా ప్రకటిస్తామని రాంచందర్‌రావు తెలిపారు. తనతో కలిపి 20 మంది సభ్యులు ఉంటారన్నారు. ఈ కమిటీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామన్నారు. కాగా, రాష్ట్రంలో జరిగే ఏ ఎన్నికలోనైనా బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని రాంచందర్‌రావు ప్రకటించారు. ఏ పార్టీతోనూ పొత్తు ఉండబోదని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికను సవాలుగా తీసుకుంటున్నట్లు తెలిపారు.

కారును గోడెక్కించేశాడు!

ప్రహరీ గోడపై కారు! ఏదో సినిమా చిత్రీకరణలో భాగంగా అలా పెట్టారేమో అనుకునేరు! ప్రమాదవశాత్తే జరిగింది. రోడ్డుపై వేగంగా దూసుకెళుతూ డివైడర్‌ను ఢీకొని, అదే వేగంలో గాల్లోకి ఎగిరి.. రోడ్డు పక్కన ఉన్న ఇంటి ప్రహరీపై ఇలా సెటిల్ అయింది. ముంచుకొస్తున్న నిద్రను ఆపుకోలేక క్షణం పాటు కళ్లు మూసుకుపోయి.. మళ్లీ కళ్లు తెరిచి చూసే సరికి తాను నడుపుతున్న వాహనం గోడ మీద ఉండటం చూసి డ్రైవర్‌సాబ్‌కు మద్యం మత్తు వదిలిపోయింది! స్టీరింగ్ వదిలేసి.. డోరు ఓపెన్ చేసి కిందకు దూకి పారిపోయాడు. దుండిగల్ మునిసిపాలిటీలోని శంభీపూర్ గ్రామ పరిధిలోని మహేశ్వరం వద్ద శుక్రవారం తెల్లవారుజామున 2:30 గంటలకు ఈ ఘటన జరిగింది. డ్రైవర్ మద్యం మత్తులో మితిమీరిన వేగంతో కారు నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు చెప్పారు. ఆ కారులో డ్రైవర్ కాకుండా మరో ఇద్దరు ఉన్నారు. వారికి స్వల్ప గాయాలయ్యాయి. భారీ శబ్దం రావడంతో నిద్రలేచిన ఆ ఇంటి యజమాని, కుటుంబసభ్యులు ప్రహరీ మీద కారు ఉండటం చూసి నోరెళ్లబెట్టారు. ప్రహరీపై కారు ఉన్న ఫొటో నెట్‌లో వైరల్‌గా మారింది.

- దుండిగల్, (ఆంధ్రజ్యోతి)

శివ బాలకృష్ణ కేసు..
మూడు ఇన్‌ఫ్రా కంపెనీల్లో ఈడీ సోదాలు

- లెక్కల్లో చూపని రూ.72లక్షల నగదు స్వాధీనం



హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో అరెస్టయిన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణకు సంబంధించిన మూడు రియల్ ఎస్టేట్ సంస్థల్లో ఈడీ అధికారులు గురు, శుక్ర వారాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లెక్కల్లో చూపని రూ.72లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. శ్రీ కృష్ణా కన్‌స్ట్రక్షన్స్, క్యారీజోన్ స్పేస్, ఉదయ ఎస్ఎస్‌వీ ప్రాజెక్టుల కార్యాలయాలు, డైరెక్టర్ల ఇళ్లల్లోనూ సోదాలు నిర్వహించామని ఈడీ హైదరాబాద్ జోన్ అధికారులు తెలిపారు. ఈ సోదాల్లో పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. హెచ్ఎండీఏతో పాటు టీఎస్ రెరా కార్యదర్శిగా పని చేసిన శివ బాలకృష్ణ తన అక్రమార్జనను రియల్ ఎస్టేట్ రంగంలోకి మళ్లించినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ఈ నెల మొదటి వారంలోనే శివ బాలకృష్ణ, అతడి సోదరుడు ఇళ్లలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించి, పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. శివ బాలకృష్ణపై తొలుత ఏసీబీ అధికారులు అక్రమాస్తుల కేసు నమోదు చేయగా, రూ.200కోట్లకుపైగా ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు రావడంతో ఈడీ అధికారులు రంగంలో దిగారు. ఉదయ ఎస్ఎస్‌వీ ప్రాజెక్టు యజమాని రాజశేఖర్ బాబు నుంచి శివబాలకృష్ణ రూ.కోటి లంచం తీసుకుని లబ్ధి చేకూర్చారని ఏసీబీ అధికారులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. అయితే, లంచంతోపాటు ఆ సంస్థలో భాగస్వామ్యం కూడా తీసుకున్నట్టుగా ఈడీ సోదాల్లో డాక్యుమెంట్లు లభించినట్లు తెలుస్తోంది.

మానేరు నదిపై కొత్త వంతెన!

- 3 ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఆర్ అండ్ బీ

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలోని మానేరు నదిపై కొత్త వంతెన నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. మంథని నియోజకవర్గ పరిధిలో సుమారు రూ.120కోట్లతో వంతెన నిర్మించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు రోడ్లు, భవనాల శాఖ మూడు ప్రతిపాదనలను సిద్ధం చేయగా, వీటిపై మంత్రి శ్రీధర్ బాబు శనివారం సమీక్షించనున్నట్లు సమాచారం. మంథని నుంచి కాళేశ్వరం వెళ్లాలన్నా, గారెపల్లి, వెంకటాపూర్, స్వర్ణపల్లి, సార్నెపల్లి, నాగేపల్లి సహా పలు గ్రామాల ప్రజలు గంగారం క్రాస్‌రోడ్డు వైపు వెళ్లాలన్నా.. దాదాపు 30-40 కి.మీ. మేర ప్రయాణం చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం గారెపల్లి నుంచి గంగారం క్రాస్‌రోడ్డు వెళ్లే మార్గంలో అటవీసోమన్‌పల్లి- వల్లెంకుంట మధ్యన బ్రిడ్జి అందుబాటులో ఉన్నప్పటికీ.. చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దీంతో ప్రయాణానికి అనువుగా ఉండేలా కొత్త వంతెనను నిర్మించాలని సర్కారు భావిస్తోంది. ఈ మేరకు ఆర్అండ్‌బీ అధికారులు మూడు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆప్షన్-1లో స్వర్ణపల్లి నుంచి గంగారం సమీపం వరకు(1.08 కి.మీ.), ఆప్షన్-2లో వెంకటాపూర్ నుంచి గంగారం వైపు(950 మీటర్లు), ఆప్షన్-3లో ఆరెందకు దగ్గర్లో ఉన్న ఎస్సీ కాలనీ నుంచి దామెరకుంట సమీపం వరకు (1.16కి.మీ.) నిర్మించాలని ప్రతిపాదించారు.

యాదగిరిగుట్ట సత్యదేవుడి వ్రత టికెట్ ధర పెంపు

యాదగిరిగుట్ట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో సత్యదేవుడి వ్రత టికెట్ ధర పెరిగింది. గతంలో రూ.800 ఉండగా, శుక్రవారం నుంచి కొత్త ధర రూ.1000 అమలులోకి వచ్చింది. ఈ పెంపుతో భక్తులకు అదనంగా శెల్ల, కనుము, స్వామివారి ప్రతిమలు అందజేస్తారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో వెంకట్రావు దంపతులు వేర్వేరుగా టికెట్ కొనుగోలు చేసి వ్రతాలు ఆచరించారు. అలాగే, నూతనంగా నిర్మించిన ప్రసాదాల టికెట్ కౌంటర్‌ను ప్రారంభించారు. మరోవైపు, యాదగిరిక్షేత్రానికి వచ్చే భక్తుల క్యూలైన్లను వేగంగా, క్రమపద్ధతిలో నడపడంపై ట్రైనింగ్ ఆన్ క్రౌడ్ మేనేజ్‌మెంట్ విశ్లేషకుడు ప్రసన్నకుమార్ సిబ్బందికి అవగాహన కల్పించారు.

మేడిగడ్డ బ్యారేజీపై భద్రత కట్టుదిట్టం

- భారీ వాహనాల రాకపోకలకు బ్రేక్
- బైక్‌లు, పాదచారులకు అనుమతి


మేడిగడ్డ బ్యారేజీపై వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ ఏర్పాటు చేసిన గేట్లు

భూపాలపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ భద్రతను అధికారులు కట్టుదిట్టం చేశారు. బ్యారేజీ పైనుంచి గతంలో అనుమతించిన కార్లు, ట్రాక్టర్లు వంటి లైట్ మోటర్ వాహనాల రాకపోకలను కూడా ప్రస్తుతం నిషేధించారు. కేవలం ద్విచక్ర వాహనాలు, పాదచారులకు మాత్రమే అనుమతినిస్తున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ సరిహద్దుల్లోని సిరివంచ, అంబటిపల్లి, కొత్తపల్లి, బీజాపూర్, నారాయణపూర్ ప్రాంతాలకు ఈ బ్యారేజీ అనుసంధానంగా ఉండేది. ఆయా ప్రాంతాల ప్రజలు వైద్యం వంటి అత్యవసర సేవల కోసం బ్యారేజీపై నుంచి రాకపోకలు సాగించేవారు. బ్యారేజీ దెబ్బతిన్న తర్వాత నీటిపారుదల శాఖ అధికారులు భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. కేవలం ట్రాక్టర్లు, అంబులెన్సులు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలను మాత్రమే అనుమతించారు. అయితే బ్యారేజీ సెక్యూరిటీ సిబ్బందిపై మహారాష్ట్రకు చెందిన కొంతమంది వాహనదారులు దాడులకు పాల్పడుతుండడంతో అధికారులు సెక్యూరిటీ పోస్టును బ్యారేజీ నుంచి కొంత దూరానికి మార్చి ప్రస్తుతం రెండు వైపులా రాకపోకలను నియంత్రిస్తున్నారు. మహారాష్ట్ర వైపు ఉన్న గేటును శాశ్వతంగా మూసివేసి, భారీ వాహనాలను కాళేశ్వరం వంతెన మీదుగా మళ్లిస్తున్నారు.

స్థానికులకు ప్రధాన రవాణా మార్గం

భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబటిపల్లి, మహారాష్ట్రలోని సిరొంచ తాలూకాలోని కొత్తపల్లి ప్రాంతాలకు మేడిగడ్డ బ్యారేజీనే ప్రధాన మార్గంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా మహారాష్ట్రలోని కొత్తపల్లి, తదితర గ్రామాల ప్రజలు తమ నిత్యవసరాలు మొదలుకుని విద్య, వైద్యం కోసం, వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకోవడం కోసం భూపాలపల్లి, వరంగల్ ప్రాంతాలకు వస్తుంటారు. సిరివంచ తాలూకాలో 70 శాతం జనాభా తెలుగువారే కావడంతో ఇరుప్రాంతాల మధ్య వివాహ సంబంధాలు కూడా కొనసాగుతున్నాయి. బ్యారేజీ నిర్మాణానికి ముందు గోదావరి దాటడానికి మహదేవపూర్ మండలం కాళేశ్వరం మీదుగా సుదూరంగా ప్రయాణించి ట్రాక్టర్ల ద్వారా వడ్లు, పత్తి, మిర్చి పంటలను వ్యవసాయ మార్కెట్‌తో పాటు వరి కొనుగోలు కేంద్రాలకు తరలించేవారమని రైతులు చెబుతున్నారు. తాజాగా బ్యారేజీపై రాకపోకలను నిలిపివేయడంతో మళ్లీ ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీలక్ష్మి విచారణ ఎదుర్కోవాల్సిందే!

(మొదటి పేజీ తరువాయి)



క్రిమినల్ రివిజన్ పిటిషన్‌ను కొట్టివేసింది. మాజీ మంత్రి, మైనింగ్ వ్యాపారి గాలి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అక్రమ మైనింగ్ కుంభకోణానికి శ్రీలక్ష్మి సహాయపడ్డారని సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఇతర నిందితులుగా ఉన్న ఓఎంసీ డైరెక్టర్లు బీవీ శ్రీనివాసరెడ్డి, గాలి జనార్దన్‌రెడ్డి, అప్పటి గనుల శాఖ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, అలీఖాన్‌లను సీబీఐ కోర్టు దోషులుగా తేల్చిన విషయం తెలిసిందే. అయితే శ్రీలక్ష్మి క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేయడంతో హైకోర్టు ఆమెకు ఊరట కల్పించింది. దీంతో ఆమె పాత్రపై సీబీఐ కోర్టులో విచారణ జరగలేదు. హైకోర్టు ఊరట కల్పించడంపై సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. హైకోర్టు తీర్పును కొట్టేసింది. శ్రీలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌పై మళ్లీ విచారణ చేపట్టి, మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టుకు స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టింది. శ్రీలక్ష్మి తరఫున వివేక్‌రెడ్డి వాదనలు వినిపించారు. "ఓఎంసీకి లీజుల కేటాయింపునకు సంబంధించి నేను పరిశ్రమల శాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించే నాటికే నాకంటే ముందున్న కార్యదర్శి కృపానందం, మంత్రి సబితాఇంద్రారెడ్డి ఓఎంసీకి లీజు కేటాయించాలని నిర్ణయం తీసుకున్నారు. నేను వచ్చిన తర్వాత ఆ నిర్ణయాలను అమలు చేశారు. లీజు జీవోలో క్యాప్టివ్ మైనింగ్ అనే పదం కావాలనే పెట్టలేదని సీబీఐ ఆరోపిస్తోంది. అసలు క్యాప్టివ్ మైనింగ్ అనే షరతు విధించరాదని కేంద్రమే ఆదేశాలు జారీచేసింది. నేను రాక ముందే అన్నీ జరిగిపోయాయి. నా కంటే ముందే ఉన్న కార్యదర్శి, మంత్రి నిర్దోషులుగా తేలిన తర్వాత నా పాత్రను ఎలా తప్పుబడతారు?" అని ప్రశ్నించారు. సీబీఐ తరఫు న్యాయవాది శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. 'మంత్రి అనుమతి లేకుండా శ్రీలక్ష్మి కేంద్రానికి లేఖలు రాశారు. ఓఎంసీకి గనుల కేటాయింపునకు ముందస్తు అనుమతి ఇవ్వాలని.. అలా ఇచ్చాక కేటాయింపు ప్రక్రియ ప్రారంభిస్తామని లేఖలో తెలిపారు. ఓఎంసీకి అనుకూలంగా వ్యవహరించినట్లు ఆధారాలున్నాయి. శ్రీలక్ష్మి బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకున్న నిర్ణయాలే అమలయ్యాయి' అని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. మైనింగ్ లీజులు, క్యాప్టివ్ మైనింగ్ వంటివన్నీ వివాదాస్పద అంశాలని.. అవన్నీ పూర్తిస్థాయి విచారణలోనే తేలతాయని పేర్కొంది. ప్రస్తుత క్రిమినల్ రివిజన్ పిటిషన్‌లో ఇటు పిటిషనర్, అటు సీబీఐ చెబుతున్న విషయాలన్నీ వాస్తవమా? కాదా? అని హైకోర్టు నిర్ణయించలేదని స్పష్టంచేసింది. ఓఎంసీ కేసులో శ్రీలక్ష్మి పాత్ర ఏంటనేది విచారణలోనే తేలుతుందని.. ఆమె విచారణను ఎదుర్కోవాల్సిందేనని తేల్చిచెప్పింది. శ్రీలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కలిమి-బలిమి

మాల్దీవులతోనూ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం దిశగా చర్చలు ఆరంభమైనాయని అంటున్నారు భారత ప్రధాని నరేంద్రమోదీ. భారత్‌కు మాల్దీవులు అత్యంత విశ్వసనీయదేశమని, 'పొరుగుకే తొలి ప్రాధాన్యం' కింద ఆ దేశానికి ప్రముఖస్థానం ఉంటుందని శుక్రవారం బ్రిటన్ నుంచి మాల్దీవులకు చేరుకున్న ఆయన హామీ ఇచ్చారు. బ్రిటన్‌తో కుదిరిన స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం మన పాలకులకు మంచి ఉత్సాహాన్నిచ్చినట్టుంది. ఒకదేశపు ఉత్పత్తులు మరోదేశంలోకి హద్దులు లేకుండా ప్రవేశిస్తూ, నియంత్రణలు లేని వాణిజ్యం సాగుతున్నప్పుడు ఆ విధానంతో ఒకదేశం కాస్తంత నష్టపోక తప్పదన్న వాదనను పాలకులు, స్వేచ్ఛావాణిజ్య ప్రబోధకులు ఏ మాత్రం ఒప్పుకోరు. భారత్–బ్రిటన్ మధ్యకుదిరిన ఒప్పందంతో రెండు దేశాలకూ ఏకరీతిగా మేలు జరుగుతుందని అనుకున్నపక్షంలో, మళ్ళీ ఎవరికివారు స్వదేశంలో తమకే ఎక్కువ లబ్ధి చేకూరుతుందని ఎందుకు ప్రచారం చేసుకుంటున్నారో అర్థంకాదు.

భారత్–బ్రిటన్ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)తో భారత్‌కే ఎక్కువ ప్రయోజనమని రిజర్వుబ్యాంకు గవర్నర్ కూడా అంటున్నారు. భారత ఆర్థిక వ్యవస్థలోని అనేక రంగాల అభివృద్ధికి ఈ ఒప్పందం సహాయపడుతుందనీ, ఇలాగే అనేక దేశాలతో మనం ఒప్పందాలు చేసుకోవాలని ఆయన అంటున్నారు. ప్రపంచవాణిజ్య సంస్థ నియమాలు, నిబంధనలను ట్రంప్ వంటివారు ఉల్లంఘిస్తూ, సుంకాల యుద్ధాలు చేస్తున్న తరుణంలో ఇటువంటి ద్వైపాక్షిక స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలతో భద్రత సమకూర్చుకోవాల్సిన అవసరం కాదనలేనిది. అమెరికా సహా చాలాదేశాలతో ఎఫ్‌టీఏల కోసం ఇప్పటికే మనదేశం వాణిజ్యచర్చలు చేస్తున్నది కూడా. భారత్–బ్రిటన్ ఎఫ్‌టీఏని తక్షణ ఆర్థిక ప్రయోజనాల ప్రాతిపదికన అంచనావేయకూడదని, ఇది ఉభయదేశాల ద్వైపాక్షిక బంధాన్నీ, మైత్రినీ, ఇతరత్రా రంగాలకు సైతం విస్తరించగలిగే సహాయసహకారాలనూ ప్రభావితం చేసే అంశమని విశ్లేషకులు సలహా. రెండుదేశాల సంబంధాలను ఇంతవరకూ గతకాలపు వలసపాలన వాసనలు ప్రభావితం చేశాయని, ఇప్పుడు ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా నిలబడిన భారతదేశం తనను ఒకప్పుడు ఏలిన దేశంతో సమానస్థాయిలో వాణిజ్యం చేయబోతున్నదని, పరస్పర గౌరవం, విశ్వాసం, ప్రయోజనాల ప్రాతిపదికన ఇది రూపొందిందని వారంటారు. ఉభయదేశాల భావి తరాలకు ఈ ఒప్పందం పలురకాల ప్రయోజనాలను చేకూరుస్తుందని కూడా వారు హామీ ఇస్తున్నారు.

యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి వైదొలిగిన బ్రిటన్‌కు ఈ ఒప్పందం ఎక్కువ సంతోషం కలిగించినమాట నిజం. 'బ్రెగ్జిట్' ప్రక్రియ ఆ దేశాన్ని రాజకీయంగానూ, ఆర్థికంగానూ బాగా కుదిపేసింది. వీడిపోవాలని నిర్ణయించుకున్న బ్రిటన్‌తో ఈయూ అగౌరవంగా వ్యవహరించింది. తెగదెంపులను కష్టతరం చేసింది. బ్రిటన్ వరుస ప్రధానులను బ్రెగ్జిట్ బలితీసుకుంది. ఈయూనుంచి బయటకు వచ్చిన బ్రిటన్‌కు భారత్ సహకారం అవసరమని బోరిస్ జాన్సన్ అప్పట్లోనే గ్రహించి ఈ ఎఫ్‌టీఏ ప్రతిపాదన ముందుకు తెచ్చారు. అనంతరం లిజ్‌ట్రస్, రిషీసునాక్ కూడా నిష్క్రమించి, ఎన్నికల్లో లేబర్‌పార్టీ నెగ్గి, స్టార్మర్ వచ్చిన తరువాతగానీ ఇది వాస్తవరూపం దాల్చలేదు. బ్రిటన్ పార్లమెంట్ ధ్రువీకరణ ఏడాదిలోగా పూర్తయి ఆచరణలోకి రావడమే కాక, మరో నాలుగేళ్ళలోనే ఉభయదేశాల వాణిజ్య పరిమాణం 12వేల కోట్ల డాలర్లకు చేరాలన్నది లక్ష్యం. ఈ ఒప్పందంతో తగ్గబోతున్న సుంకాలు, పెరగబోతున్న ఎగుమతులు, బాగుపడే రంగాలమీద లోతైన విశ్లేషణలు సాగుతున్నాయి. ఖరీదైన వివిధ బ్రాండ్ల బ్రిటిష్ మద్యం మనదేశంలో ప్రవహిస్తుంది, జాగ్వార్లు, ల్యాండ్‌రోవర్లు మనరోడ్లమీద షికార్లు చేస్తాయి. అక్కడా ఇక్కడా కూడా కార్లతయారీలో ఉన్న టాటాలకు ఈ ఒప్పందం లబ్ధిచేకూరుస్తుంది. ఈ ఒప్పందంమీద రెండుదేశాల్లోనూ సముచితమైన భయాలు, అనుమానాలు లేకపోలేదు. వలసవిధానం మారదు, భారతదేశంనుంచి వచ్చే కార్మికుల సంఖ్య పెరగదని అక్కడి పాలకులు తమవారికి నచ్చచెప్పుకుంటున్నారు. ఇక్కడి చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి ఏ నష్టమూ వాటిల్లదని మనవారు భరోసా ఇస్తున్నారు. ప్రస్తుతానికి ఓ యాభైవేల కోట్ల రూపాయల వాణిజ్య వ్యవహారంగా ఉపరితలంలో కనిపిస్తున్నా, దీనిపునాదిగా అన్నిరంగాల్లోకీ విస్తరించబోయే దౌత్యబంధంతో భవిష్యత్తులో మనకు ఎంతో మేలు చేకూరుతుందన్న హామీలను ఇప్పటికైతే విశ్వసిద్దాం.

ధన్‌ఖడ్ ఉత్థాన పతనాలు

జూలై 10, 2025న జగదీప్ ధన్‌ఖడ్ చాలా సంతోషంగా ప్రకటించారు: 'సరైన సమయం–ఆగస్టు 2027– లో నేను పదవీ విరమణ చేస్తాను'. 'దైవిక జోక్యానికి లోబడి' అని కూడా ఆయన అన్నారు. ధన్‌ఖడ్ భారత ఉపరాష్ట్రపతి. ఆ రాజ్యాంగ పదవి రీత్యా ఆయన రాజ్యసభకు ఛైర్మన్. జూలై 21న ఆయన ఆకస్మికంగా తన పదవికి రాజీనామా చేశారు. పర్యవసానంగా రాజ్యసభ ఛైర్మన్ బాధ్యతల నుంచి కూడా నిష్క్రమించారు. జూలై 10, జూలై 21 మధ్య సంభవించింది జీవితాన్ని వివరించ వీలులేని విషయంగా చేసేదే సుమా!

జూలై 21న పార్లమెంటు ఉభయ సభలు సాధారణంగా ప్రారంభమయ్యాయి. అంతకు ముందు రోజు ప్రభుత్వం ఆనవాయితీ ప్రకారం ఉభయ సభలలోని సమస్త పార్టీల నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సరే, అన్ని అంశాల పైన చర్చలకు, ప్రవేశపెట్టిన బిల్లులు ఆమోదం పొందేందుకు సహకరించాలని అధికారపక్షం వారు కోరడం, ప్రతిపక్షాల నేతలు సంపూర్ణంగా సహకరిస్తామని చెప్పడం జరిగింది. విచారకరమైన విషయమేమిటంటే ఒక తక్షణ ప్రాధాన్యమున్న అంశంపై సభ ఎప్పుడు, ఎలా చర్చించాలి అన్న విషయమై ప్రభుత్వ, ప్రతిపక్షాల మధ్య ప్రస్తుతం ఏకాభిప్రాయం లేదు. రాజ్యసభలో ప్రతిపక్షం సామాన్యంగా నిబంధన 267 కింద చర్చ జరగాలని పట్టుబడుతుంది. సభా కార్యక్రమాల జాబితాలోని అంశాలను వాయిదా వేసేందుకు ఉపకరించే ప్రత్యేక సాధనమే నిబంధన 267. సంబంధిత తీర్మానాన్ని 'వాయిదా తీర్మానం'గా పేర్కొంటారు. నిబంధన 267 కింద చర్చను కోరడం పెద్ద విషయమేమీ కాదు. అయితే ఇది ప్రభుత్వాన్ని 'అభిశంసించడం'గా ఎన్డీఏ సర్కార్ పరిగణిస్తోంది (బహుశా, గతంలో కొన్ని ప్రభుత్వాలు కూడా ఇదే వైఖరి తీసుకుని ఉంటాయి). గత 11 సంవత్సరాలలో నిబంధన 267 కింద చర్చకు అధికారపక్షం చివరిసారి అంగీకరించింది నవంబర్ 2016లో 'పెద్ద నోట్ల రద్దు'పై కావడం గమనార్హం. ధన్‌ఖడ్ రాజ్యసభ ఛైర్మన్ అయిన తరువాత నిబంధన 267 కింద ఎప్పుడూ ఎలాంటి చర్చను అనుమతించలేదు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఈ జూలై 21న కూడా భిన్నంగా ఏమీ జరగలేదు బీజేపీ సభ్యుడు ఒకరు నిబంధన 167 కింద పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చించేందుకు నోటీస్ ఇచ్చారు. పలువురు ప్రతిపక్ష సభ్యులు అదే అంశంపై చర్చకు నిబంధన 267 కింద నోటీసులు ఇచ్చారు. బీజేపీ సభ్యుడి నోటీస్‌ను సభాధ్యక్షుడు స్వీకరించారు. ప్రతిపక్ష సభ్యుల నోటీసులను తిరస్కరించారు. అవి నిర్దేశిత విధానానికి అనుగుణంగా లేవని ఎప్పుడూ చెప్పే కారణాన్నే చెప్పారు. సభలో సహజంగానే గందరగోళం ఏర్పడింది.

రాజ్యసభ ఛైర్మన్ సభా కార్యక్రమాల సలహా సంఘం (బీఏసీ) సమావేశాన్ని మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహించారు. ప్రభుత్వ ప్రతినిధులుగా జేపీ నడ్డా, కిరణ్ రిజిజు హాజరయ్యారు. కొంతసేపు చర్చ జరిగిన తరువాత ఆ సమావేశాన్ని సాయంత్రం 4.30 గంటలకు వాయిదా వేశారు. బీఏసీ మళ్లీ సమావేశమైనప్పుడు కేబినెట్ మంత్రులు ఇరువురూ హాజరు కాలేదు. ఛైర్మన్ ఆ సమావేశాన్ని మళ్లీ వాయిదా వేశారు. ఆ రాత్రి 9.35 గంటలకు ధన్‌ఖడ్ 'వైద్యుల సలహా' మేరకు ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. ఏ పార్టీ కానీ, ఏ ఎంపీ కానీ రాజీనామాను ఉపసంహరించుకోవాలని ధన్‌ఖడ్‌ను కోరలేదు. జూలై 22న డిప్యూటీ ఛైర్మన్ 'ఉపరాష్ట్రపతి పదవి ఖాళీ అయింది' అని క్లుప్తంగా ప్రకటించారు. ధన్‌ఖడ్‌కు గుడ్‌బై చెప్పేందుకు అధికారపక్షం నిర్ణయించుకున్నదని స్పష్టమయింది. ఆయనకు వీడ్కోలు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం సుముఖంగా లేదు.



జస్టిస్ యశ్వంత్ వర్మ, జస్టిస్ శేఖర్ యాదవ్ అభిశంసన తీర్మానాలపై ధన్‌ఖడ్ నిర్ణయాలే ఆయన రాజీనామాకు దారితీశాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. నేను ఈ అభిప్రాయంతో విభేదిస్తున్నాను. ధన్‌ఖడ్ రాజీనామా వెనుక 'ప్రస్తుతానికి తెలియని కారణాలు' ఉన్నాయని నేను భావిస్తున్నాను.

ధన్‌ఖడ్‌కు ఎన్డీఏ ప్రభుత్వం చాలా రుణపడి ఉన్నదని చెప్పక తప్పదు. ప్రతిపక్షాలను అదుపులో ఉంచడంలో ఆయన అద్వితీయంగా వ్యవహరించారు. 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' విషయమై ఆరెస్సెస్ / బీజేపీ వైఖరిని ఆయన పూర్తిగా సమర్థించారు. రాజ్యాంగ మున్నుడిలోని 'సెక్యులర్, 'సోషలిస్ట్ ' అనే పదాలను తొలగించాల్సిందేనని కూడా ధన్‌ఖడ్ డిమాండ్ చేశారు. కేశవానంద భారతి కేసులో మౌలిక నిర్మాణం సిద్ధాంతాన్ని సుప్రీంకోర్టు ప్రతిపాదించడాన్ని ఆయన విమర్శించారు. పార్లమెంటు ఆమోదించిన చట్టాలపై న్యాయసమీక్ష సిద్ధాంతాన్ని ధన్‌ఖడ్ ప్రశ్నించారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను నియమించే హక్కు ప్రభుత్వానికి ఉందని ఆయన సమర్థించారు. ఈ నియామకాలలో న్యాయవ్యవస్థ నిర్ణయాలకు ప్రాధాన్యముందన్న ప్రతిపాదనను ధన్‌ఖడ్ కొట్టివేశారు. చట్టసభలు ఆమోదించిన బిల్లులను మూడు నెలలలోగా ఆమోదించాలని అధికరణ 142 కింద గవర్నర్లు, రాష్ట్రపతిని సుప్రీంకోర్టు ఆదేశించడం సరికాదని ఆయన గర్హించారు. అధికరణ 105కు విరుద్ధంగా సభ్యులు తమ ప్రసంగాలలో ఉటంకించే సమాచారం, గణాంకాలను ధ్రువీకరించాలని ఆదేశించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను ఘనంగా ప్రస్తుతించారు. వివిధ అంశాలపై ఆయన వైఖరులు కరడుగట్టిన మితవాదుల అభిప్రాయాలకు అనుగుణంగా ఉండేవి. సహజంగానే అవి బీజేపీకి సంతృప్తి కలిగించే విధంగా ఉండేవి.

ధన్‌ఖడ్ తన రాజకీయ జీవితంలో జనతాదళ్, చంద్రశేఖర్ ఆధ్వర్యంలోని సమాజ్‌వాది జనతా పార్టీ, కాంగ్రెస్, బీజేపీలలో ఉన్నారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా ధన్‌ఖడ్ నియమితుడవడంతో ఆయన రాజకీయ జీవితం పునరుత్థానమయింది. గవర్నర్‌గా ఆయన వ్యవహరించిన తీరు, మమతా బెనర్జీ ప్రభుత్వంతో కలహించడం ఆయన బీజేపీ అనుకూల వైఖరిని స్పష్టం చేశాయి. గవర్నర్ పదవి గౌరవాన్ని ఆయన ఏ విధంగానూ పెంపొందించలేదు. అయినప్పటికీ ఉపరాష్ట్రపతిగా ధన్‌ఖడ్‌కు పదోన్నతి లభించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. రాజ్యసభ కార్యక్రమాలను ఆయన నిర్వహించిన తీరుకు విసిగిపోయిన ప్రతిపక్షాలు ఆయనపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించాయి. అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోవలసిన మొదటి రాజ్యసభ ఛైర్మన్ ధన్‌ఖడే కావడం విశేషం.

ధన్‌ఖడ్, ఆరెస్సెస్ / బీజేపీ మధ్య సుహృద్భావ సంబంధాలు ఎందుకు విచ్ఛిన్నమయ్యాయి? జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాలనే ఆలోచన జూలై 15న కాంగ్రెస్ పార్లమెంటరీ వ్యూహ బృందం సమావేశంలో అంకురించింది. 63 మంది సభ్యులు సంబంధిత తీర్మానంపై సంతకాలు చేశారు. ఈ కారణంగా జూలై 21న ఆ తీర్మానాన్ని ఆమోదించడం ధన్‌ఖడ్‌కు తప్పనిసరి అయింది (అదే రోజున లోక్‌సభలో ప్రభుత్వం స్వయంగా అటువంటి తీర్మానాన్ని ప్రవేశపెట్టింది). ఈ తీర్మానం మూలంగా జస్టిస్ శేఖర్ యాదవ్ అభిశంసన తీర్మానంపై కూడా ధన్‌ఖడ్ నిర్ణయం తీసుకోవల్సి వచ్చింది. ఆయన గత ఏడు నెలలుగా ఈ అభిశంసన తీర్మానాన్ని స్వీకరించేందుకు ఆమోదించలేదు. ఈ రెండు అభిశంసన తీర్మానాలపై ధన్‌ఖడ్ నిర్ణయాలే ఆయన రాజీనామాకు దారితీశాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. నేను ఈ అభిప్రాయంతో విభేదిస్తున్నాను. ఆయన రాజీనామా వెనుక 'ప్రస్తుతానికి తెలియని కారణాలు' ఉన్నాయని నేను భావిస్తున్నాను. జీవితం ఒక రహస్యం, అది కొన్నిసార్లు అమర్యాదకరంగా ఉంటుంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

కశ్మీర్‌కు న్యాయం జరిగేదెన్నడు?

సరిగ్గా పది సంవత్సరాల క్రితం నేను కశ్మీర్ లోయను సందర్శించాను. విభిన్న జీవన రంగాలకు చెందిన వారితో మాటా మంతీ జరిపాను. జర్నలిస్ట్ షుజాత్ బుఖారీ వారిలో ఒకరు. జనవరి 2015లో నేను యాదృచ్ఛికంగా ఢిల్లీలోని ఒక బుక్ షాప్‌లో బుఖారీని కలుసుకోవడం జరిగింది. తన స్వరాష్ట్రాన్ని సందర్శించాలని ఆయన నన్ను కోరారు. అదే ఏడాది ద్వితీయార్థంలో నేను శ్రీనగర్‌కు వెళ్లాను. ఆ సందర్భంలో కశ్మీర్ గతం, వర్తమానంపై మా ఇరువురి మధ్య సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఆ బాధాతప్త భూమి చరిత్రపై నా అవగాహన నిశితమూ ప్రగాఢమూ అయింది.

జూన్ 2018లో షుజాత్ బుఖారీ హత్యకు గురయ్యారు. హంతకులు ఎవరు, ఏ ఉద్దేశాలతో వారు ఈ క్రూర చర్యకు పాల్పడిందీ ఇప్పటికీ వెల్లడి కాలేదు. మరుసటి సంవత్సరం మోదీ ప్రభుత్వం కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న అధికరణ 370ని రద్దు చేసింది. భారత గణతంత్ర రాజ్య చరిత్రలో ఒక సంపూర్ణ రాష్ట్రాన్ని ఒక కేంద్ర పాలిత ప్రాంతంగా కుదించివేయడం అదే మొదటిసారి. ఆ తరువాత కేంద్ర హోం మంత్రిత్వశాఖ బీజేపీకి పరమ విధేయుడు అయిన ఒకరిని కశ్మీర్‌కు లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమించింది. అధికరణ 370 రద్దు, జమ్మూ–కశ్మీర్ ప్రజలకు రాజ్యాంగబద్ధంగా ఇచ్చిన హామీని ఉల్లంఘించడమే. రాజ్యాంగ ద్రోహమది. అయితే న్యూఢిల్లీలో అధికారంలో ఉన్నది భారతీయ జనతా పార్టీ కనుక ఆ చర్య అనూహ్యమైన విషయమేమీ కాదు. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దుచేయాలని బీజేపీ దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నది. ముఖ్యంగా చెప్పవలసిన విషయం ఒకటి ఉన్నది: అధికరణ 370ని రద్దు చేస్తూ జమ్మూ–కశ్మీర్‌కు పూర్తి స్థాయి రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తామని మోదీ ప్రభుత్వం పార్లమెంటులో హామీ ఇచ్చింది.

ఆ హామీ ఇచ్చి ఇప్పటికి దాదాపుగా ఆరు సంవత్సరాలు గడిచిపోయాయి. అయితే కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణకు మోదీ ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్టు సూచనలేవీ కానరావడం లేదు. ఉద్యోగిస్వామ్య ఉదాసీనత కారణంగా ఈ జాప్యం జరగడం లేదు, హానికరమైన రాజకీయ ఉద్దేశమే దాని వెనుక ఉన్నదని చెప్పక తప్పదు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు నెల రోజులు గడువు మాత్రమే ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం బిహార్ జనాభాలో పదో వంతు మాత్రమే ఉన్న జమ్మూ–కశ్మీర్‌లో ఎన్నికల నిర్వహణకు ఐదేళ్ల వ్యవధిని తీసుకున్నది. శాసనసభ నియోజకవర్గాలను పునర్విభజించారు. ఈ చర్య హిందువులు అధికంగా ఉన్న జమ్మూకు అనుకూలంగాను, ముస్లింలు అధికంగా ఉన్న కశ్మీర్‌కు ప్రతికూలంగాను పర్యవసించింది. కశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్‌కు, పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీకి ప్రత్యామ్నాయంగా మూడవ పార్టీనే కాకుండా నాల్గవ పార్టీని సైతం ప్రోత్సహించేందుకు బీజేపీ ప్రయత్నించింది. కశ్మీర్‌లో పత్రికా స్వేచ్ఛను అణచివేశారు. స్వతంత్ర వైఖరితో నిష్పాక్షికంగా వ్యవహరించే పాత్రికేయులను పోలీసులు పలు విధాల వేధించారు, అరెస్ట్ చేశారు, ప్రవాసానికి వెళ్లిపోయేలా బలవంతపెట్టారు.

ఎన్నికల ప్రక్రియను తన రాజకీయ ప్రయోజనాలకు వాడుకునేందుకు బీజేపీ చేసిన ఈ ప్రయత్నాలన్నీ అంతిమంగా విఫలమయ్యాయి. నేషనల్ కాన్ఫరెన్స్ విజయం సాధించింది. వాజపేయి నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఈ పార్టీని ఇప్పుడు మోదీ నాయకత్వంలోని బీజేపీ తిరస్కరిస్తోంది. కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు చాలా నెలల ముందు జమ్మూ–కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే ఎన్నికల అనంతరం బీజేపీ అక్కడ ప్రతిపక్షంగా మిగిలిపోవడంతో సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాన్ని పాటించేందుకు మోదీ ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు.



కశ్మీర్ విషయంలో పాకిస్థాన్ వాదనకు ఒకప్పుడు స్వల్ప సానుకూలత ఉండేది. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాద హింసాకాండను అదేపనిగా ప్రోత్సహించిన కారణంగా కశ్మీర్‌పై ఆ దేశానికి ఏదైనా హక్కు ఉంటే అది చాలా కాలం క్రితమే నైతికంగా రద్దయిపోయింది. ఆ సుందరభూమిపై భారత్‌కు ఎటువంటి మినహాయింపులు లేని సార్వభౌమత్వం సమకూరాలంటే కశ్మీరీలకు కేంద్రంలోని ప్రభుత్వాలు చేసిన వాగ్దానాలు నెరవేర్చాలి. కశ్మీర్‌కు తక్షణమే రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించడం అందుకు విధిగా వేయవలసిన మొదటి అడుగు.

జమ్మూ–కశ్మీర్‌కు ఇప్పుడు ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి– ఒమర్ అబ్దుల్లా ఉన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ తమ ఏకైక హిందూ ఎమ్మెల్యేను ఉపముఖ్యమంత్రిగా నియమించింది. ఇది ప్రతీకాత్మక చర్యే అయినప్పటికీ చాలా ప్రాధాన్యమున్న అంశం. అయితే ప్రభావశీల నిర్ణయాలు తీసుకునే అధికారాలు అన్నీ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికకాని లెఫ్టినెంట్ గవర్నర్‌కు మాత్రమే ఉన్నాయి. జమ్మూ–కశ్మీర్‌లో శాంతి సామరస్యాల స్థాపనకు, ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి, ఆయన కేబినెట్ చేయగలిగేది ఏమీ లేదు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన క్షణం నుంచి కేంద్రంతో ఘర్షణపడడం కాకుండా రాజీ వైఖరితో, చాలా నమ్రతతో కూడా వ్యవహరిస్తున్నారు. లెఫ్టినెంట్ గవర్నర్‌ను నేరుగా విమర్శించకుండా చాలా జాగ్రత్త పడుతున్నారు. కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరించాలని చాలా సౌజన్యశీలంగా కేంద్రానికి పదే పదే విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే ఈ నెల ప్రథమార్థంలో లెఫ్టినెంట్ గవర్నర్‌తో ఆయన నేరుగా తలపడడం అనివార్యమయింది. 13 జూలై 1931న మహారాజా హరిసింగ్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కశ్మీరీలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. నిరసనకారులపై మహారాజా పోలీసులు జరిపిన కాల్పుల్లో 21 మంది చనిపోయారు. వారి స్మృత్యర్థం ప్రతి ఏటా జూలై 13న కశ్మీర్ లోయ అంతటా అమర వీరుల సంస్మరణ దినంను పాటించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ జూలై 13న అన్ని రాజకీయ పార్టీలకు చెందిన కశ్మీరీలు ఆ 'అమరవీరుల సంస్మరణ దినం'ను పాటించడాన్ని నిరోధిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాలు జారీ చేశారు. ఆ రోజున ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను గృహ నిర్బంధంలో ఉంచారు. మరుసటి రోజు ఆ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించేందుకు ఒమర్ అబ్దుల్లా వారిని ఖననం చేసిన శ్మశానానికి గోడదూకి వెళ్లారు.

5 ఆగస్టు 2019 దాకా జమ్మూ–కశ్మీర్‌లో 13 జూలై ఒక సాధారణ సెలవుదినంగా ఉండేది. కేంద్ర పాలిత ప్రాంతంగా కుదించివేయబడిన తరువాత సాధారణ సెలవు దినాల జాబితా నుంచి జూలై 13ను తొలగించారు. అందుకు బదులుగా మహారాజా హరిసింగ్ పుట్టిన రోజును సెలవుదినంగా ప్రకటించారు. ఇది ద్వేషపూరిత చర్య. బహుశా, ముస్లింలకు మన స్థాపాన్ని కలిగించేందుకు ఉద్దేశపూర్వకంగా తీసుకున్న మెజారిటీవాద నిర్ణయం. అమరవీరుల సమాధులను సందర్శించేందుకు అనుమతి నిరాకరింపబడిన తరువాత ఒమర్ అబ్దుల్లా ఇలా ట్వీట్ చేశారు: 'జూలై 13 హత్యాకాండ మన జలియన్ వాలా బాగ్. ఆ రోజున తమ ప్రాణాలు అర్పించినవారు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ప్రాణత్యాగం చేశారు. అప్పుడు కశ్మీర్, బ్రిటిష్ సార్వభౌమాధికార పాలనలో ఉన్నది. ఎంత సిగ్గు చేటు! బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వారు ముస్లింలు అయిన కారణంగా గౌరవార్హులు కానివారుగా పరిగణిస్తున్నారు'. ఒమర్ అబ్దుల్లా ట్వీట్‌లో మొదటి వాక్యం కాసింత అతిశయోక్తి అయినా మిగతా వాక్యాలన్నీ సత్యాన్ని చాటాయి. 1857, 1947 మధ్య మహారాజాలు, నవాబులు అందరూ ఎటువంటి మినహాయింపు లేకుండా బ్రిటిష్ పాలకుల కాకారాయుళ్లు. ఆనాటి సంస్థానాల పాలనా ప్రమాణాల ప్రకారం చూసినా మహరాజా హరిసింగ్ క్రూరుడైన నిరంకుశ పాలకుడు. ఆయన పాలనను వ్యతిరేకించిన వారిలో అత్యధికులు ముస్లింలే అయిన కారణంగా జూలై 13ను సెలవు దినాల జాబితా నుంచి తొలగించి ఉంటారని భావించవచ్చు.

కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించకపోవడం ఒక పవిత్ర హామీని మోదీ ప్రభుత్వం ఉల్లంఘించడమే. కశ్మీరీలను అగౌరవపరచడం ఈ ఒక్క అంశానికి మాత్రమే పరిమితమైనది కాదు. ప్రభుత్వంలో భాగం కాని భారతీయులు సైతం కశ్మీరీలకు జరుగుతున్న అవమానాలకు బాధ్యులే. 12 ఆగస్టు 2019న కశ్మీర్ లోయ పెట్టుబడులు పెట్టే విషయమై తమ గ్రూపు ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను నియమించనున్నదని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముఖేశ్ అంబానీ ప్రకటించారు. ఇది ఇంతవరకు కార్యరూపం ధరించనే లేదు.

కశ్మీరీల దుస్థితికి మీడియాను కూడా తప్పుపట్టవలసి ఉన్నది. ముఖ్యంగా జాతీయ రాజధాని ప్రాంతంలోని పత్రికలు, టీవీ ఛానెల్స్ ప్రభుత్వానికి విధేయంగా వ్యవహరిస్తూ కశ్మీర్‌లో సంభవిస్తున్న సంఘటనలపై వాస్తవాలు వెల్లడించడంలేదు. 5 ఆగస్టు 2019 నుంచి మోదీ ప్రభుత్వం చేపట్టిన లేదా చేపట్టని చర్య ప్రతిదీ స్వేచ్ఛాయుత, ఆత్మగౌరవ పౌరులుగా కాకుండా పూర్తి విధేయతతో వ్యవహరించాలని కశ్మీరీలకు స్పష్టం చేస్తోంది. కశ్మీర్ వెలుపల సువిశాల భారతదేశంలోని ఆమ్ ఆద్మీలు సైతం కశ్మీర్ పట్ల శతృత్వ వైఖరిని ప్రదర్శిస్తున్నారు. కశ్మీరీ విద్యార్థులను వేధింపులకు లోను చేస్తూ విద్యాభ్యాసాన్ని విరమించుకుని వెళ్లిపోయేలా చేస్తున్నారు. పహల్గామ్ హత్యాకాండలో కశ్మీరీలు తమ ప్రాణాలను లెక్కచేయకుండా సాహసోపేతంగా పర్యాటకులను కాపాడారన్న కృతజ్ఞతా భావం సగటు భారతీయులలో కానరాకపోవడం దురదృష్టకరం కాదా? సామాజిక మాధ్యమాలలో మన సహచర పౌరులు అయిన కశ్మీరీలను ముస్లింలు అయిన కారణంగా దేశభక్తి ప్రపూరితులు కారనే ప్రచారం జరుగుతోంది.

కశ్మీర్ విషయంలో పాకిస్థాన్ వాదనకు ఒకప్పుడు స్వల్ప సానుకూలత ఉండేది. అయితే భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదులకు మద్దతునిచ్చి, ఉగ్రవాద హింసాకాండను అదేపనిగా ప్రోత్సహించిన కారణంగా కశ్మీర్, కశ్మీరీలపై ఆ దేశానికి ఏదైనా హక్కు ఉంటే అది చాలా కాలం క్రితమే నైతికంగా రద్దయిపోయింది. ఆ సుందర భూమిపై భారత్‌కు ఎటువంటి మినహాయింపులు లేని సార్వభౌమత్వం సమకూరాలంటే కశ్మీర్ ప్రజలకు కేంద్రంలోని ప్రభుత్వాలు చేసిన వాగ్దానాలు నెరవేర్చాలి. కశ్మీర్‌కు తక్షణమే రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించడం అందుకు విధిగా వేయవలసిన మొదటి అడుగు. అదే సమయంలో, భారత గణతంత్ర రాజ్యంలో తాము ఎటువంటి వివక్షలకు గురికాని సంపూర్ణ, గౌరవప్రదమైన భాగస్వాములమనే భావన కశ్మీరీల మనసుల్లో నెలకొనేందుకు మనం మరెంతో చేయవలసి ఉన్నది.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

అనేక తరాల విప్లవ ఆత్మీయుడు

చలసాని ప్రసాద్ జ్ఞాపకంగా మారి పదేళ్లు. ఎప్పటికీ నిలిచి ఉండే అరుదైన ఆయన వ్యక్తిత్వానికి, ఆచరణకి కాలపు లెక్కలతో నిమిత్తం లేదు. దేశవిభజనకి ముందునుంచీ తెలుగు సమాజం మీద ప్రభావం చూపుతూ వస్తున్న కమ్యూనిస్ట్ తాత్విక భావధారలో భాగం 'సీపీ'. కృష్ణా జిల్లాలో తొలితరం కమ్యూనిస్ట్ బాల సంఘాలలో చేరి పనిచేయడం, చిన్న వయసులోనే పేద ప్రజల పోరాటాలను సపోర్ట్ చేస్తూ పాటలు రాయడం, తెలంగాణ సాయుధ పోరాటంలో కుటుంబ సభ్యులని పోగొట్టుకోవడం, తన చుట్టూ ప్రభావశీలురైన నాయకులు, సాహిత్యకారులు ఉండడం వంటి అనేకానేక అంశాలు ఆయన జీవితాన్ని 'సమసమాజ ఆకాంక్ష' మీద ఎటూ తొణికిపోకుండా నిలబెట్టాయి. నమ్మిన రాజకీయాలకి ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా చుట్టూ అసంఖ్యాక ఆప్తుల మరణాలు ఎదురైనా విప్లవమే ఆయనని ఓదార్చింది, తీర్చిదిద్దుకుంది, చేయి పట్టుకుని నడిపింది. అందుకు అనుగుణంగా తన మేధను, హృదయాన్ని నిరంతరం సిద్ధంగా ఉంచడమే ఆయన వ్యక్తిగత ఆచరణ.

శ్రీకాకుళ గిరిజన పోరాటం జరిగే సమయానికి సీపీ విశాఖపట్నంలో ఉన్నారు. స్వతహాగానే దాని ప్రభావాన్ని అందిపుచ్చుకున్నారు. పోరాటం గిరిజన ప్రాంతాలలో వాటి సరిహద్దుల్లో జరిగినా, దాని ప్రభావ కేంద్రం విశాఖపట్నమే. గిరిజన పోరాటం నుంచి మొదలుపెట్టి నక్సల్బరీ ప్రభావంతో తదనంతర కాలంలో ఏవోబీ తదితర ప్రాంతాల్లో విస్తరించిన మావోయిస్ట్ పార్టీ కార్యకలాపాల సానుభూతిపరుడిగా, విప్లవోద్యమానికి మద్దతు సంపాదించడానికి విశాఖ కేంద్రంగా పనిచేసారు. ఆయన ఇల్లే మేధాకేంద్రంగా మారిపోయింది. దాదాపు అయిదు దశాబ్దాల పాటు విశాఖ అవుట్ పోస్ట్‌ని కాపాడిన విప్లవ కార్యకర్త ఆయన.

శ్రీశ్రీ షష్టిపూర్తి సభలు, వాటి రద్దు, విరసం ఆవిర్భావం, ఆ సంస్థలో శ్రీశ్రీ, కొకు, రావిశాస్త్రి, కాళీపట్నం రామారావు వంటి రచయితలు చేరడం... వీటన్నిటి వెనుకా చోదక శక్తులుగా పని చేసినవారిలో చలసాని ప్రసాద్ చాలా ముఖ్యులు. విరసంలో, పార్టీలో ఉండే అంతర్గత విభేదాలు, ఫలితంగా తీసుకునే నిర్ణయాల పట్ల నిబద్ధంగా ఉంటూనే ఆయా రాజకీయ నిర్మాణ అంశాల కఠిన ప్రభావాలను వ్యక్తిమాత్రుల మీద చూపేవారు కాదు. మనుషుల మీద, వారి ఆచరణల మీదా తీర్పులు ఇవ్వకపోవడమే కాదు, ఉన్నంతలో వారిని కాపాడుకోవాలని తాపత్రయపడేవారు. మనుషుల అభిప్రాయాలు మారడమో, స్థానాలు మారడమో, వైఖరులు మారడమో జరిగినపుడు వారిని పోగొట్టుకోకూడదు, వారిలో ఎంత ఉంటే అంత, ఉన్నంతలో నిలబెట్టుకోవాలని అనుకునేవారు. శ్రీశ్రీ విరసంలోనే కొనసాగడం కోసం సీపీ పడిన తపన ఇందుకు ఉదాహరణ. మహామహులుగా పేరు పొందిన రచయితలు అనేక కారణాల రీత్యా విప్లవ రాజకీయాలకి దూరం జరిగినా, దాన్ని బాహాటంగా తీవ్రంగా ప్రకటించకపోవడం, ఏదో మేరకి అభ్యుదయ, విప్లవ ఉద్యమాలకి సపోర్ట్‌గా నిలబడటం వెనుక ఆయా రచయితల నిబద్ధతతో పాటు చలసాని ప్రసాద్ ముద్ర చాలా ఉంది.

ఎవరైనా సమాజానికి ఏ కొద్దిగానైనా ఉపయోగపడతారు అనుకుంటే ఆ వ్యక్తి చుట్టూ ఉండే సమస్త ప్రపంచంతో అనుబంధం పెంచుకుంటారు సీపీ. వారి మార్గాన్ని సుసాధ్యం చేయడానికి ఉండే అడ్డంకులతో ఓపికగా సంభాషణ చేస్తారు. అంతటి ఎనర్జీ చాలా అరుదుగా మాత్రమే చూస్తాం. సాహిత్యం, విప్లవ రాజకీయాలతో ఏమీ సంబంధం లేనివారు కూడా సీపీ ఏ పని అడిగితే అది చేయడానికి ఇష్టపడేవారు. మనుషుల్ని విప్లవ సానుభూతిపరులుగా మార్చడానికి ఆయన ఎంచుకున్న మార్గం ప్రేమ, మానవీయ సంభాషణ. ఒక వ్యక్తి తన జీవితకాలంలో వంద మానవ సంబంధాలను నిర్వహించగలరు అనుకుంటే సీపీ అంతకు పది రెట్లు. ఈ ఓపికకి కారణం విప్లవోద్యమం పట్ల ఉన్న ప్రేమ మాత్రమే కాదు, మనుషులు కావాలి, జన సందోహమే ఆయన ఊపిరి.



ఇస్త్రీ లేని ఉతికిన బట్టలు, సాదా చెప్పులు, నల్లటి స్ట్రాప్ ఉన్న చిన్న వాచీ, కొద్దిగా ఊగుతూ నడుస్తూ, వెస్పా బండి మీద ఎక్కడ, ఎవరు, ఏ కార్యక్రమానికి పిలిచినా రయ్యిన వాలిపోయేవారు. ఎనభై మూడేళ్ల వయసుని కూడా అంత సార్థకం చేసిన చలసాని ప్రసాద్‌ను గుర్తు చేసుకోవడం కూడా ఒక పుస్తకం చదివినట్లే.

ఆయన ఆచరణ పద్ధతులు కొన్ని ఆసక్తికరంగా ఉంటాయి. కమ్యూనిస్ట్ సమాజంలో స్త్రీ పురుషులు సమానం కనుక స్త్రీల స్నేహం పట్ల చాలా విలువగా, గౌరవంగా ఉండేవారు. కృష్ణాబాయితో ఆయన స్నేహం దాదాపు అర్ధ శతాబ్ది పైన. అరమరికలు ఎరుగని మంచి మిత్రులుగా కలిసి చేసిన కార్యక్రమాలు, రచనలు, సంపాదకత్వ బాధ్యతలు అనేకం. అలాగే ఆయన ఇంటికి వెళ్లినవారికి తెలుసు ఆయన ఎన్నడూ ఇంటికి తాళాలు వేసి ఎరుగరు. అనేక మేధా చర్చలు, పుస్తకాలు రెక్కలు ఆహ్వానం పలుకుతాయి. ఇష్టపడి వచ్చేవారికి ఆ ఇల్లు ఎప్పుడూ 'నో' చెప్పలేదు. ఇస్త్రీ లేని ఉతికిన బట్టలు, సాదా చెప్పులు, నల్లటి స్ట్రాప్ ఉన్న చిన్న వాచీ, కొద్దిగా ఊగుతూ నడుస్తూ, వెస్పా బండి మీద ఎక్కడ, ఎవరు, ఏ కార్యక్రమానికి పిలిచినా రయ్యిన వాలిపోయేవారు. ఎనభై మూడేళ్ల వయసుని కూడా అంత సార్థకం చేసిన చలసాని ప్రసాద్ వంటివారిని గుర్తు చేసుకోవడం కూడా ఒక పుస్తకం చదివినట్లే.

అన్ని తరాల వారితో ఇట్టే కలిసిపోగల చాతుర్యం, నిష్కళమైన నవ్వు మొహం, నొప్పించకుండా ఒప్పించే నేర్పు, నమ్మినదాని పట్ల తిరుగులేని నిబద్ధత, మనుషులంటే అవధులు లేని ప్రేమ, పుస్తకాల విలువని నిజార్థంలో గుర్తించి అపురూపమైన లైబ్రరీని తయారు చేసిన చదువరి, సాయం చేయడానికే పుట్టినట్లు ఉండే అపురూపమైన మిత్రుడు, తన చుట్టూ ప్రపంచాన్ని ప్రేమ, విప్లవాలతో ముడివేసిన గొప్ప మానవుడి జ్ఞాపకాలను మరొక్కసారి మనసారా హత్తుకుంటూ...

■ కె.ఎన్. మల్లీశ్వరి

జూలై 27న చలసాని ప్రసాద్ పదో వర్ధంతి. ఉదయం 10 గంటలకు విశాఖపట్నం పౌరగ్రంథాలయంలో విరసం ఆధ్వర్యంలో సభ. మూడు సెషన్లుగా జరిగే ఈ సభలో అరసవిల్లి కృష్ణ, సీఎస్ఆర్ ప్రసాద్, కృష్ణాబాయి(ఆన్‌లైన్) కలిసి 'చలసాని ప్రసాద్ డిజిటల్ లైబ్రరీ'ని ప్రారంభిస్తారు. సత్యనారాయణమూర్తి, మధు, లక్ష్మి, వేణు, టి. శ్రీరామమూర్తి, ప్రసాదవర్మ, కొండపల్లి పద్మ, మానం ఆంజనేయులు, చందు సుబ్బారావు... చలసాని ప్రసాద్‌తో తమ జ్ఞాపకాలను పంచుకుంటారు. స్మారక ప్రసంగం కె.ఎన్. మల్లీశ్వరి చేస్తారు. బాలసుధాకర్ మౌళి, రివేరా, ఇప్టూ ప్రసాద్ వివిధ అంశాలపై ప్రసంగిస్తారు.

పుస్తకావిష్కరణ సభ

ప్రజాస్వామ్య వికాసానికి చర్చల దోహదాన్ని అర్థం చేసుకుంటూ, హింస తగ్గాలని ఆకాంక్షిస్తూ, హింస లేని మానవీయ ప్రజాస్వామిక విలువల నూతన సమాజాన్ని మానవులే నిర్మించుకోగలరనే విశ్వాసంతో రెండున్నర దశాబ్దాలుగా ప్రొ. జి.హరగోపాల్ శాంతి చర్చల ప్రక్రియలో పాల్గొంటున్నారు. ఈ విషయమై ఇటీవల ఆయన ఇచ్చిన రెండు ఇంటర్వ్యూలు, ఎస్.ఆర్. శంకరన్ స్మారకోపన్యాసం, మరి రెండు ఉపన్యాసాలు కలిపి 'శాంతి చర్చలు –ప్రజాస్వామిక అన్వేషణ' పుస్తకం ప్రచురించాం. శాంతి కోసం, నిర్బంధం లేని సమాజం కోసం చర్చలు ఎంత అవసరమో శాంతి చర్చలకు, శాంతి సాధనకు నిరంతర సంభాషణ కూడా అంత అవసరం. జూలై 27న ఉదయం పది గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రొ. జి.హరగోపాల్ పుస్తకం 'శాంతి చర్చలు–ప్రజాస్వామిక అన్వేషణ' ఆవిష్కరణ సభ జరుగుతుంది. హైదరాబాద్, బషీర్‌బాగ్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఉన్న సురవరం ప్రతాపరెడ్డి హాల్‌లో జరిగే ఈ సభలో రాజేంద్ర బాబు అర్విణి, ప్రొ. జి.విజయ్, జస్టిస్ బి.చంద్రకుమార్, ప్రొ. డి.ఎన్, ప్రొ. రమా మెల్కొటే, ప్రొ. లక్ష్మణ్ గడ్డం, ప్రొ. జి.హరగోపాల్, ఎం. రాఘవాచారి, పి.బి. స్వామి పాల్గొంటారు.

–పాలమూరు అధ్యయన వేదిక

వ్యాసాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
శనివారం 26 జూలై 2025

కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్

హనుమకొండ కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దృష్ట్యా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజల సౌకర్యార్థం ఈ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు 24గంటల పాటు సేవలందించేందుకు కంట్రోల్ రూమ్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. కంట్రోల్ రూమ్ నెంబర్ 1800 425 1115 అందుబాటులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు.





శుభకరం.. శ్రావణమాసం..

రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాలు ప్రారంభం
- పెద్దసంఖ్యలో పాల్గొన్న మహిళలు
- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు
- వేయిస్తంభాల ఆలయంలో లక్ష తులసి అర్చన

7

అటు ముసురు.. ఇటు జల్లు..



వర్షంతో జలమయమైన హనుమకొండలోని రహదారి

హనుమకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గడచిన 24 గంటల్లో హనుమకొండ జిల్లాలో సరాసరి 12.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. భీమదేవరపల్లి మండలంలో 8.9 మి.మీ., వేలేరులో 7.9 మి.మీ., ఎల్కతుర్తిలో 10.8 మి.మీ., హసన్‌పర్తిలో 12.2 మి.మీ., ధర్మసాగర్‌లో 10.6 మి.మీ., కాజీపేటలో 17.1 మి.మీ., హనుమకొండలో 14.1 మి.మీ., ఐనవోలులో 18.2 మి.మీ., పరకాలలో 13.4 మి.మీ., దామెరలో 12.1 మి.మీ., ఆత్మకూరులో 12.2 మి.మీ., శాయంపేటలో 10.5 మి.మీ., నడికూడలో 11.5 మి.మీ. వర్షం కురిసింది.



ఇక గగన యానమే..

వరంగల్ ఎయిర్‌పోర్టు భూ సేకరణకు రూ.205 కోట్లు విడుదల

ఓరుగల్లువాసులకు గగనయానంపై ఆశలు చిగురిస్తున్నాయి. మామునూరులో ఎయిర్‌పోర్టు భూసేకరణకు తాజాగా ప్రభుత్వం రూ.205కోట్ల నిధులను విడుదల చేయటంతో ఇక పనుల్లో వేగం పెరగనుంది. ఇప్పటికే విమానాశ్రయానికి కావాల్సిన భూసేకరణపై అధికారులు రైతులతో చర్చించి ఎకరాకు స్పెషల్ (కన్సెంట్) అవార్డు కింద రూ.1.20కోట్లు, వ్యవసాయేతర భూములకు గజానికి రూ.4,887లుగా నిర్ణయించారు. ఇళ్లు కోల్పోతున్నవారికి రూ.11.64లక్షల పరిహారం ఇచ్చేందుకు తీర్మానం చేశారు. వీటితో పాటు అదనంగా పరిహారం, రోడ్ల నిర్మాణానికి రూ.160కోట్లు అవసరంగా అధికారులు చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఇక కేంద్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి రూ.450కోట్ల నిధులను కేటాయించింది. దీంతో ఇక వేగంగా ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభం కానున్నాయి.

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

వరంగల్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అడుగులు వడివడిగా పడుతున్నాయి. తాజాగా భూసేకరణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. మామునూరులో నిర్మించే విమానాశ్రయానికి 949.14 ఎకరాల భూమి అవసరం కాగా, ఇప్పటికే ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) ఆధీనంలో 696.14ఎకరాల భూమి ఉంది. ఇంకా 253 ఎకరాల భూమి ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరం. పదేళ్లుగా ఈ భూమిని సేకరించేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేసినప్పటికీ కొలిక్కి రాలేదు. అయితే గత ఏడాది సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో వరంగల్ ఎయిర్‌పోర్టుపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నవంబరు నెలలో 253ఎకరాల భూమిని సేకరించేందుకు రూ.205కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు జీవో జారీ చేసింది. ఇప్పటికే పలుమార్లు మామునూరు పరిసర ప్రాంతాలైన గాడిపల్లి, నక్కలపల్లి, గుంటూరుపల్లి గ్రామాల్లో 240ఎకరాల వ్యవసాయ భూమి, 61,134.5 చదరపు గజాల వ్యవసాయేతర భూమితోపాటు 12మంది ఇళ్లు కోల్పోతున్నట్లుగా రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి గుర్తించారు. అయితే రైతులు ఎకరాకు రూ.2.50కోట్ల నష్టపరిహారంతో పాటు నిర్వాసితులకు ఎయిర్‌పోర్టులో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో భూసేకరణ కోసం 2024 డిసెంబరు 1న ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చారు. పరిహారం, భూసేకరణ, పునరావసం, (మిగతా 6లో...)

కొచ్చిన్ ఎయిర్‌పోర్టు తరహాలో నిర్మాణం

మంత్రి కొండా సురేఖ

వరంగల్ ఎయిర్‌పోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.205కోట్ల నిధులు కేటాయించటంపై రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. నిధులు కేటాయించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నట్లుగా మంత్రి పేర్కొన్నారు. కేరళలోని కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయం తరహాలో మామునూరు ఎయిర్‌పోర్టు ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లుగా మంత్రి పేర్కొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే హర్షం

ఎయిర్‌పోర్టుకు నిధులు కేటాయింపులపై వరంగల్ ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. చారిత్రక వరంగల్ నగరంలో ఇదొక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు.

- టైటిల్ క్లియర్ ఉన్న 15మంది రైతులకు రూ.13.74 కోట్ల చెల్లింపు
- పరిహారం, రోడ్ల కోసం మరో రూ.160 కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం
- విమానాశ్రయానికి భూ సేకరణపై అధికారుల కుస్తీ
- స్పెషల్ (కన్సెంట్) అవార్డు కింద ఎకరాకు రూ.1.20 కోట్ల చొప్పున పరిహారం
- వ్యవసాయేతర భూములకు గజానికి రూ.4,887గా నిర్ణయం
- ఇళ్లు కోల్పోతున్న వారికి రూ.11.64 లక్షల పరిహారం
- వచ్చే నెలలో పనులు ప్రారంభించేలా అడుగులు

భూ సేకరణకు సహకరించాలి...

- గాడిపల్లి గ్రామసభలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి
- నిర్వాసితులకు నష్టపరిహారం ప్రకటించిన అధికారులు
- అసంతృప్తి వ్యక్తం చేసిన భూ యజమానులు

7



లెక్క తేల్చే పని షురూ

ఏనుమాముల మార్కెట్‌లో అక్రమాలపై కదలిక

- మిర్చి బస్తాలు తరలించిన అడ్తిదారుల్లో గుబులు
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారుల్లో అలజడి

వరంగల్ వ్యవసాయం, జూలై 25(ఆంధ్రజ్యోతి): 'లెక్క తేలని మిర్చి బస్తాలెన్నో..' అనే శీర్షికతో వరంగల్ ఏనుమాముల మార్కెట్‌పై గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులతో పాటు కలెక్టర్ సైతం దీనిపై సంబంధిత అధికారుల వివరణ కోరినట్లు తెలిసింది. దీంతో మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్యా సంబంధిత అధికారులను పురమాయించి గల్లంతైన బస్తాల లెక్క తేల్చాలని ఆదేశాలు జారీ చేశారు. అవుట్ గోయింగ్, ఇన్ కమింగ్ రిజిస్టర్లను పరిశీలించి పోయిన మిర్చి బస్తాలు ఎక్కడున్నాయో తెలుసుకోవాలని హుకుం జారీ చేశారు. మార్కెట్ యంత్రాంగం మిర్చి బస్తాల లెక్క తేల్చే పనిలో పడడంతో అడ్తిదారుల గుండెల్లో గుబులు మొదలైంది. రైతులు తీసుకువచ్చిన బస్తాలకు లాట్ ఐడీలు కొట్టించిన తరువాత వాటిని తిరిగి బయటకు తీసుకు వెళ్లాలంటే.. మార్కెట్ కమిటీ సిబ్బందికి, అధికారులకు (మిగతా 6లో..)

మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో పెట్టుబడులు పెట్టండి..

తైవాన్ పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు పిలుపు

హనుమకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ (కేఎంటీపి)లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తైవాన్ పారిశ్రామిక వేత్తలను కోరారు. శుక్రవారం తైవాన్ టెక్స్‌టైల్ ఫెడరేషన్ (టీటీఎఫ్) అధ్యక్షుడు జస్టిన్‌హాంగ్ నేతృత్వంలోని 11 మంది సభ్యులతో కూడిన ప్రతినిధుల బృందంతో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలో ఏర్పాటైన మెగా టెక్స్‌టైల్ పార్క్ భారతీయ వస్త్ర తయారీ రంగంలోనే ఒక గేమ్‌చేంజర్‌గా అభివర్ణించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలను వివరిస్తూ మంత్రి ప్రధానంగా ఈ మెగా టెక్స్‌టైల్ పార్క్ విశిష్టతలను ప్రతినిధుల బృందానికి వివరించారు. ఈ పార్క్‌లో ఫంక్షనల్ టెక్స్‌టైల్స్ ఎకో ఫ్రెండ్లీ డైయింగ్, టెక్స్‌టైల్ రీసైక్లింగ్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి అవకాశాలున్నాయన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను సందర్శించవలసిందిగా మంత్రి శ్రీధర్‌బాబు తైవాన్ బృందాన్ని ఆహ్వానించారు. తైవాన్ పెట్టుబడిదారులు ముందుకువస్తే టెక్స్‌టైల్ క్లస్టర్ (వరంగల్)లో తెలంగాణ-తైవాన్ మాన్యుఫాక్చరింగ్ జోన్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలిస్తుందని ప్రతిపాదించారు.

గత ఏడాది బాధితులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్న దృశ్యం



ముప్పేట ముంపు తప్పేనా..?

- నగరంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు
- రక్షణ చర్యల ప్రణాళికలకు మోక్షమెప్పుడో..?
- బిక్కుబిక్కుమంటున్న లోతట్టు ప్రాంతాల ప్రజలు

వరంగల్ కార్పొరేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా నగరంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రధానంగా లోతట్టు, ముంపు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. గత వరద బాధితులు ఇప్పటి వర్షాలతో అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని బతుకుతున్నారు. కాలనీలు, ఇండ్లలోకి నీరు చేసుకుని పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందిన బాధితులు వరదనీరు ఈ యేడు కూడా పునరావృతం అవుతుందా..? అనే అనుమానంతో కాలం వెళ్లదీస్తున్నారు. కొద్ది రోజులుగా కుండపోత వర్షాలు వరంగల్ నగరాన్ని ముంచెత్తుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే వర్షపు నీరు చేరుకోగా చాలా కాలనీలలో రోడ్లపై నీరు చేరడం, చెట్లు విరిగి పోవడం, కరెంటు స్తంభాలు పడిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. కబ్జాదారులు రోడ్లు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడం, డ్రైనేజీలు ఆక్రమించి ర్యాంపులు (మిగతా 6లో..)

ప్రణాళికలు శూన్యం

నగరంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నా.. జీడబ్ల్యూఎంసీ అధికారులు ఇంకా ముంపు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి హెచ్చరికలు, ఆదేశాలు సూచించలేదు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో ముంపు నివారణ ప్రాంతాలకు సరైన ప్రాధాన్యం ఇవ్వకపోవడంవల్ల వరద ముంపు తప్పేలా లేదు. వర్షప్రభావం వల్ల జరిగే నష్టాలపై సేవలందించేందుకు ఇప్పటివరకుప్రత్యేక సిబ్బంది, కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఆందోళనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఆపదలో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సెంటర్లు, ప్రత్యేక బడ్జెట్ కేటాయించలేదని సిబ్బంది చెబుతున్నారు. గ్రేటర్ అధికారులు, పాలకవర్గం పెద్దలు సమీక్షలకు మాత్రమే పరిమితమయ్యారే తప్ప ప్రజల ప్రాణాలపై శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

అత్యవసర ఫోన్ నెంబర్లు

డీఆర్ఎఫ్ హెల్ప్ నెంబర్ : 1077, 37019 99688

- ఫైర్ సర్వీస్ : 101
- పోలీస్ : 100
- అంబులెన్స్ : 108

జీడబ్ల్యూఎంసీ టోల్ ఫ్రీ నెంబర్ : 1800 4251 980, 97019 99645, 97019 99676



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సత్యశారద

నవోదయలో ల్యాబ్ ప్రారంభం

మామునూరు,జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యావిధానాలను అలవ ర్చుకొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. శుక్రవారం మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో పీఎం శ్రీనిధి రూ.50 లక్షలతో నిర్మించిన కృత్రిమ మేధో ఆధునిక, సాంకేతిక నైపుణ్యాభివృద్ధి (సంకల్ప్) ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిని అందించేందుకు ప్రత్యేకమైన ప్రయోగశాలను "పీఎం శ్రీ" పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో విద్యార్థులు రోబోటిక్స్, ఐఓటీ, బేసిక్ ఎలాక్ట్రానిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రెన్యువల్ ఎనర్జీ సిస్టం వంటి అంశాలను నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ, ఉపాధ్యాయులు సురేష్,రామలింగయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

27న రాత పరీక్షకు ఏర్పాట్లు చేయండి: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీన జరిగే గ్రామ పరిపాలన అధికారి, లైసెన్స్‌డ్ సర్వేయర్ రాత పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఏవీవీ జూనియర్, డిగ్రీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. గ్రామ పాలన అధికారి పరీక్షకు 25 మంది హాజరవుతుండగా ఉదయం 10 నుంచి 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా 304 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోలీసులపై గౌరవ మర్యాదలను పెంపొందించాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పదోన్నతి పొందిన నూతన ఎస్సైలు

వరంగల్ క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో పోలీసుల పట్ల గౌరవ మర్యాదలు పెంపొందించేలా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పదోన్నతి పొందిన నూతన ఎస్సైలకు పిలుపునిచ్చారు. ఏఎస్సైల నుంచి ఎస్సైలుగా పదోన్నతి పొందిన శివకుమార్, నర్సయ్య, చంద్రమౌళి, ఆర్.ఎస్. శర్మ, సాంబయ్యలు శుక్రవారం సీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసుల పట్ల భరోసా కలిగించేలా బాధితులకు అండగాని నిలవాలని సీపీ సూచించారు.

సీపీని కలిసిన మట్టెవాడ ఇన్స్‌పెక్టర్

మట్టెవాడ ఇన్స్‌పెక్టర్‌గా గురువారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కర్ణాకర్ శుక్రవారం సీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బాధితుల పక్షాన నిలబడి న్యాయం చేయాలని ఈ సందర్భంగా సీపీ సూచించారు.

ఇక గగనయానమే..

(5వ పేజీ తరువాయి)

పునఃస్థాపనలో పారదర్శకత హక్కుల చట్టం 2013లోని సెక్షన్ 11(1) ప్రకారం విమానాశ్రాయం నిర్మాణానికి ప్రభుత్వం భూమిని సేకరిస్తుందని పేర్కొన్నారు. పలుమార్లు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద నేతృత్వంలో డిస్ట్రిక్ట్ లెవల్ ల్యాండ్ నెగోషియేషన్ కమిటీ రైతులతో సమావేశం నిర్వహించింది.

చివరగా జూన్ 5వ తేదీన వ్యవసాయ భూమికి ఎకరాకు రూ.1.20 కోట్ల పరిహారంగా నిర్ణయించింది. 240ఎకరాల వ్యవసాయ భూమికి పరిహారం కోసం రూ.288కోట్లు అవసరం. అలాగే వ్యవసాయేతర భూములకు గజానికి రూ.4,887లుగా నిర్ణయించారు. 61,134.5 చదరపు గజాల స్థలానికి రూ.29.87కోట్ల నిధులు కావాల్సి ఉంది. ఇక పెండింగ్‌లో ఉన్న 12ఇళ్లు కోల్పోతున్న 20 కుటుంబాలకు స్పెషల్ అవార్డు కింద రూ.11.64లక్షలు ఇచ్చేందుకు శుక్రవారం గాడేపల్లి గ్రామసభలో అధికారులు ప్రతిపాదనలు చేశారు. అయితే తమకు మరింత పరిహారం కావాలని బాధితులు డిమాండ్ చేశారు. ఇక మొత్తంగా రూ.320కోట్ల వరకు నష్టపరిహారంగా భూనిర్వాసితులకు చెల్లించాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ఎకరాకు రూ.65లక్షలే చెల్లించాలని నిర్ణయించినప్పటికీ స్పెషల్ (కన్సెంట్) అవార్డు కింద రూ.1.20కోట్లుగా నిర్ణయించినట్లుగా కలెక్టర్ ప్రకటించారు. దీంతో రైతులకు చెల్లించే పరిహారం ప్రభుత్వ అంచనాలను మించి భారీగా పెరిగింది.

రూ.205కోట్లు విడుదల

వరంగల్ ఎయిర్‌పోర్టుకు సేకరించిన భూములుకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. గత నవంబరు నెలలో ఎయిర్‌పోర్టు భూసేకరణ కోసం రూ.205కోట్ల నిధులను కేటాయిస్తున్నట్లుగా ప్రకటించింది. ఈ మేరకు ఆ నిధులను విడుదల చేస్తు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎకరాకు రూ.1.20కోట్ల చొప్పున 136మంది రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించనుంది. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే టైటిల్ క్లియర్‌గా ఉన్న 15 మంది రైతుల ఖాతాల్లో రూ.13.74కోట్ల పరిహారాన్ని జమ చేసినట్లుగా వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద తెలిపారు.

కాగా, సగానికి పైగా రైతులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు భూములు ఇచ్చేందుకు ముందుకు రాగా, మరికొందరు మాత్రం తమకు మరింత పరిహారం కావాలని ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే అత్యధికంగా ఎకరాకు రూ.1.20కోట్ల నష్టపరిహరం ఇస్తున్నామని, ఇక పెంచేది లేదని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో మిగతా రైతులు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో భూమిని ఎయిర్‌పోర్టు ఇచ్చే అవకాశాలు ఉన్నట్లుగా సమాచారం. ఇంకా ఎయిర్‌పోర్టు భూనిర్వాసితులకు పరిహారానికి రూ.90కోట్లు, గాడేపల్లి, నక్కలపల్లి, గుంటూరుపల్లి, మామునూరు తదితర ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి రూ.60కోట్ల చొప్పున రూ.160కోట్ల నిధులు అవసరంగా అధికారులు చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదించింది. దీంతో ఈనిధులను కూడా త్వరలోనే రానున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం వరంగల్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి రూ.450కోట్లు ఏఏఐకి కేటాయించింది. రైతుల నుంచి భూములను స్వాధీనం చేసుకుని ఏఏఐకి అప్పగించిన వెంటనే పనులు ప్రారంభించే అవకాశం ఉంది. రానున్న మూడేళ్లలో వరంగల్ ఎయిర్‌పోర్టులో విమానాలు ఎగురుతాయనే ఆశతో ప్రజలు ఉన్నారు.

న్యూసైన్స్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

జెన్‌పాక్ట్ కంపెనీలో నియామకాల కోసం నిర్వహణ



ఎంపికైన విద్యార్థులతో కళాశాల డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు

హనుమకొండ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్ రోడ్డులోని న్యూసైన్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) వారి ఆధ్వర్యంలో జెన్‌పాక్ట్ కంపెనీలో నియామకాల కోసం శుక్రవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 242 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు కళాశాల డైరెక్టర్ కె.రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ డ్రైవ్ మొదటి రౌండ్‌లో పర్సనల్ ఇంటర్వ్యూ, రెండో రౌండ్‌లో అపరేషన్ నిర్వహించగా మొత్తం 56మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేషం, సీహెచ్ కమలాకర్‌లు అభినందించారు.

కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కంప్యూటర్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై పట్టు సాధించాలని, వీటి కోసం తమ కళాశాలలో ప్రత్యేకంగా ఉచిత ట్రైనింగ్ ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.శ్రావణ్ కుమార్, వి.మధుకర్, ప్లేస్‌మెంట్ అఫీసర్ అహ్మద్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ముప్పేట ముంపు తప్పేనా..?

(5వ పేజీ తరువాయి)

నిర్మించడం, వర్షపు నీరు సరిగ్గా వెళ్లకుండా చిన్న చిన్న డ్రైనేజీలు కలిగి ఉండడం వల్ల ఈ యేడు కూడా కొన్ని ప్రాంతాల్లో ముంపు వాటిల్లే అవకాశాలు ఉన్నాయని ఇంజనీరింగ్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రస్తుతం వరంగల్ నగరంలో నయీంనగర్, అలంకార్, కాకతీయ కాలనీ, రాజాజీనగర్, జవహర్‌కాలనీ వద్ద బ్రిడ్జిలు నిర్మించడంతో కొంత మేరకు ముంపు తప్పే అవకాశాలకు ఉన్నట్టు ఇంజనీరింగ్ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో కొన్నిచోట్ల లోతట్టు ప్రాంతాల్లో వరద ముప్పు తప్పదని సీనియర్లు హెచ్చరిస్తున్నారు.

అరకొర డీఆర్‌ఎఫ్ సిబ్బంది

వర్షాకాలంలో వరదలు ముంచెత్తినప్పుడుగానీ, ఇతర సమయాల్లో డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్‌ఎఫ్) బృందాలు ప్రజలకు విస్తృత సేవలందిస్తారు. అయితే జీడబ్ల్యూఎంసీ డీఆర్‌ఎఫ్ విభాగంలో అరకొర సిబ్బంది పని చేయడంవల్ల నీటమునిగిన ప్రాంతాల్లో సరైన సేవలందించలేకపోతున్నారు. ప్రస్తుతం డీఆర్‌ఎఫ్‌లో 32 మంది సిబ్బందితో పాటు ఇద్దరు డ్రైవర్లు, ఒక డీఎఫ్‌వో మాత్రమే పని చేస్తున్నారు. సుమారు వంద మంది డీఆర్‌ఎఫ్ సిబ్బంది పని చేస్తే తప్ప ప్రజలకు తగినన్ని సేవలందేలా లేవని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నేతలు

బాలసముద్రం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గోవాలో ఆగస్టు 7న నిర్వహించే జాతీయ ఓబీసీ మహాసభలను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో మహా సభకు సంబంధించిన పోస్టర్‌ను బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికృష్ణగౌడ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బీసీ సంఘాల పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. సామాజిక రిజర్వేషన్లకు 50 శాతం పరిమితి విధించి బీసీలపై క్రిమిలేయర్ విధించి బీసీ రిజర్వేషన్లకు అగ్రవర్ణ ప్రభుత్వాలు గండి కొడుతున్నాయని ఆరోపించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి భీమగాని యాదగిరి గౌడ్, జిల్లా నాయకులు వేముల మహేందర్, కాసగోని అశోక్, తేళ్ల కిశోర్, తమ్మల శోభారాణి, పద్మజాదేవి, అరుణ, సూత్రపు కవిత పాల్గొన్నారు.

ఆగస్టు 31న ఓరుగల్లులో కాకతీయ కళావైభవం

హనుమకొండ కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జానపద నృత్యానికి అంతర్జాతీయస్థాయి గుర్తింపు తెచ్చిన డాక్టర్ శాంతికృష్ణ స్థాపించిన శాంతి సేవాసమితి ఆధ్వర్యంలో వచ్చే ఆగస్టు 31వ తేదీన హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో కాకతీయ కళావైభవం పేరిట పెద్దఎత్తున వేడుకల నిర్వహణకు సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలో శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వేడుకల వాల్‌పోస్టర్‌ను సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ చేతులమీదుగా ఆవిష్కరింపజేసినట్లు కార్యక్రమ నిర్వాహకుడు శాంతికృష్ణ తెలిపారు. భారతీయ సంస్కృతిని సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేస్తూ ఇప్పటి వరకు 1,112 కార్యక్రమాలను వైభవంగా నిర్వహించి వేలాదిమంది భిన్న ప్రముఖులను, కళాకారులను గుర్తించి సత్కరించిన శాంతి సేవాసమితి ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహిస్తున్న వేడుకలు విజయవంతం కావాలని హరికృష్ణ ఆకాంక్షించారు.

తమ శాఖ ఈ కార్యక్రమాల విజయవంతానికి సహకరిస్తుందని చెప్పారు.



కాకతీయ కళావైభవం వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ

ఆ రోజు వివిధ కళా రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబర్చిన 108 తెలుగు కళాకారులకు గౌరవ పురస్కారాలతో సత్కరిస్తామని పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని శాంతికృష్ణ తెలిపారు.

లెక్క తేల్చే పని షురూ

5వ పేజీ తరువాయి

తెలియకుండా జరగదు. దడువాయిలు లేకుండా కాంటా కాకుండా ఖరీదుదారు కొనుగోలు చేయడు. ఐడీలు తీసుకున్న తరువాత సమాచారం ఇవ్వకుండా సరుకు బయటకుపోయిందంటే అందులో అందరిప్రాత ఉంటుందని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

అడ్తివర్గాల్లో చర్చ..

మార్కెట్ అడ్తిదారులలో ఇటీవల కొద్ది కాలంగా రెండు వర్గాలుగా చీలిపోయి ఏమాత్రం అవకాశం దొరికినా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మిర్చి బస్తాల గల్లంతు వార్త రావడంతో మార్కెట్ వ్యాపారవర్గాల్లో ఒకటే చర్చ. మీడియాకు సదరు వ్యాపారవర్గమే సమాచారం అందించిందని ఒక వర్గంపై మరోవర్గం ఆరోపణలు గుప్పించుకుంటున్నాయి. ఇదే రీతిలో దడువాయిల్లో రెండు వర్గాలు ఉండడం, మార్కెట్ అధికారుల్లోనూ అంతర్గత విభేదాలు ఉన్నందున మిర్చి బస్తాల గల్లంతుపైనే చర్చ సాగుతోంది. ఇది ఎటుపోయి ఎటుదారి తీస్తుందోనని అందరూ తేలు కుట్టిన దొంగల్లా గమ్మున ఉంటున్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి..

మిర్చి బస్తాల గల్లంతు విషయంలో సమగ్ర విచారణ జరిపి అధికారులు, అడ్తిదారులు ఇంకా ఎవరెవరు ఉన్నారో వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐకెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దాపురం రమేష్ కోరారు. అందరూ కుమ్మక్కై మార్కెట్ ఆదాయానికి గండి కొడుతున్నారని, త్వరలోనే మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

డీసీసీ బ్యాంకు ప్రగతిపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మార్నేని

హనుమకొండ సిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆర్థిక ప్రగతికి సంబంధించిన అంశాలపై సమీక్ష జరిగింది. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో డీసీసీ బ్యాంక్, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతోపాటు పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. లావాదేవీలు, రుణాలు, 2024-25 ఆడిట్ తదతర అంశాలపై చైర్మన్ రవీందర్ రావు సమీక్ష జరిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్లు హరిప్రసాద్, జగన్‌మోహన్‌రావు, రాజేశ్వర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, మాడుగుల రమేశ్, నాయిని రంజిత్, రమేశ్, ఉపేందర్‌రెడ్డి, గోపాల్ రావు, యాదగిరిరెడ్డి, నర్సింగరావు, శ్రీనివాస్, రవిరాజు, మురళి, ప్రొఫెషనల్ డైరెక్టర్ నరేందర్, ప్రదీప్‌చందర్, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, సీఈవో వజీర్ సుల్తాన్, జీఎం ఉషశ్రీ పద్మావతి, టీజీ క్యాబ్ జీఎం లత, డీజీఎం అశోక్, ఏజీఎం మధు, స్రవంతి, రాజు, గంప స్రవంతి, కృష్ణమోహన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలువురు వైద్యులకు పదోన్నతులు

వరంగల్ మెడికల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకతీయ వైద్య కళాశాల ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి న్యూరాలజీ విభాగం అధిపతిగా డాక్టర్ మాధవరావు బాధ్యతలు చేపట్టారు. మహబూబాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో పని చేస్తున్న మాధవరావు పదోన్నతిపై కేఎంసీకి బదిలీ అయ్యారు. రెండున్నర దశాబ్దాలుగా ఖాళీగా ఉన్న ఈ పోస్టులో డాక్టర్ మాధవరావు చేరడం, న్యూరాలజీ సేవలు విస్తృతమయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యూరాలజీ డీఎం తీసుకురావడమే తన లక్ష్యమని, న్యూరో ఇంటెన్సివ్ ఏర్పాటు చేసి సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. మతిమరుపు, పక్షవాత రోగులకు, పార్కిన్సన్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేస్తామన్నారు.

మరికొన్ని విభాగాలకు ప్రొఫెసర్‌గా రానుంది వీరే..

వైద్య కళాశాల, వైద్య విద్య సంచాలకుల పరిధిలో పలువురు అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం ఎంజీఎం, కేఎంసీలకు జనరల్ సర్జరీ విభాగానికి డాక్టర్ కూరపాటి రమేశ్, డాక్టర్ టి. నాగేందర్ పదోన్నతిపై చేరనున్నారు.



మాధవరావు

ఆప్తమాలజీ విభాగంలో డాక్టర్ కె.హరిందర్ కుమార్ ఆర్‌ఈహెచ్, గౌనకాలజీ విభాగం నుంచి డాక్టర్ కె.లక్ష్మీదేవి, బి.సుమలత వరంగల్ సీకేఎంకు, హనుమకొండ ప్రభుత్వ టీబీ ఆస్పత్రికి డాక్టర్ పి.రవి, ఎంజీఎం ఈఎన్‌టీ విభాగానికి డాక్టర్ సంపత్‌రావు, డాక్టర్ వినయ్ కుమార్ ప్రొఫెసర్‌గా రానున్నారు. పిల్లల వైద్య విభాగంలో పి.పద్మిని సౌజన్య, కె.ప్రదీప్ కుమార్, అనాటమి విభాగంలో డాక్టర్ కె.శశికాంత, మైక్రో బయాలజీ విభాగంలో డాక్టర్ ఎన్.శ్రీనివాస్, ఫార్మకాలజీ విభాగంలో డాక్టర్ బి.రమేశ్‌చంద్ర, ఎస్‌పీఎం విభాగంలో డాక్టర్ ఎల్.మురళి పదోన్నతిపై ఎంజీఎం, కేఎంసీలకు రానున్నారు.

సూపర్ స్పెషాలిటీలో పదోన్నతులు

సూపర్ స్పెషాలిటీ విభాగంలో కార్డియాలజీ విభాగంలో డాక్టర్ సి.మమతారెడ్డి పదోన్నతి పొందారు. న్యూరాలజీ విభాగంలో డాక్టర్ వి.ఎస్.మాధవరావు మహబూబాబాద్ నుంచి కేఎంసీకి ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. న్యూరో సర్జరీ విభాగానికి డాక్టర్ లక్ష్మణ్, యూరాలజీ విభాగానికి డాక్టర్ బి.సంతోష్ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొంది రానున్నారు.

23.5 ఫీట్లకు పాకాల నీటిమట్టం

నర్సంపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్‌పరిధిలోని ఖానాపురం మండలంలోగల పాఖాల సరస్సు నీటిమట్టం శుక్రవారం సాయంత్రం వరకు 22.5 ఫీట్లకు చేరింది. మరో 7ఫీట్లు చేరితే మత్తడిపోసే అవకాశం ఉంది. 30 ఫీట్ల నీటి సామర్థ్యం ఉన్న సరస్సులోకి వరసగా కురుస్తున్న వర్షాలతో నీటి మట్టం రోజురోజుకు పెరుగుంతుడంతో ఖరీఫ్‌లో పూర్తిస్థాయిలో ఆయకట్టు సాగవుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నర్సంపేట మండలం మాధన్నపేట చెరువులో 17 అడుగులకు గాను 13 అడుగుల నీటిమట్టం చేరింది. మరో 4 ఫీట్ల నీరు చేరితే మత్తడి పోయనుంది.



నిండుకుండలా మారిన పాఖాల సరస్సు

టీజీ లాసెట్, టీజీ పీజీఎల్‌సెట్-2025లో ప్రవేశాలు

జారీ అయిన షెడ్యూల్

హనుమకొండ, జూల్ 25 (ఆంధ్రజ్యోతి) : టీజీసీహెచ్‌ఈ చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి అధ్యక్షతన సమావేశమైన టీజీ లాసెట్-2025, పీజీఎల్‌సెట్-2025 ప్రవేశాల కమిటీ ప్రవేశాల షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేసింది. దీని ప్రకారం టీజీ లాసెట్, టీసీ పీజీఎల్‌సెట్-2025 ప్రవేశాల షెడ్యూల్ నోటిఫికేషన్ ఈనెల 26న జారీ అవుతుంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్, సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతుల అప్‌లోడింగ్‌తోపాటు ఆన్‌లైన్ చెల్లింపులకు లాసెట్‌కు ఆగస్టు 4 నుంచి 14 తేదీ వరకు, పీజీఎల్‌సెట్‌కు ఆగస్టు 27 నుంచి 29వ తేదీ వరకు, స్లాట్ బుకింగ్ ద్వారా స్పెషల్ కేటగిరీ సర్టిఫికెట్ల (ఎన్‌సీసీ/ సీఏపీ/ పీహెచ్/ స్పోర్ట్స్) పరిశీలన లాసెట్‌కు ఆగస్టు 11 నుంచి14వ తేదీ వరకు, పీజీఎల్‌సెట్ ఆగస్టు 27 నుంచి 29వ తేదీ వరకు, అర్హులైన అభ్యర్థుల జాబితా ప్రకటన, ఈ మెయిల్ ద్వారా ఇతరత్రా సవరణకు పిలుపునకు లాసెట్‌కు ఆగస్టు 15వ తేదీ, పీజీలాసెట్‌కు సెప్టెంబర్ 2వ తేదీ, మొదటి విడత వెబ్ ఆప్షన్స్ నిర్వహణ లాసెట్‌కు ఆగస్టు 16,17 తేదీలు, పీజీఎల్ సెట్ సెప్టెంబర్ 3,4 తేదీలు, మొదటి విడత వెబ్‌ఆప్షన్స్ ఎడిట్ లాసెట్‌కు ఆగస్టు 18వ తేదీ, పీసీఎల్ సెట్‌కు సెప్టెంబర్ 9వ తేదీ, ఎంపికైన అభ్యర్థుల ప్రొవిజినల్ జాబితా కళాశాలల వారీగా తయారీ, వెబ్‌సైట్‌లో ప్రదర్శనరే లాసెట్‌కు ఆగస్టు 22వ తేదీ, పీజీఎల్‌సెట్‌కు సెప్టెంబర్ 8వ తేదీ, ట్యూషన్ ఫీజు చెల్లింపు చాలన్లతో ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంబంధిత కళాశాల్లో రిపోర్టు కావడానికి లాసెట్‌కు ఆగస్టు 22 నుంచి 25 తేదీ వరకు పీజీలాసెట్‌కు సెప్టెంబర్ 9 నుంచి 13వ తేదీ వరకు, తరగతులు ప్రారంభం లాసెట్‌కు ఆగస్టు 30వ తేదీ, పీజీలాసెట్‌కు సెప్టెంబర్ 10 తేదీగా షెడ్యూల్‌ను నిర్ణయించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2645	1521
పల్లికాయ (సూక)	5670	3450
పల్లికాయ (పచ్చిది)	4750	1575
కందులు	6232	3022
పెసళ్లు	7052	3022
పత్తి	7810	5300
పసుపు (కాడి)	10322	9534
పసుపు (గోల)	9459	8700
తేజ మిర్చి	11500	8500
తేజ ఏసీ	13300	11500
వండర్‌హాట్	10000	6000
వండర్‌హాట్ ఏసీ	13200	11500
యూఎస్341ఏసీ	12800	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	5000	3000

- వరంగల్ వ్యవసాయం

శుభకరం.. శ్రావణమాసం..

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాలు ప్రారంభం
- పెద్దసంఖ్యలో పాల్గొన్న మహిళలు
- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు
- వేయిస్తంభాల ఆలయంలో లక్ష తులసీ అర్చన



రుద్రేశ్వరాలయంలో తులసీ అర్చన నిర్వహిస్తున్న అర్చకులు



రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు



కరెన్సీ దండల అలంకరణలో సంతోషిమాత

హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఈసారి వారం రోజుల ముందే శ్రావణ సందడి ఆరంభమైంది. శ్రావణ తొలిరోజు శుక్రవారం కావడంతో అన్ని ఆలయాల్లో భక్తుల తాకిడి పెరగడంతోపాటు ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఒక పక్క వర్షం పడుతున్నా భక్తి శ్రద్ధలతో ఆలయాలకు చేరుకొని వేడుకల్లో పాల్గొన్నారు. ప్రసిద్ధ భద్రకాళి ఆలయంలో అమ్మవారిని శోభాయమానంగా అలంకరింపజేసి వేడుకలను ఆరంభించారు. రాజరాజేశ్వరి ఆలయంలో శ్రావణవ్రతాలు సందడిగా ప్రారంభం అయ్యాయి. చారిత్రక హనుమకొండలోని వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో భక్తుల కోలాహలం మధ్య శ్రావణ వేడుకలు ప్రారంభం అయ్యాయి. మహాలక్ష్మీ ప్రీతికర శుక్రవారం రోజు శ్రావణమాస ప్రారంభవేళ రుద్రేశ్వరుడికి ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, మణికంఠశర్మ, సందీప్ శర్మల ఆధ్వర్యంలో లక్ష తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. ప్రముఖ శివభక్తుడు గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు వెంకటేశ్వర్లు, ఉమారాణి దంపతుల సౌజన్యంతో లక్ష నామాలతో తులసీ అర్చనను ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. ప్రముఖ ఆర్యవైశ్య నాయకుడు గట్టు మహేశ్‌బాబుతోపాటు అనేక మంది వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖులు తొలినాటి శ్రావణ వేడుకల్లో పాల్గొన్నారు.

హనుమకొండ, వరంగల్, కాజీపేట త్రినగరాల్లోని మార్వాడీ మహిళలు సుమారు 200 మంది లష్కర్‌బజార్ రాంమందిర్ నుంచి ఊరేగింపుగా శివనామ స్మరణతో బాజా భజంత్రీలను గంగాజల కావడిలను భుజంపై ధరించి ఊరేగింపుగా వేయిస్తంభాల ఆలయానికి చేరుకొని కావడి పూజ నిర్వహించుకున్నారు. ఆలయ నాట్యమండపంలో శ్రావ్యంగా భక్తి పాటలతో సందడి చేస్తూ ఆధ్యాతికతను గుబాళింపజేశారు.

హనుమకొండలోని సిద్ధేశ్వరాలయంలో శ్రావణ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు సిద్దేశుని సురేశ్, రవికుమార్ ఆధ్వర్యంలో సిద్ధేశుడి పాడ్యమి తిథిని పురస్కరించుకొని అమర్‌నాథుడిగా ప్రత్యేకంగా అలంకరింపజేసి పూజలు నిర్వహించారు. హనుమకొండ అదాలత్ వెంకటేశ్వరాలయం, రెవెన్యూ రామాలయం, శ్రీరంగనాథుడి పెద్ద కోవెలలో శ్రావణ వేడుకలు ప్రారంభం అయ్యాయి.

కిటకిటలాడిన దేవాలయాలు

శ్రావణ మాసం వేడుకలను పురస్కరించుకొని వరంగల్ హంటర్‌రోడ్డులోని శ్రీసంతోషిమాత దేవాలయంలో అమ్మవారిని కరెన్సీ దండలతో అలంకరించారు. ములుగురోడ్డులోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో అర్చకుడు రాపాక గోపీకృష్ణశర్మ ఆధ్వర్యంలో శ్రావణ మాసోత్సవాలు నిర్వహించారు. ఎంజీఎం సెంటర్‌లోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకం, పూజలు, అలంకరణ జరిపించారు. సామూహికంగా వరలక్ష్మి వ్రతాలను ఆచరింప చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వాసవీ మాత దేవాలయం, శివనగర్‌లోని లలితామాత దేవాలయం, బట్టల బజార్‌లోని శ్రీవేంకటేశ్వరాలయం, దుర్గేశ్వర, రామలింగేశ్వర, భోగేశ్వర, ఆకారపువారి గుడి, కాశిబుగ్గ శివాలయంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీలలితా సహస్ర పారాయణాలు, దివ్యనామ సంకీర్తలు ఏర్పాటు చేశారు. పలు చోట్ల అన్నప్రసాదాలు అందించారు.



రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

క్రీడా స్ఫూర్తితో గెలుపే లక్ష్యంగా పోటీ పడాలి..

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్
- ప్రారంభమైన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్
- ఆఫీసర్స్ క్లబ్‌లో మూడు రోజులు పాటు క్రీడలు
- హాజరైన 250మంది షట్లర్లు, కోచ్‌లు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 25(ఆంధ్రజ్యోతి): క్రీడా స్ఫూర్తితో గెలుపే లక్ష్యంగా క్రీడల్లో పోటీ పడాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు. యోనెక్స్ సన్‌రైజ్ సహకారంతో మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని చేరవచ్చన్నారు. తను స్వతహాగా బ్యాడ్మింటన్ క్రీడాకారుడినని, ఎన్నో టోర్నమెంట్లలో పాల్గొన్నారన్నారు. ఈ క్రమంలో తన భుజానికి గాయం కావడంతో బ్యాడ్మింటన్ క్రీడకు దూరం కావాల్సి వచ్చిందన్నారు. వ్యాయామంలో భాగంగా ప్రతీరోజు టెన్నిస్, క్వాష్ క్రీడల్లో సాధన చేస్తున్నానన్నారు. మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏసీపీ(ఎస్బీ) మూల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు ఆఫీసర్స్ క్లబ్‌తో పాటు ఎర్రగట్టుగుట్ట సమీపంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ టోర్నీలో 20 జిల్లాల నుంచి 250మంది క్రీడాకారులతో పాటు 20 మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు, అంపైర్లు పాల్గొన్నారన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ వీసీ డాక్టర్ టి. యాదగిరిరావు, వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎస్.రమేష్‌కుమార్, డాక్టర్ పింగిలి రమేష్‌రెడ్డి, మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొమ్ము రాజేందర్, కోశాధికారి నాగ కిషన్, కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, ఆఫీసర్స్ క్లబ్ ఇంచార్జీ కార్యదర్శి బి.కన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మిక్స్‌డ్ డబుల్స్‌లో తలపడుతున్న షట్లర్లు

భద్రకాళి ఆలయంలో శ్రావణ పూజలు



అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తున్న ములుగు కలెక్టర్ దంపతులు

వరంగల్ కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రసిద్ధి గాంచిన భద్రకాళి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం శ్రావణ మాసం పూజలు జరిగాయి. నెల రోజుల పాటు కొనసాగే వేడుకల్లో భాగంగా అమ్మవారికి నిత్య పూజ, నిత్య అర్చన నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు.

ములుగు జిల్లా కలెక్టర్ దివాకర కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ధర్మకర్తలు, అర్చకులు వారికి స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శేష భారతితో పాటు చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్‌రెడ్డి, గాండ్ల స్రవంతి, ఓరుగంటి పూర్ణచందర్, పాలడుగుల ఆంజనేయులు, బింగి సతీష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోగనున్న పెళ్లిభాజా

నేటి నుంచి శుభ ముహూర్తాలు



వెంకటాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆషాడం ముగిసింది. శుక్రవారం శ్రావణ మాసం ప్రారంభమైంది ఈ మాసం వస్తూవస్తూ ఎన్నో శుభ ముహూర్తాలను తెచ్చింది. సుమారు రెండు నెలలుగా శుభ ముహూర్తాలు లేకపోవడంతో పెళ్ళిళ్ళు నిలిచిపోయాయి. దీంతో శ్రావణమాసం ఎప్పుడొస్తుందా అని చాలా మంది వేచి చూశారు. ఈ నెల 26, 30, 31, తేదీలతో పాటు వచ్చే నెల 1 , 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17 తేదీలో వేలాది పెళ్లిళ్ళు జరుగనున్నాయని పండితులు పేర్కొన్నారు. ఆ తర్వాత భాద్రపద మాసంలో శుభముహూర్తాలు ఉండవని, సెప్టెంబరు నాలుగో వారం నుంచి నవంబర్ చివరి వరకు వివాహాది శుభకార్యాలకు ముహూర్తాలు ఉంటాయని చెబుతున్నారు. ఇప్పటికే చాలా మంది పెళ్ళిళ్ళు, ఇతర శుభకార్యాలకు ముహూర్తాలు నిశ్చయించుకున్నారు. శ్రావణమాసం ప్రారంభం కావడంతో అంతటా పెళ్ళి కళ కనిపిస్తోంది. వ్యాపారాలు కళకళలాడుతున్నాయి. అయితే ముహూర్తాల సమయంలో బంగారం ధరలు మరింత పెరగడంతో కొనుగోలుదారులను ఆందోళనకు గురి చేస్తోంది.



అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామ సభ

భూ సేకరణకు సహకరించాలి

- గాడిపల్లి గ్రామసభలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి
- బాధితులకు నష్టపరిహారం ప్రకటించిన అధికారులు
- అసంతృప్తి వ్యక్తం చేసిన భూ బాధితులు

మామునూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి కావాల్సిన భూసేకరణకు రైతులు సహకరించాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి కోరారు. మామునూరు మండలం గాడిపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆమె రైతులతో మాట్లాడారు. ఇండ్లు కోల్పోయిన వారికి భూ చట్టం ప్రకారం కలెక్టర్ సత్యశారద ఒక రేటు నిర్ణయించారని, ఇందుకు రైతులు సహకరించాలని కోరారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో ఇండ్లు కోల్పోతున్న 20మంది నిర్వాసిత కుటుంబాలను గుర్తించారని, చట్ట ప్రకారం నష్టపరిహారాన్ని అందజేస్తామని అన్నారు. 2013 భూచట్టం ప్రకారం జనరల్ స్కీం కింద (ల్యాండ్ ఆక్యూపేషన్, వన్ టైం రీ సెటిల్‌మెంట్, షిఫ్టింగ్ ట్రాన్స్‌పోర్ చార్జెస్, 12 నెలల రెంట్ అలవెన్స్) మొత్తం కలిపి రూ.7లక్షల86 వేలు అందజేస్తారని, 2016 చట్టం ప్రకారం కాన్సెంట్ స్కీం కింద (ల్యాండ్ ఆక్యూపేషన్, వన్ టైం రీ సెటిల్‌మెంట్, షిఫ్టింగ్ ట్రాన్స్‌పోర్ చార్జెస్, 12 నెలల రెంట్ అలవెన్స్) మొత్తం కాన్సర్డ్ స్కీం కింద రూ.11 లక్షల 56 వేలు నష్టపరిహారం అందుతుందని అన్నారు. అంతే కాక బిల్డింగ్ నిర్మాణ ఖర్చులను లెక్కించి అదనంగా అందజేస్తారని, దీనికి ఒప్పుకున్నట్లైతే 12 ఇండ్లకు సంబంధించి మొత్తం 20 మంది కుటుంబ సభ్యులు రతపూర్వకంగా సంతకాలు చేసి తహసీల్దార్‌కు అందజేయాలని సూచించారు. వీరు కాకుండా ఇంకెవరైనా అర్హులు ఉంటే ఆధార్ కార్డు, ఓటర్ కార్డు సమర్పించాలని సూచించారు. తప్పుడు ఆధారాలతో ప్రభుత్వ బెనిఫిట్స్ పొందాలని చూస్తే చీటింగ్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కాగా, ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బాధిత రైతులు ఆందోళనకు దిగారు.

నష్టపరిహారంపై అసంతృప్తి..

ఏళ్ల తరబడి నివాసముంటున్న ఇండ్లను తాము వదులుకోలేమని, మార్కెట్ రేటుకు తగ్గట్టుగా నష్టపరిహారం చెల్లించాలని, లేదంటే ఇల్లుకు బదులు ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికి మూడు సార్లు గ్రామ సభ నిర్వహించి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు, మామునూరు సీఐ రమేష్ పాల్గొన్నారు.

మాకు ఇళ్లు కట్టించి ఇవ్వాలి..



నాకు నాలుగు గుంటల ఇంటి స్థలం ఉంది. దానికి బదులుగా వసంతపూర్ రోడ్డు పక్కన అంతే స్థలంలో ఇల్లు కట్టించి ఇవ్వాలి. అంతేతప్ప ఇతర ఏ బెనిఫిట్స్ వద్దు. భూమికి బదులు భూమి ఇస్తేనే సరి. లేకపోతే చావుకైనా సిద్ధమే.

- కత్తెరపల్లి లక్ష్మి, గాడిపెల్లి

న్యాయం చేయకపోతే ఊరుకోం..



మాకు పైసలు వద్దు ఏమీ వద్దు.. మమ్మల్ని ఇలా బతకనివ్వండి.. మా అమ్మ వృద్ధురాలు. ఈ ఇంట్లోనే తుది జీవితం గడపాలనుకుంటోంది. వేరే దగ్గర ప్రాణం పోతే ఆత్మశాంతించదు. మా ఇంటిలో ఉంటేనే మాకు సంతృప్తి.ఇతర ప్రాంతాలకువెళ్లలేం. బలవంతం చేస్తే ఆందోళనకు దిగుతాం.

- జిల్ల యాకమ్మ

ఏడూళ్ల ఏటి కష్టాలు తీరేనా?

- పడవ ప్రయాణమే శరణ్యం
- ప్రతి వర్షాకాలంలో తప్పని అవస్థలు
- రెండేళ్లయినా సాగని పనులు
- కొండాయి బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం
- కొట్టుకుపోయిన కొండాయి- దొడ్ల తాత్కాలిక రహదారి





2023 జూలైలో వచ్చిన వరదలకు కొట్టుకుపోయిన కొండాయి బ్రిడ్జి, కొండాయి బ్రిడ్జి వద్ద జంపన్నవాగును పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

ఏటూరునాగారం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఏటా వర్షాకాలం వచ్చిందంటే ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి, దొడ్ల, మల్యాల, దొడ్ల కొత్తూరు, గోవిందరాజులకాలనీ, ఐలాపురం, ఎలిశెట్టిపల్లి గ్రామాల ప్రజల కష్టాలు వర్ణనాతీతం. ఈ ఏడాదీ అదే దుస్థితి నెలకొంది. ఈ గ్రామ ప్రజలకు పడవ ప్రయాణమే ఏకైక శరణ్యంగా మారింది. రవాణా మార్గం లేక ప్రతి వర్షాకాలంలోనూ పడవ ప్రయాణమే వారికి దిక్కవుతోంది. రోడ్లు, బ్రిడ్జిలు లేకపోవడంతో వర్షాలు మొదలవగానే జలమయమయ్యే వాగులు, వంకలను దాటడానికి స్థానికులు పడవలపై ఆధార పడక తప్పడం లేదు. ఇది కేవలం ప్రయాణ సౌకర్య సమస్య మాత్రమే కాదు, ప్రాణాలను పణంగా పెట్టి ప్రమాదకరమైన ప్రయాణం. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారికి సరైన రవాణా సదుపాయం లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పడవ ప్రయాణాల్లో అనేక ప్రమాదాల ఘటనలూ చోటు చేసుకున్నాయి. ఏళ్లు గడుస్తున్నా ఈ గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం కల్పించకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు ప్రభుత్వం వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. కొండాయి బ్రిడ్జి నిర్మాణంలో జరుగుతున్న జాప్యం, మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో దొడ్ల-మల్యాల మధ్య తాత్కాలిక రహదారి కూడా అధ్వానంగా మారింది. దీంతో గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. మట్టి రోడ్డు ధ్వంసమై వాహనాల రాకపోకలకు అనుకూలంగా లేకుండా పోయింది. వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఈ గ్రామాలకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. 2023 జూలైలో వచ్చిన భారీ వరదలకు కొండాయి-దొడ్ల గ్రామాల మధ్య నున్న జంపన్నవాగు ఉప్పొంగి, కొండాయి హైలెవల్ బ్రిడ్జి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఆ విషాద ఘటనలో ఎనిమిది మంది జలసమాధి అయ్యారు. ఆ జ్ఞాపకాలు గిరిజనుల గుండెల్లో గుబులు రేపుతోంది. జంపన్నవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నా అవి ఈ ఏడాది పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఈ వర్షాకాలంలోనూ తమకు పడవ ప్రయాణం తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం త్వరగా బ్రిడ్జి పనులను పూర్తి చేసి తమ కష్టాలను తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కొండాయి-దొడ్ల గ్రామాల మధ్య కొట్టుకుపోయిన తాత్కాలిక రహదారి

జంపన్నవాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టి రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి మట్టి రోడ్డు బురదమయంగా మారి, వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. పాదచారులు సైతం నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు.

ఇంకా వీడని భయాందోళన

2023 జూలైలో వచ్చిన భారీ వరదలకు కొట్టుకుపోయిన కొండాయి హైలెవల్ బ్రిడ్జి దుర్ఘటన తాలూకు భయాందోళనలు స్థానికులను ఇంకా వెంటాడుతున్నాయి. జంపన్నవాగు ఉప్పొంగినప్పుడు బ్రిడ్జి కొట్టుకుపోయి వాగులో ఎనిమిది మంది మరణించిన విషాద ఘటనను మర్చిపోలేకపోతున్నామని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వర్షాకాలం వచ్చిందంటే ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళన వారిని నిద్రపట్టనీయడం లేదు.

ప్రజలకు తప్పని రవాణా తిప్పల

ఏడు గ్రామాల ప్రజలకు మరోసారి రవాణా కష్టాలు మొదలయ్యాయి. రహదారులు అధ్వానంగా మారడంతో దైనందిన జీవితంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే పరిస్థితి నెలకొంది. వైద్య సేవలు, నిత్యావసరాల కొనుగోళ్లు, విద్యార్థుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా ఎదురవుతున్న ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం ఎందుకు?

జంపన్నవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల్లో జాప్యం చోటు చేసుకోవడం స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. కొట్టుకుపోయిన కొండాయి హైలెవెల్ బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం కోసం మంత్రి సీతక్క ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రూ. 16.50 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ డ్రిల్లింగ్ పనులకు వెనుకంజ వేశారు. ఈ వంతెన పనులు పూర్తి కావాలంటే ఆరు నెలల నుంచి ఏడాది సమయం పట్టే అవకాశం ఉందని, అవి ఈ ఏడాది పూర్తయ్యే అవకాశం లేదని పలువురు అంటున్నారు. కొత్త బ్రిడ్జి త్వరగా పూర్తయితే తమ కష్టాలు తీరుతాయని ఆశించిన ప్రజలకు, పనుల్లో జాప్యం నిరాశను మిగులుస్తోంది. బ్రిడ్జి పనులు నత్తనడకన సాగడం వల్ల ఈ ఏడాది కూడా రవాణా కష్టాలు తప్పవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు ఉచిత ప్రమాద బీమా

- ఎరువులు కొనుగోలు చేసిన వారికి ఇఫ్కో కంపెనీ కానుక
- రూ. 10 వేల నుంచి 2 లక్షల వరకు సౌకర్యం

వరంగల్ వ్యవసాయం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం చెమ ట చిందించే రైతన్నకు అండగా ఉండాలనే ఉద్దేశంతో ఇఫ్కో కంపెనీ సంకటహరణ పేరుతో ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తోంది. ఎలాంటి అదనపు చార్జీలు, ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేకుండా కేవలం ఆ కంపెనీ ఎరువులు కొన్నవారందరికీ ఈ బీమా వర్తిస్తుంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇఫ్కో కంపెనీ వరంగల్ జిల్లా మేనేజర్ విశాల్ కోరుతున్నారు.

ఎరువులు కొంటే... బీమా

సహకార సంఘాలు లేదా దుకాణాలలో కొనుగోలు చేసే ప్రతీ ఎరువు బస్తా, లేదా నానో ఎరువు బాటిల్‌పై రూ.10 వేల బీమా వర్తిస్తుంది. అయితే దీనికి అత్యధికంగా రూ.2లక్షల వరకు పరిమితి విధించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతు ప్రమాదవశాత్తు మరణిస్తే వందశాతం, రెండు అవయవాలు కోల్పోతే 50శాతం, ఒక అవయవం కోల్పోతే 25శాతం బీమా లభిస్తుంది. కొనుగోలు చేసిన నెల రోజుల నుంచి 12 నెలల వరకు ఈ ప్రయోజనం పొందవచ్చు. రోడ్డు ప్రమాదాలు, నీటిలో మునిగిపోవడం, పాము కాటు, గ్యాస్ సిలిండర్ పేలిపోవడం, అగ్నిప్రమాదాలు, యంత్రాల వల్ల కలిగే ప్రమాదాలకు ఇది వర్తిస్తుంది. ప్రకృతి వైపరీత్యాలు, ఆత్మహత్యలకు వర్తించదు.

నిబంధనలు పాటించాలి..

రైతులు ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి. రశీదుపై కొనుగోలుదారుడి పేరు, తండ్రి పేరు లేదా భర్త పేరు, తేదీ, చిరునామా, కొనుగోలు చేసిన ఇఫ్కో ఎరువుల సంఖ్య, నామినీ పే రు, కొనుగోలుదారుడి సంతకం, వేలిముద్ర ఉండాలి. రశీదుతో పాటు కొ నుగోలు వివరాల ధ్రువీకరణకు విక్రయాల రిజిస్టర్ నకలు పత్రం, పోలీ స్టేషన్‌లో కేసు నమోదైన ఎఫ్ఐఆర్ కాపీ, వైద్యుడి చికిత్స నివేదిక, పోస్టుమార్టం నివేదిక, మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. క్లైమ్ ప త్రాలను ప్రమాదం సంభవించిన తేదీ నుంచి 2నెలల్లోగా సికింద్రాబాద్‌లోని ఇఫ్కో టోకియోసాధారణ బీమాకంపెనీలిమిటెడ్‌కు పంపించాలి.

కేయూ పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు షురూ

కేయూ క్యాంపస్ జూలై 25, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఇతర పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. కేయూ క్యాంపస్ కళాశాలలోని కామర్స్, ఇంగ్లీష్, స్టాటస్టిక్స్, ఫిజిక్స్ విభాగాల్లో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌లతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి సౌజన్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మమత, ప్రిన్సిపాల్స్ అమరవేణి, శ్రీనివాస్, ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి, డాక్టర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.



పరీక్షల కేంద్రాలను పరిశీలిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, తదితరులు



దాశరథి జయంతిలో పాల్గొన్న నవీన్ తదితరులు

కేడీసీలో దాశరథి కృష్ణమాచార్యకు నివాళి

కేయూ క్యాంపస్ జూలై 25, (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం దాశరథి కృష్ణమాచార్య శతజయంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ హాజరై మాట్లాడారు. తెలంగాణలో నిజాంపాలన పరిస్థితులు, పోరాటాలు, దాశరథి కృష్ణమాచార్య రచనలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సత్యనారాయణ, సాయిలు, సీతారాములు, రమేశ్, మహేందర్, శ్రీనివాస్, మమత పాల్గొన్నారు. క్విజ్, వ్యాసచరన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నవీన్ చేతుల మీదుగా బహుమతులను ఇప్పించారు.

దళితులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలి

కాజీపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అర్హులైన దళితులకు కాజీపేట మండలంలోని న్యూశాయంపేటలో కట్టిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు ఓరుగంటి సాంబయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ బావుసింగ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు దళితులకు ఇళ్లతో పాటు అన్ని రకాలుగా ఆదుకుంటామని అధికారంలోకి వచ్చాక నాయకులు వాటిని మర్చిపోతున్నారని పేర్కొన్నారు. దళితులకు కొన్ని ప్రాంతాల్లో ఇళ్లు కిరాయికి ఇవ్వడం లేదని, ప్రభుత్వం స్పందించి దళితులకు ఇండ్లు కేటాయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం అశోక్, నాయకులు రోడ్డ రాజు, జంపాల రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న కేవీపీఎస్ నాయకులు

రైలు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

హసన్‌పర్తి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లాపూర్ రైల్వేస్టేషన్ సమీపంలోని జయగిరి-చింతగట్టు రైల్వే లైన్‌పై శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు.అతడిని రైల్వే సిబ్బంది 108 అంబులెన్స్‌లో ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఆ వ్యక్తి పరిస్థితి మెరుగ్గానే ఉందని వైద్యులు తెలిపారు. క్షతగాత్రుడిని సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లిన అంబులెన్స్ డ్రైవర్ నాగరాజు, ఈఎంటీ ప్రకాష్ స్థానికులు అభినందించారు.



రైలు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి

నగరంలో నకిలీ బీడీల బాగోతం

అక్రమంగా ఇతర రాష్ట్రాలకు రవాణా

బాలసముద్రం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోజుకు సుమారు 50 లక్షల మేర నకిలీ బీడీలు తయారవుతుండగా అందులో దాదాపు సగం 30 లక్షల వరకు వే బిల్లు లేకుండా ట్రాన్స్ పోర్టుల నుంచి అక్రమంగా ఇతర రాష్ట్రాలకు రవాణా అవుతున్నట్లు తెలుస్తోంది. బీడీల ఎగుమతికి 28 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉండగా ట్యాక్స్‌ను ఎగవేసేందుకు పలువురు వ్యాపారులు ట్రాన్స్‌పోర్టు యజమానులను మచ్చిక చేసుకొని వాహనాల్లో ఇతర సరుకుల మధ్య పెట్టి తనిఖీ అధికారుల కంట పడకుండా జాగ్రత్త పడుతున్నట్లు తెలిసింది. వాణిజ్య పన్నుల అధికారులు కూడా నకిలీ బీడీలు వే బిల్లు లేకుండా రవాణా అవుతున్నట్లు తెలిసినా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంహెచ్‌ఆర్ఎం బీవోఎస్‌గా శ్రీను

కేయూ క్యాంపస్ జూలై 25, (ఆంధ్రజ్యోతి): కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎహెచ్‌ఆర్ఎం విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా డాక్టర్ చీకటి శ్రీను నియమితులయ్యారు.ఈ మేరకు శుక్రవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు వెలువరించగా వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి శ్రీనుకు అందచేశారు. ఇప్పటివరకు బీవోఎస్‌గా కొనసాగిన డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు నుంచి బాధ్యతలు చేపడుతారు. 22 ఏళ్ల అనుభవం కల్గిన శ్రీను 30 జాతీయ సదస్సులు, 10 అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. 50 పరిశోధన పత్రాలను ప్రచురించారు. 5 పుస్తకాలను రాశారు. ఈ సందర్భంగా శ్రీనును పలువురు అభినందించారు.



ఉత్తర్వులు తీసుకుంటున్న శ్రీను

ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలి

వడ్డెపల్లి, జూలై25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు విద్యను అందించేందు కోసం రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని తేవాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన డీఎన్ఎస్ఎస్ జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. తమిళనాడు, ఢిల్లీ తరహాలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకొచ్చి ప్రతీ పేద విద్యార్థికి విద్య అందేలా చర్యలు చేపట్టాలని కుమారస్వామి కోరారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రవేశ రుసుం, టర్మ్ ఫీజు చట్ట వ్యతిరేకమన్నారు. సమావేశంలో డీఎన్ఎస్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం. మహేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జన్ను శివరాజు, జిల్లా కార్యదర్శి రాజు, కంజర్ల సమ్మయ్య, చల్లా మిథున్, సీహెచ్. బాసిత్ తదితరులు పాల్గొన్నారు.

కాశీలో అలరించిన చేపూరి శ్రీరామ్ అష్టావధానం

హనుమకొండ కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శృంగేరి పీఠాధిపతి జగద్గురు భారతీతీర్థస్వామి వారి వజ్రోత్సవాల సందర్భంగా రెండు రోజులుగా నిర్వహిస్తున్న వేడుకల పరంపరలో శుక్రవారం వరంగల్‌కు చెందిన ప్రముఖ అష్టావధాని చేపూరి శ్రీరామ్‌చే అవధాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం రెండు గంటలపాటు సాహితీ రసజ్ఞులను ఓలలాడింపజేసి ఓరుగల్లు ఖ్యాతిని ఇనుమడింపజేసిందని అవధానవిద్య వికాస పరిషత్ అధ్యక్షుడు మరుమాముల దత్తాత్రేయశర్మ ఒక ప్రకటనలో చేపూరి శ్రీరామ్‌ను అభినందించారు. వరంగల్‌కు చెందిన కంది శంకరయ్య సమన్వయకులుగా వ్యవహరించి నిర్వహించిన కార్యక్రమం ప్రశంసలందుకోవడం తమకు గర్వకారణంగా ఉందని సహృదయ అధ్యక్షులు గిరిజా మనోహర్ బాబు, శతవదాని ఆముదాల మురళి, ఎన్‌వీఎన్.చారి అభినందించారు.

లబ్ధిదారుల ఎంపిక వెంటనే పూర్తి చేయాలి

ఇందిర సౌరగిరి జలవికాసంపై కలెక్టర్ స్నేహ శబరీష్ సమీక్ష

హనుమకొండ కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇందిర సౌరగిరి జల వికాసం పథకానికి అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో శుక్రవారం ఇందిర సౌర గిరి జలవికాసం పథకం గురించి ఐటీడీఏ, వ్యవసాయ, ఉద్యాన, గిరిజన సంక్షేమ, డీఆర్‌డీఏ, అటవీశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించి ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం నిర్దేశిత లక్ష్యం, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ, పథకం ద్వారా లబ్ధిదారులకు చేకూరే ప్రయోజనాల గురించి సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వం ఈ పథకం కింద హనుమకొండ జిల్లాకు 2025-26 సంవత్సరానికి గాను 64 మంది లబ్ధిదారులకు చెందిన 58 ఎకరాల పోడు భూములు మంజూరు ఇచ్చినట్లు అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా పోడు పట్టాలు కలిగిన గిరిజనులకు 2.20 ఎకరాల భూమి కలిగిన గిరిజన రైతుకు రూ.6లక్షలతో బోరు, పంపు సెట్టు, 5లేదా 7.5 హార్స్ పవర్ కలిగిన మోటారు, పైపులు, సోలార్ పలకలు ఉచితంగా మంజూరు చేస్తుందని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ఇందిర సౌర గిరి జల వికాసం పథకానికి లబ్ధిదారులను మండల స్థాయి కమిటీలు ఎంపిక చేసి కలెక్టర్ ఆధ్వర్యంలోని జిల్లా కమిటీకి ఎంపిక కోసం అందేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఒక కుటుంబాన్ని యూనిట్‌గా పరిగణిస్తారన్నారు. నిబంధనల మేరకు లబ్ధిదారులకు ఉండాల్సిన 2.20 ఎకరాల భూమి కంటే తక్కువ ఉన్నట్లయితే చుట్టుపక్కల ఉన్న రైతులలో ఇద్దరు లేదా ముగ్గురిని కలిపి ఒక యూనిట్‌గా పరిగణిస్తారన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ మేన శ్రీను, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్నేహ శబరీష్

జేఎన్ స్టేడియాన్ని పరిశీలించిన కలెక్టర్ స్నేహ శబరీష్

వరంగల్ స్పోర్ట్స్ : హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడల అధికారి (డీవైఎస్‌వో)అశోక్‌కుమార్‌తో స్టేడియంలోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌ను కలెక్టర్ సందర్శించారు. నిర్వహణ, ఇతర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా హాస్టల్లో ఉన్న క్రీడాకారులతో భోజన, వసతి సౌకర్యాల గురించి ఆరా తీశారు. అంతకుముందు జేఎన్ఎస్‌లోని సింథటిక్ ట్రాక్, గ్యాలరీలను కలెక్టర్ పరిశీలించి ఇంకా స్టేడియంలో పేరుకుపోయిన సమస్యల గురించి డీవైఎస్‌వోను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా జేఎన్ఎస్‌లో త్వరలో తాత్కలికంగా ఏర్పాటు చేయనున్న స్పోర్ట్స్ పాఠశాల నిర్వహణ కోసం ఎలాంటి సౌకర్యాలు కల్పించాలని అనే విషయాలను కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేసన్ కార్యదర్శి సారంగపాణి, సర్వశిక్ష అభియాన్ డీఈ రవీందర్, డీఎస్ఏ కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ లేకుండా వైద్యం చేయొద్దు..

టీజీఎంసీ సభ్యుడు డాక్టర్ వి.నరేశ్ కుమార్



మడికొండలో తనిఖీలు చేస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేయకుండా ఎవరూ కూడా అల్లోపతి వైద్యం చేయరాదని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని టీజీఎంసీ సభ్యుడు డాక్టర్ వి.నరేశ్‌కుమార్ హెచ్చరించారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. మడికొండ మెయిన్‌రోడ్‌లో సాయి శ్రీ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరిట ఇ.జయరామ్, ఇ.భాగ్యలక్ష్మీ దంపతులు క్లినిక్ నిర్వహిస్తూ అశాస్త్రీయ పద్ధతుల్లో యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్, మలేరియా ఇంజక్షన్‌లు ఇస్తూ మందులు రాస్తున్నట్లు గుర్తించారు. అలాగే మడికొండలోని శ్రీజ క్లినిక్ ఏర్పాటు చేసి ఇంటర్ ఫెయిల్ అయిన టి.రాజు డాక్టర్‌గా పేర్కొంటూ వైద్యం చేస్తూ మందులు రాస్తుండటంతో అధికారులు గుర్తించారు. వీరిపై ఎన్ఎంసీ చట్టం 34, 54, టీఎస్ఎంపీఆర్ చట్టం 22, బీఎన్ఎస్ 318, 319 ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు టీజీఎంసీ సభ్యుడు డాక్టర్ వి.నరేశ్‌కుమార్, డాక్టర్ కె.వెంకటస్వామి తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి 5 రోజుల జైలు

హసన్‌పర్తి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ లో ఒకరికి జిల్లా మెజిస్ట్రేట్ వేణుగోపాల్ 5రోజుల జైలు శిక్ష విధించారు. ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు కథనం ప్రకా రం.. నల్లగొండ జిల్లా తిమ్మాపూర్‌కు చెందిన కోనేటి అంజిబాబు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఈ కేసులో శిక్ష పడిన అంజిబాబును పరకాల సబ్ జైలుకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

మత్స్య కార్మిక జిల్లా కమిటీ ఎన్నిక

బాలసముద్రం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ అలంకార్ జంక్షన్ వద్ద టీఎన్జీవోస్ భవన్‌లో ఈ నెల 24, 25న జరిగిన తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రెండో మహాసభల్లో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా నిమ్మల యుగేందర్, ప్రధాన కార్యదర్శిగా గొడుగు వెంకట్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా బొజ్జం స్వామి, జూనగారి దుర్గయ్య, దువ్వ సమ్మక్క, తెట్టె రవి, మాటూరి సమ్మయ్య, జిల్లా సహాయ కార్యదర్శులుగా పిట్టల రవి, మోరె కుమారస్వామి, మోటం పవన్ కల్యాణ్, నీలం భానుచందర్‌లతో పాటు మరో 19 మంది కార్యవర్గ సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు.

పెన్షనర్ల వ్యతిరేక చట్టాన్ని రద్దు చేయాలి

వడ్డెపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో మే 25న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పెన్షనర్ల ప్రయోజనాల వ్యతిరేక చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ఆల్ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు తూపురాణి సీతారాం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక బిల్లుతో కలిపి పెన్షనర్ల ప్రయోజనాలకు విఘాతం కల్పించే చట్టాన్ని రూపొందించారని ఆరోపించారు. ఆ బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని ఈపీఎస్, కోల్ మైన్స్ పెన్షనర్లకు పెన్షన్ రివిజన్ చేయాలని డిమాండ్ చేశారు. మినిమం పెన్షన్ రూ. 9 వేలు చెల్లించాలని కోరారు. వినిమయ సూచీ ప్రకారం డీఏ, డీఆర్ చెల్లించాలని డిమాండ్ చేశారు. మానవహారంలో పెన్షనర్ల సంఘం నేతలు నారాయణగిరి వీరన్న, పెండ్యాల బ్రహ్మయ్య, రేబెల్లి వెంకటేశ్వరస్వామి, ఆకునూరు విద్యాదేవి, కరేటి శంకర్‌రావు యాదవ్, సంపత్‌కుమార్, పరికిపండ్ల వేణు, వనజ, లక్ష్మీప్రసన్న, సదాశివరెడ్డి, చంద్రమౌళి, అట్ల వెంకటేశ్వర్లు, ఆకుతోట మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న పెన్షనర్ల సంఘం నేతలు

డిజిటల్ లావాదేవీలే కీలకం

ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

వడ్డెపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రంగంలో డిజిటల్ ఆర్థిక లావాదేవీలదే కీలకమని ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో 'డిజిటల్ ఎకానమీ ద ఇంపాక్ట్ ఆఫ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆన్ గ్లోబల్ మార్కెట్స్' అనే అంశంపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రిసెర్చ్ హైదరాబాద్ సహకారంతో పింగిళి కళాశాల ఎకానమిక్స్ విభాగం శుక్రవారం సదస్సు నిర్వహించింది. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి గౌడ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తెలంగాణలోనే సమర్థవంతమైన కళాశాలగా పింగిళి గుర్తింపు పొందిందన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సహకారంతో కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు, మహిళా వర్సిటీగా గుర్తింపునకు తన వంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కళాశాలకు తగిన వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కేయూ ప్రొఫెసర్ సురేష్‌లాల్ మాట్లాడుతూ.. నేటి పరిస్థితుల్లో కృత్రిమ మేధ నిత్యజీవితంలో భాగంగా మారిందన్నారు. ఆర్థిక రంగంలో 12 శాతం ఆర్థిక లావాదేవీలు డిజిటల్ ఎకానమీ ద్వారా జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, అధ్యాపకులు డాక్టర్ పద్మ, అరుణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పింగిళి శ్రీపాల్‌రెడ్డి, చంద్రమౌళి గౌడ్

కేయూలో ఎన్‌సీసీ క్యాడెట్ల ట్రైనింగ్, ఎంపికలు



ఎన్‌సీసీ క్యాడెట్ల సమావేశంలో మాట్లాడుతున్న రామదురై తదితరులు

కేయూ క్యాంపస్ జూలై 25, (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ ఆర్మీ వరంగల్, తెలంగాణ 10వ బెటాలియన్ ఆధ్వర్యంలో జూలై 25 నుంచి ఆగస్టు 2 వరకు ఎన్‌సీసీ క్యాడెట్ల కంబైన్డ్ వార్షిక ఎంపికలు, ట్రైనింగ్ నిర్వహిస్తామని క్యాంప్ కమాండెంట్ రామదురై తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కేయూ సెనెట్ హాల్‌లో ఎంపిక ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా రామదురై హాజరై మాట్లాడారు. 2026 జనవరి 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర్య దినోత్సవంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ ఎన్‌సీసీ క్యాడెట్లను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తామని తెలిపారు. క్రమశిక్షణగల దేశభక్తులుగా క్యాడెట్లను తయారు చేస్తామని అన్నారు. దేశ ఆర్మీ గొప్పతనాన్ని చూపే ఆపరేషన్ సింధూర్ షర్ట్‌ఫిలింను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రవి సునాలే, పి.సతీశ్, ఎం.సదానందం, సౌరస్య, కదం, గణేశ్, రాధాకృష్ణ, రాజమాణిక్యం, అరుణ, కుమారస్వామి, సతీశ్ , క్యాడెట్లు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికోసమే

బీసీ ఆర్డినెన్స్

రాంనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ లబ్ధికోసమే కాంగ్రెస్ పార్టీ బీసీ ఆర్డినెన్స్‌ను తీసుకవస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లుపై శుక్రవారం హంటర్‌రోడ్డులోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. బీసీ సంక్షేమానికి 20 వేల కోట్లు కేటాయిస్తానని హామీ ఇచ్చి ఇంతవరకు ఇవ్వలేదని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. అసెంబ్లీలో 42 శాతం రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెడితే బీజేపీ పార్టీ నుంచి పూర్తి మద్దతు ఉంటుందని శాసనసభ నేత మహేశ్వర్‌రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా.. తమిళనాడు తరహాలో బీసీ రిజర్వేషన్ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వానికి ముడిపెడుతోందని విమర్శించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాశీప్రసాద్, గుజ్జుల సత్యనారాయణ, జయంత్‌లాల్, సంద్ర మధు పాల్గొన్నారు.



మొక్కల ప్రాధాన్యతపై విద్యార్థుల ర్యాలీ దృశ్యం

మొక్కలు పంచిన చిన్నారి విద్యార్థులు

రాంనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా రాంనగర్‌లోని పల్లవి కిడ్స్ పాఠశాల విద్యార్థులు శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. పచ్చని భూమి కోసం- ప్రతి ఒక్కరికి మొక్క అనే నినాదంతో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కొండా శిరీష మాట్లాడుతూ పిల్లల్లో పర్యావరణం పట్ల ప్రేమను, బాధ్యతను పెంపొందించడమే లక్ష్యంగా మొక్కలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఇన్ఫోసిస్ ప్రతినిధులతో వీసీ ప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మనోహర్

కేయూకు ఇన్ఫోసిస్ కంప్యూటర్ల వితరణ

కేయూ క్యాంపస్ జూలై 25, (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఇన్ఫోసిస్ సంస్థ సామాజిక ధాతృత్వ సేవలో భాగంగా శుక్రవారం వర్సిటీలో తుది దఫాలో భాగంగా 120 కంప్యూటర్లను అందచేసింది. ఈ సందర్భంగా ఇన్ఫోసిస్ ప్రతినిధులు వంశీ ముత్యపు, సుమంత్ వల్లాల, ఆదిత్య, శశికాంత్‌లు మర్యాదపూర్వకంగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని తన చాంబర్‌లో కలిశారు. కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, కేయూ నెట్ వర్కింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ బి.రమేశ్‌తో కలిసి వివిధ విభాగాలకు కేటాయించిన ఇన్ఫోసిస్ కంప్యూటర్ల పనితీరును పరిశీలించారు.

కంప్యూటర్ సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఇంజనీరింగ్ కోఎడ్యుకేషన్ కళాశాలలను సందర్శించారు. ఇన్ఫోసిస్ కేయూకు 300 కంప్యూటర్లను అందచేయనుంది. ఇప్పటి వరకు మొత్తంగా 120 అందాయని వర్సిటీ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి రమ, ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి, రమణ, ఆకుతోట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై శ్రావణ మాస పూజలు

మడికొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని మెట్టుగుట్టపై శ్రావణ మాసం పూజలు ప్రారంభమయ్యాయి. మెట్టు రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణమాసం తొలి శుక్రవారం పురస్కరించుకొని పార్వతిమాతను పూజారి రాగిచెడు అభిలాశ్‌శర్మ కదంబ పుష్పాలతో అలంకరించారు. శివాలయం ఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజ కార్యక్రమంలో అర్చకులు సత్యనారాయణశర్మ, విష్ణువర్ధనాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మనం నానబెట్టిన పెసలతో గారెలు, దోశలు, గుగ్గిళ్లు చేసుకుంటూ ఉంటాం. పెసలను మొలకెత్తించి ఇష్టంగా తింటూ ఉంటాం. ఇవి కాక పెసలను విభిన్నంగా ఆస్వాదించాలనుకునే వారి కోసం ఈ రుచులు...

పెసలతో పసందుగా...

వంటిల్లు



పెసర లడ్డూ

కావాల్సిన పదార్థాలు

- పెసలు- ఒక కప్పు, నెయ్యి- నాలుగు చెంచాలు, జీడి పప్పులు- ఆరు, బాదం పప్పులు- ఆరు, యాలకులు- రెండు, బెల్లం ముక్కలు- ఒక కప్పు, నీళ్లు- తగినన్ని

పెసలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల శరీరానికి పొటాషియం, మెగ్నీషియం, జింక్, ఐరన్, ఫోలేట్, బీ-కాంప్లెక్ విటమిన్లు లభిస్తాయి. ఇవి రక్తపోటును నియంత్రిస్తాయి. పెసలలోని యాంటీ ఆక్సిడెంట్లు, పీచు పదార్థాలు, అమైనో ఆమ్లాలు... గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా అదుపులో ఉంచుతాయి. జీర్ణక్రియను వేగవంతం చేస్తాయి. స్థూలకాయాన్ని నివారిస్తాయి.

తయారీ విధానం

- జీడి పప్పు, బాదం పప్పులను చిన్న పలుకుల్లా కోసి పెట్టుకోవాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టాలి. అందులో పెసలు వేసి చిన్న మంట మీద పది నిమిషాలపాటు దోరగా వేపాలి. పెసలు, కొద్దిగా రంగు మారి మంచి వాసన వస్తున్నప్పుడు స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. తరవాత మిక్సీలో వేసి మరీ మెత్తగా కాకుండా కాస్త బరకగా ఉండేలా గ్రైండ్ చేయాలి. ఈ పొడిని ఒక పళ్లెంలోకి తీసుకోవాలి.
- స్టవ్ మీద గిన్నెపెట్టి మూడు చెంచాల నెయ్యి వేసి కరిగించాలి. అందులో జీడిపప్పు పలుకులు, బాదం పప్పు పలుకులు వేసి దోరగా వేపాలి. తరవాత పెసర పొడి వేసి కలపాలి. చిన్న మంట మీద రెండు నిమిషాలు వేపాలి. తరవాత యాలకుల పొడి వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ పెసర పొడిని ఒక గిన్నెలోకి తీసుకుని చల్లార్చాలి.
- స్టవ్ మీద మరో గిన్నె పెట్టి, బెల్లం ముక్కలు వేసి రెండు చెంచాల నీళ్లు చిలకరించాలి. బెల్లం మొత్తం నీళ్లలో కరిగాక పెసర పొడి ఉన్న గిన్నెలోకి వడబోయాలి. పెసర పొడికి బెల్లం పూర్తిగా పట్టేలా కలపాలి. ఈ మిశ్రమం గోరువెచ్చగా ఉన్నప్పుడే ఒక చెంచా నెయ్యి వేసి బాగా కలపాలి. దీన్ని కొద్ది కొద్దిగా చేత్తో తీసుకుంటూ లడ్డూలు చుట్టాలి. ఈ పెసర లడ్డూలను పిల్లలు ఇష్టంగా తింటారు.

చిట్కాలు

- పెసలను సన్నని సెగమీద నెమ్మదిగా వేయిస్తే లడ్డూలకు కమ్మని రుచి వస్తుంది. పెసలు సరిగా వేగకపోతే లడ్డూలు చేదుగా అనిపిస్తాయి.
- లడ్డూలు చుట్టేముందు కావాలనుకుంటే ఖర్జూరం ముక్కలు, కిస్‌మిస్‌లు, గుమ్మడి గింజలు వేసుకోవచ్చు.
- ఈ లడ్డూలను గాలి చొరబడని డబ్బాలో భద్రపరిస్తే రెండు వారాల పాటు నిల్వ ఉంటాయి.

పెసలలో ఎక్కువగా ప్రోటీన్లు ఉంటాయి. ఇవి కండరాలు, మృదులాస్థి పెరుగుదలకు తోడ్పడతాయి. ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతాయి. మొలకెత్తిన పెసలు తినడం వల్ల రక్తహీనత, మలబద్ధకం, చర్మ వ్యాధులు, కంటిచూపు సమస్యలు తగ్గుతాయి. అకాల వార్ధక్యం దరి చేరదు. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.



పెసల మఖనీ

కావాల్సిన పదార్థాలు

- నానబెట్టిన పెసలు- ఒక కప్పు, దాల్చిన చెక్క- చిన్న ముక్క, లవంగాలు- రెండు, యాలకులు- రెండు, పసుపు- అర చెంచా, ఉప్పు- తగినంత, నెయ్యి- ఆరు చెంచాలు, జీలకర్ర- అర చెంచా, ఇంగువ- పావు చెంచా, ఎండు మిర్చి- రెండు, వెల్లుల్లి రెబ్బలు- అయిదు, ఉల్లిపాయలు- రెండు, టమాటాలు- రెండు, పచ్చిమిర్చి- రెండు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, గరం మసాలా పొడి- అర చెంచా, మిరియాల పొడి- అర చెంచా, కసూరి మేతి- అర చెంచా, కారం- ఒకటిన్నర చెంచాలు, వేడినీళ్లు- ఆరు కప్పులు, కొత్తిమీర- కొద్దిగా


తయారీ విధానం

- పచ్చి మిర్చి, ఉల్లిపాయలు, టమాటాలు, వెల్లుల్లి రెబ్బలు, కొత్తిమీరను సన్నగా తరిగి పెట్టుకోవాలి.
- స్టవ్ మీద కుక్కర్ పెట్టి అందులో నానబెట్టిన పెసలు, అర చెంచా ఉప్పు, పావు చెంచా పసుపు, దాల్చిన చెక్క, యాలకులు, లవంగాలు వేసి నాలుగు కప్పుల వేడి నీళ్లు పోయాలి. కుక్కర్‌కు మూత పెట్టి ఆరు విజిల్స్ వచ్చే దాకా ఉడికించాలి. తరవాత స్టవ్ మీద నుంచి దించాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నాలుగు చెంచాల నెయ్యి వేసి కరిగించాలి. ఇందులో జీలకర్ర, ఇంగువ, ఎండు మిర్చి ముక్కలు, వెల్లుల్లి తరుగు వేసి దోరగా వేపాలి. తరవాత ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి బాగా కలపాలి. వీటిని అయిదు నిమిషాలపాటు వేగనివ్వాలి. తరవాత గరం మసాలా పొడి, మిరియాల పొడి, పావు చెంచా పసుపు, కారం, తగినంత ఉప్పు, టమాటా ముక్కలు వేసి కలపాలి. గిన్నె మీద మూతపెట్టి రెండు నిమిషాలు మగ్గించాలి. నెయ్యి పైకి తేలే వరకు వేగనివ్వాలి. తరవాత ముందుగా ఉడికించి పెట్టుకున్న పెసల మిశ్రమం వేసి రెండు కప్పుల వేడి నీళ్లు పోసి కలపాలి. గిన్నె మీద మూతపెట్టి చిన్న మంట మీద పావుగంటసేపు మగ్గించాలి. మధ్యమధ్యలో గరిటెతో కలుపుతూ ఉండాలి. అవసరమైతే మరో అరకప్పు వేడినీళ్లు కలపవచ్చు. ఈ పప్పు మిశ్రమం మెత్తగా ఉడికిన తరవాత కసూరి మేతిని వేసి బాగా కలపాలి. తరవాత కొత్తిమీర తరుగు వేసి రెండు చెంచాల నెయ్యిని చిలకరించి స్టవ్ మీద నుంచి దించాలి. ఇలా తయారుచేసుకున్న పెసల మఖనీని వేడి అన్నంలో కలుపుకుని తినవచ్చు. పుల్కా, నాన్, చపాతీల్లోకి కూడా బాగుంటుంది.

చిట్కాలు

- నెయ్యికి బదులు నూనె వేసి చేసుకోవచ్చు.
- పెసలను మెత్తగా ఉడికించుకోవాలి. అప్పుడే ఈ వంటకం రుచిగా ఉంటుంది.
- పెసల మఖనీని గరిటె జారుగా ఉండేలా తయారు చేసుకోవాలి. అప్పుడే తినడానికి బాగుంటుంది. ఇది చల్లారేకొద్దీ గట్టిపడుతుంటుంది.

ఒక గిన్నెలో రెండు చెంచాల పెసర పిండి, ఒక చెంచా తేనె, ఒక చెంచా పాలు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పావుగంటసేపు ఆరనివ్వాలి. తరవాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకుంటే ముఖం కాంతివంతంగా మారుతుంది.



భోజనకుతూహలం

'కరివేపాకే కదా' అని తీసి పారేయద్దు..!

చాలామంది భోజనం చేసే సమయంలో కరివేపాకును తీసి పక్కన పెట్టేస్తారు. దీనిని కేవలం సువాసన కోసం వాడతారనే భ్రమలో ఉంటారు. కానీ మన ప్రాచీన గ్రంథాలలో కరివేపాకును విశిష్టమైన ఔషధ గుణాలున్న మొక్కగా గుర్తించారు. దీనికి సంస్కృతంలో- 'సుగంధి కైడర్య పత్రం' అనే పేరు కూడా ఉంది. కరివేపాకులకు ఇటాలియన్, ఇండోనేషియన్, జర్మన్, ఫ్రెంచి పేర్లలో 'కరి' అనే పదం ఉంది. ఇంగ్లీషువారు వీటిని 'కర్రీలీవ్స్' (కూరాకులు) అని పిలిచేవారు. దాని నుంచే కరివేపాకు అనే పదం పుట్టింది. ఈ ఆకులకు ఉన్న ప్రత్యేక గుణాలను మన పురాతన గ్రంథాల్లో వివరించారు.

- ఈ ఆకులకు విషాన్ని హరించే శక్తి ఉంది. వీటిని పచ్చిగా కానీ, ఎండబెట్టి కానీ వాడవచ్చు.
- కరివేపాకులో ఫైబర్ చాలా ఎక్కువగా ఉంటుంది. విటమిన్ ఏ, కాల్షియం, ఐరన్, ప్రోటీన్లు ఉన్నాయి. ఈ కోణం నుంచి చూస్తే- ఇది పోషకాల విషయంలో ఇతర ఆకుకూరలతో పోటీ పడి గెలుస్తుంది.
- క్రమం తప్పకుండా కరివేపాకును తింటే చర్మం నిగనిగలాడుతుంది.



- కంటి సమస్యలకు కరివేపాకు పరిష్కారంగా పనిచేస్తుంది.
- మన శరీరంలోని కఫ పైత్యాలను తగ్గిస్తుంది.
- కడుపులోని నులిపురుగులను కరివేపాకు చంపేస్తుంది.

ఎలా వాడాలి?

- కరివేపాకుల్ని కడిగి శుభ్రం చేయాలి. వీటిని మిక్సీలో వేసి రసం తీయాలి. ఈ రసంతో చారు కాచి తింటే నీళ్ళ విరేచనాలు, రక్త విరేచనాలు వెంటనే తగ్గుతాయి.
- కరివేపాకు రసాన్ని ఒక పొంగు వచ్చేలా కాచి నిమ్మరసం కలుపుకొని తాగితే తల తిరుగుడు, పైత్యం, నోట్లో నీళ్ల ఊరటం, వికారం, త్రేన్పులు, గ్యాసు తగ్గుతాయి.
- ఒక గ్లాసు పెరుగులో మూడు గ్లాసుల నీళ్లను కలిపి ఒక రాత్రి బయట ఉంచాలి. ఉదయాన్నే అందులో రెండు చెంచాల కరివేపాకు ముద్దను, పావు చెంచా మిరియాల పొడిని కలిపాలి. ఈ ద్రవం జీర్ణకోశ సమస్యలకు మంచి ఔషధంగా పనిచేస్తుంది. మధుమేహ వ్యాధి గ్రస్తులకు ఇది మంచి ఔషధం.
- కరివేపాకులను బాగా కడిగి నీడలో ఆరబెట్టాలి. వాటికి ధనియాలు, మినపప్పు, శనగపప్పు, జీలకర్ర, మిరియాలు, మిరపకాయలు, చింతపండు తగు పాళ్లలో కలిపి మూకుడులో వేయించాలి. ఈ మిశ్రమాన్ని మిక్సీలో వేసి పొడి చేయాలి. ఈ ఆకులతోపాటు మునగాకులు కూడా కలిపితే మంచిది.

• గంగరాజు అరుణాదేవి

సంకల్పం



కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేసి... వైద్య రంగం వైపు అడుగులు వేశారు. కుటుంబంలో ఇద్దరిని బలి తీసుకున్న బ్రెస్ట్ కేన్సర్‌పై పోరాటం మొదలుపెట్టి... పారిశ్రామికవేత్తగా ఎదిగారు. ఆరంభ దశలోనే ఈ మహమ్మారిని మరింత సమర్థవంతంగా గుర్తించే ఏఐ ఆధారిత పరికరాన్ని తీసుకువచ్చి... వినూత్న మార్పునకు నాంది పలికారు. ఇటీవల 'ఫోర్బ్స్ మ్యాగజైన్' ప్రకటించిన '30 ఇండియన్ ఏఐ మైండ్స్' జాబితాలో చోటు దక్కించుకున్న 'నిరామై హెల్త్ అనలిటిక్స్' అధిపతి... గీతా మంజునాథ్ జర్నీ ఇది.

మార్పునకు నాంది

"నేను వైద్య రంగం వైపు రావడానికి బలమైన కారణం ఉంది. మా సోదరి ఒకావిడ తన నలభయ్యో ఏట బ్రెస్ట్ కేన్సర్‌తో మరణించింది. చిన్నప్పుడు తను, నేను కలిసి వేసవి సెలవులు గడిపేవాళ్లం. నా సన్నిహితుల్లో కేన్సర్‌తో చనిపోయిన మొదటి వ్యక్తి తను. అది నన్ను ఎంతో బాధించింది. ఆరు నెలలు తిరక్కుండానే మరో విషాదం. మావారి కజిన్ కూడా ఇదే మహమ్మారికి బలైంది. తను నాకంటే చిన్నది. వీరిద్దరికీ చిన్న పిల్లలు. ఈ ఘటనల నుంచి కోలుకోవడానికి నాకు చాలా సమయమే పట్టింది. తీవ్రమైన ఆలోచనల్లోకి నెట్టింది. దాంతో బ్రెస్ట్ కేన్సర్ గురించి అధ్యయనం మొదలుపెట్టాను. ఏ చిన్న పుస్తకం వదలకుండా కంట పడినవన్నీ చదివాను. ఆ క్రమంలోనే కేన్సర్‌ను గుర్తించడానికి ఉపయోగించే పలు పద్ధతులపై అవగాహన కలిగింది. థర్మల్ ఇమేజింగ్ అనేది ఒకటి ఉందని తెలిసింది. దీనిపై మరిన్ని పరిశోధనలు చేసి, 2016లో 'నిరామై హెల్త్ ఎనలిటిక్స్' ప్రారంభించాను. దీని ద్వారా ఆరంభ దశలోనే బ్రెస్ట్ కేన్సర్‌ను గుర్తించే 'థర్మలిటిక్స్' అనే థర్మల్ ఇమేజింగ్ పరికరాన్ని రూపొందించాం. ఇది సంప్రదాయ మామోగ్రఫీ కంటే సమర్థవంతంగా, రేడియేషన్ అవసరం లేకుండా పని చేస్తుంది... ముఖ్యంగా యువతులకు.

ఉన్నత హోదాలు...

1989లో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ అవ్వగానే 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్' (ఐఐఎస్‌సీ)లో మాస్టర్స్ చదివాను. తరువాత హెచ్‌పీ, జెరాక్స్ రీసెర్చ్ సెంటర్ తదితర ప్రముఖ కంపెనీల్లో ఉన్నత హోదాలు అలంకరించాను. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే పీహెచ్‌డీ కూడా పూర్తి చేశాను. కంపెనీ పెట్టకముందు ఐఐఎంబీ ఇన్నోవేషన్స్‌లో డైరెక్టర్‌గా ఉన్నాను. ఈ క్రమంలో కంప్యూటర్ శాస్త్రవేత్తగా పలు పరిశోధనల్లో భాగస్వామినయ్యాను. మా కంపెనీ స్థాపనలో ఇది నాకు కలిసివచ్చింది.

సేవా దృక్పథం...

నాకు చిన్నప్పుడే సేవా దృక్పథం అలవడింది. వేసవి సెలవుల్లో ఎక్కువ భాగం అనాథ శరణాలయాల్లో గడిపేదాన్ని. ముఖ్యంగా వైద్య రంగంలో సేవలు అందిస్తే... కొందరి ప్రాణం కాపాడగలిగామనే భావన కలుగుతుంది. ఎవరైనా బాధపడుతుంటే... వారి బాధను ఎలా దూరం చేయగలనో ఆలోచిస్తుంటాను. మా కంపెనీ నుంచి వచ్చిన 'థర్మలిటిక్స్' ఆరోగ్య రక్షణ రంగంలో మెరుగైన ఫలితాలు రాబడుతోంది. దీన్ని ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. అలాగే ఇతర వ్యాధుల నిర్ధారణకు కూడా ప్రస్తుతం ఉన్నవాటికంటే మరింత మెరుగైన పరికరాలు రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

అవార్డులు... అభినందనలు...

నా ఈ ప్రయాణంలో ఎన్నో పురస్కారాలు, అభినందనలు లభించాయి. సీఎస్ఐ గోల్డ్ మెడల్, బిరాక్ విన్నర్ అవార్డుతో పాటు బయోస్పెక్ట్రమ్ ఇండియా నుంచి ఉత్తమ మహిళా పారిశ్రామికవేత్తగా పురస్కారం అందుకున్నాను. 2020 ఫోర్బ్స్ టాప్ 20 స్వయంశక్తితో ఎదిగిన మహిళల జాబితాలో, అలాగే ఈ ఏడాది ఫోర్బ్స్ ప్రకటించిన '30 ఇండియన్ ఏఐ మైండ్స్'లో నాకు చోటు దక్కింది. ఇవన్నీ చూసినప్పుడు నాకు ఎంతో సంతోషంగా కలుగుతుంది. ఎందుకంటే ఒక మహాసంకల్పంతో నేను మొదలుపెట్టిన ప్రాజెక్ట్ విజయవంతమైంది. నా సోదరిలాంటి ఎంతోమంది యువతుల ప్రాణాలు కాపాడటంలో అది ఉపయోగపడుతోంది. ఇదే నేను కోరుకున్నది."

ప్రేరణ

ఆటపాటలతో ఆనందంగా గడుస్తున్న బాల్యం. అంతలో అనుకోని ప్రమాదం. దాంతో చిన్నప్పటి నుంచే వీల్‌ఛైర్‌కు పరిమితమవ్వాల్సి వచ్చింది. కానీ 'ఇక జీవితం ఇంతే' అని ఆమె ఆగిపోలేదు. శారీరక వైకల్యాన్ని అధిగమించి పారిశ్రామికవేత్తగా ఎదిగారు. 'ఫార్చ్యూన్ ఇండియా' మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ - 2025 జాబితాలో చోటు కూడా దక్కించుకున్నారు. ఆమే 'జిందాల్ సా లిమిటెడ్' ఎండీ, స్మినూ జిందాల్.. ఆమె ప్రయాణం గురించి తెలుసుకుందాం...

చక్రాల కుర్చీతో అందలానికి!

స్మినూ.. హరియాణాలోని హిసార్‌లో ఓ వ్యాపార కుటుంబంలో పుట్టారు. ఆనందంగా సాగుతున్న ఆమె జీవితం పదకొండేళ్ల వయసులో ఊహించని మలుపు తిరిగింది. జైపూర్ నుంచి ఢిల్లీ వెళ్తుండగా కారు ప్రమాదానికి గురయ్యారు. అదృష్టం బాగుండి ఆమె ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. కానీ ప్రమాదంలో వెన్నుపూసకు బలమైన గాయం కావడంతో నడుము కింద భాగం చచ్చుబడింది. తనకు ఎంతో ఇష్టమైన డ్యాన్స్ ఇంక చేయలేనని ఎంతో బాధపడ్డారామె. ఆ సమయంలో తల్లితండ్రులు ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. వైకల్యంతో అసాధ్యాలను సుసాధ్యం చేసిన వాళ్లెంతో మంది ఉన్నారని ఆమెకు ధైర్యం నూరిపోశారు. ఒక సందర్భంలో తన తల్లితండ్రులు అందించిన బాసట గురించి స్మినూ గుర్తు చేసుకుంటూ... "అమ్మానాన్న నన్ను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. అలాగని నన్నెప్పుడూ అతి గారాబం చేయలేదు" అంటూ చెప్పుకొచ్చారు.

ఉద్యోగం కోసం పోరాటం...

స్మినూ నడవలేదని తల్లిదండ్రులు ఆమెను ప్రత్యేక పాఠశాలకు పంపలేదు. సాధారణ బడికే పంపించారు. అలా కష్టపడి చదివి ఎంబీఏ పూర్తి చేశారామె. తరువాత వ్యాపార రంగంలోకి రావాలనుకున్నారు. కానీ ఆమె తండ్రి పీఆర్ జిందాల్, అందుకు ఒప్పుకోలేదు. మొదటి నుంచి స్మినూ కుటుంబంలో ఆడవారు వ్యాపారాలు చేయలేదు. చివరకు ఎంతో కష్టపడి తన తండ్రిని ఒప్పించి, తండ్రి కంపెనీ 'జిందాల్ సా లిమిటెడ్'లోనే ట్రైనీగా చేరారామె. తరువాత అంచలంచెలుగా మేనేజింగ్ డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. ఈ క్రమంలో ఆమె ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. పురుషాధిక్యతతో కూడిన ఇనుము, ఉక్కు పైప్‌లైన్ల తయారీ రంగంలో స్మినూను ఎవరూ స్వాగతించలేకపోయారు. సహనంతో వారిలో మార్పు కోసం ఎదురుచూసి విజయం సాధించారామె. కంపెనీని అమెరికా, యూరప్, అరబ్ ఎమిరేట్స్ మొదలైన దేశాలకు విస్తరింపచేశారు. కంపెనీ టర్నోవర్‌ను వేల కోట్ల రూపాయలకు పెంచారు. ఆ విధంగా 'ఫార్చ్యూన్ ఇండియా మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్-2025' జాబితాలో చోటు కూడా దక్కించుకునే స్థాయికి ఎదిగారామె.

> **పరిస్థితులే స్ఫూర్తినింపాయి**
>
> జీవితంలో ఎదురైన ఎన్నో పరిస్థితులు పలు విధాలుగా నాకు స్ఫూర్తినిచ్చాయి. ఎవరైనా 'ఇది నీ వల్ల కాదు' అంటే దాన్ని సవాలుగా తీసుకుని చేసి చూపించేదాన్ని. వైఫల్యాలే విజయానికి మార్గం. ఓడిపోతే అక్కడే ఆగిపోకుండా, కష్టపడి పైకి లేచి పూనుకుంటే విజయం సొంతమవుతుంది. మనసు పెట్టి చేస్తే సాధించలేనిది ఏదీ లేదు. వ్యాపారంలో పని ఒత్తిడి ఎక్కువగానే ఉంటుంది. కానీ పనిని కష్టపడి కాకుండా ఇష్టపడి చేయగలిగితే విజయం సొంతమవుతుంది.
>
> - స్మినూ జిందాల్



'స్వయం' సేవ...

చిన్న వయసు నుంచే చక్రాల కుర్చీకి పరిమితమైన స్మినూ.. తనలాంటి వారికోసం ఏదైనా చేయాలనుకున్నారు. అందుకే 'స్వయం' పేరిట ఓ లాభాపేక్ష లేని సంస్థను స్థాపించారు. దీని ద్వారా దివ్యాంగులకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారు. వీల్‌ఛైర్‌లు అందిస్తున్నారు. అలాగే 'స్వయం' ద్వారా అనేక మంది దివ్యాంగులకు ప్రభుత్వ పథకాలను చేరువ చేస్తున్నారు. వృద్ధులు, గర్భిణులకు కూడా ప్రాథమిక అవసరాల్లో సహాయపడుతూ ప్రభుత్వ పథకాల గురించి ఈ సంస్థ అవగాహన కల్పిస్తోంది. 'స్వయం' ద్వారా చేస్తున్న సేవలకు గాను స్మినూ.. లారియల్ పారిస్ ఫెమినా 'ఫేవరెట్ ఫేస్ ఆఫ్ కాజ్' అవార్డు కూడా ఆమె అందుకున్నారు.

ప్రేమ పెళ్లి..

స్మినూకు ఇంట్లో వాళ్లు వ్యాపార కుటుంబంలోని అబ్బాయితో పెళ్లి చేయాలనుకున్నారు. కానీ ఆమె వ్యాపార నేపథ్యం లేని ఇంద్రదేశ్ బాత్రా అనే వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి ఇద్దరు అబ్బాయిలు. వ్యాపారాన్ని వృద్ధి చేయడంతో పాటు కుటుంబ బాధ్యతలను సమర్థంగా నెరవేరుస్తాననీ, అర్థం చేసుకునే కుటుంబం దొరకడం తన అదృష్టమనీ స్మినూ అంటున్నారు.

మేకప్

మెరుపుతీగలా మెరిసిపోవాలంటే...

పెళ్లిళ్లు, పుట్టిన రోజు వేడుకలు సాయంకాలాల్లోనే ఏర్పాటవుతూ ఉంటాయి. ఆ వేడుకల్లో మిరుమిట్లు గొలిపే లైట్ల వెలుగుల్లో ఆకట్టుకునేలా కనిపించడం కోసం ప్రత్యేకమైన మేకప్ ఎంచుకోవాలి. అదెలాగంటే...

- **చర్మాన్ని సిద్ధం చేసి:** చర్మపు పిహెచ్ వాల్యూకు తగిన సబ్బు లేదా ఫేస్ వాష్‌తో ముఖం శుభ్రపరుచుకోవాలి. సున్నితమైన స్క్రబ్‌తో పెదవుల మీద మృత చర్మాన్ని వదిలించి, లిప్ మాస్క్ వేసుకోవాలి. తర్వాత ముఖ చర్మం తేమ కోల్పోకుండా ఉండడం కోసం హైడ్రేటింగ్ సీరమ్ లేదా మన్నికైన మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవాలి. ఇలా చర్మాన్ని శుభ్రపరిచి, మేకప్ మొదలుపెడితే, మేకప్ చర్మం మీద సమంగా పరుచుకుంటుంది. రెట్టింపు ఆకర్షణను తెచ్చిపెడుతుంది.
- **చర్మానికి తగిన ప్రైమర్:** జిడ్డు చర్మమైతే మాటిఫైయింగ్ లేదా సిలికాన్ ఫ్రీ ప్రైమర్ ఎంచుకోవాలి. పొడి చర్మమైతే, హైడ్రేటింగ్, ల్యూమినస్ బ్రైటెనింగ్, గ్లోయింగ్ అనే లేబుల్ ఉన్న ప్రైమర్ ఎంచుకోవాలి. అలాగే దాన్లో విటమిన్ సి ఉండేలా చూసుకోవాలి.
- **ఫౌండేషన్:** దీర్ఘకాలం పాటు చెక్కుచెదరని ఫౌండేషన్ ఎంచుకోవాలి. అందుకోసం 12 నుంచి 16 గంటల పాటు చెదిరే వీలులేని ఫౌండేషన్ వాడుకోవాలి. లాంగ్ వేర్, ట్రాన్స్‌ఫర్, స్వెట్ రెసిస్టెంట్ ఫార్ములాతో కూడిన ఫౌండేషన్‌లు చక్కగా ఉపయోగపడతాయి.
- **మచ్చలను దాచేలా:** మచ్చలను కప్పేయడం కోసం ఫౌండేషన్ లేదా కన్సీలర్లు బాగా ఉపయోగపడతాయి. కళ్ల దిగువన ఉండే నల్లని వలయాలను కనిపించకుండా చేయడం కోసం నారింజ రంగు కలర్ కరెక్టర్ వాడుకోవాలి. తెల్లని చర్మం కలిగినవారు పీచ్ రంగులోని కలర్ కరెక్టర్ ఎంచుకోవాలి. కరెక్షన్ కోసం మొదట అవసరమైన ప్రదేశంలో కలర్ కరెక్టర్ అప్లై చేసి, వేళ్లతో లేదా బ్రష్‌తో అద్దుకోవాలి.



ఒంటిచేత్తో 20 అడుగుల జైలు గోడ దూకి..

కేరళలో జీవిత ఖైదీ పరార్.. గంటల్లోనే పట్టుకున్న పోలీసులు



గోవింద స్వామి

న్యూఢిల్లీ, జూలై 25: కదులుతున్న రైలులో ఒంటరిగా ఉన్న యువతిపై హత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న గోవింద స్వామి(41) కేరళలోని కన్నూర్ కేంద్ర కారాగారం నుంచి శుక్రవారం పరారయ్యాడు. గతంలో ఓ చెయ్యి కోల్పోయి దివ్యాంగుడైన గోవిందస్వామి తన ఒంటి చేత్తో 20 అడుగుల ఎత్తైన జైలు ప్రహరీ గోడను దాటి తప్పించుకున్నాడు. జైలులో తానున్న బ్యారక్ కటకటాల్లోని కొన్ని ఊచల్లోని కొంత భాగాన్ని రంపపు బ్లేడుతో కత్తించి ఆ సందులో నుంచి గోవింద స్వామి బయటికొచ్చాడు. తర్వాత దుస్తులను ఒక దానికి మరొకటి కట్టి ముందే సిద్ధం చేసుకున్న తాడుతో 20 అడుగల ఎత్తైన ప్రహరీ గోడను ఒంటి చేత్తో దాటేశాడు. ఆపై, జైలు దుస్తులు విడిచి వెంట తెచ్చుకున్న వేరే దుస్తులను వేసుకుని పరారయ్యాడు. అయితే, గోవిందస్వామి ఓ పాడుబడిన ఇంట్లో ఉన్నట్టు పోలీసులు సీసీ కెమెరాలు, జాగిలాల సాయంతో గుర్తించారు. అతడు అక్కడున్న బావిలో దూకి దాక్కోగా.. బయటకు తీసి అదుపులోకి తీసుకున్నారు.

మూడు నెలలుగా పళ్లరసమే ఆహారం

- యూట్యూబ్‌లో చూసి పాటించిన ఓ బాలుడి మృతి

చెన్నై, జూలై 25: యూట్యూబ్‌లో ఓ వీడియోను చూసి మూడునెలలుగా కేవలం పళ్ల రసాన్ని మాత్రమే తాగుతున్న ఓ 17 ఏళ్ల బాలుడు చివరకు ప్రాణం కోల్పోయాడు. తమిళనాడులోని కన్యాకుమారి జిల్లా కొలాచెల్‌కు చెందిన శక్తీశ్వరన్ గురువారం తమ ఇంట్లోనే ఊపిరాడక కుప్పకూలిపోయి మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. తమ బాబు చాలా ఆరోగ్యంగా, చురుగ్గాఉండేవాడని, అయితే యూట్యూబ్‌లో ఓ వీడియోను చూసి పళ్ల రసాన్ని మాత్రమే తీసుకుంటున్నాడని వారు చెప్పారు. తన ఆహార అలవాటును మార్చుకునే ముందు వైద్య లేదా పోషకాహార నిపుణుడిని సంప్రదించలేదని తెలిపారు. గురువారం తమ ఇంట్లో పూజ నిర్వహించగా.. బాబు ఆహారం తిన్నాడు. ఆ తర్వాత వాంతి చేసుకున్నాడు. అనంతరం ఊపిరాడటం లేదంటూనే కుప్పకూలిపోయాడు. కాగా ఆ బాబు మరణానికి గల కారణాలను తెలుసుకునేందుకు వైద్యులు శవపరీక్ష నివేదికను పరిశీలిస్తున్నారు.

నదిలో కుమారుడి గల్లంతు.. చెరువులో దూకి తల్లి ఆత్మహత్య

బెంగళూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): భద్ర నదిలో జీపు బోల్తాపడి గణపతికట్టి శమంత్(22) అనే యువకుడు గల్లంతయ్యాడు. స్థానికులు, పోలీసులు గాలించినా ఆచూకీ లభించకపోవడంతో తీవ్ర ఆవేదనకు లోనైన అతని తల్లి రవికళ(48), గ్రామ సమీపంలోని చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషాద సంఘటన చిక్కమగళూరు జిల్లాలో చోటు చేసుకుంది. కళస గ్రామానికి చెందిన రవికళ, సమీపంలోని కాఫీ తోటలకు కూలీలను సమకూర్చే మేస్త్రీగా పనిచేసేవారు. కుమారుడికి ఉపాధి కల్పించేందుకు 6నెలలక్రితం జీపును కొనుగోలు చేసిచ్చారు. ఈ క్రమంలో గురువారం కళస-కళకూడ మార్గంలో కోళమగ వద్ద రోడ్డుపక్కనే ప్రవహిస్తున్న భద్ర నదిలో జీపు బోల్తా పడింది. ప్రమాదం గురించి తెలియగానే నది వద్దకు చేరుకున్న తల్లి రవికళ, రాత్రిదాకా అక్కడే కొడుకు కోసం పడిగాపులు కాశారు. చీకటి పడటం, వర్షం కురుస్తుండటంతో అధికారులు గాలింపు చర్యలను ఆపేశారు. తిరిగి శుక్రవారం గాలించాలని అధికారులు నిర్ణయించారు. దీంతో తల్లి రవికళ రాత్రి ఇంటికి వెళ్లారు. ఆ తరువాత గ్రామ సమీపంలో ఉన్న చెరువు వద్దకు వెళ్లి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ముదురుతున్న టెంపుల్ వార్!

థాయిలాండ్, కాంబోడియా మధ్య మరింత పెరిగిన దాడులు

- 20కి చేరిన మృతులు
- ఇరువైపులా లక్షన్నర మంది సురక్షిత ప్రాంతాలకు..
- థాయ్‌లాండ్ సరిహద్దుల్లోని 8 రాష్ట్రాల్లో అత్యవసర పరిస్థితి



యుద్ధ వాహనంలో శతఘ్నులను నింపుతున్న కాంబోడియా సైనికులు

బ్యాంకాక్, జూలై 25: పురాతన శైవ ఆలయాలున్న ప్రాంతం కోసం థాయ్‌లాండ్, కాంబోడియా మధ్య మొదలైన యుద్ధం ముదురుతోంది. మొదట వివాదాస్పద ప్రాంతాల్లోనే పరస్పరం దాడులు చేసుకున్న ఇరుదేశాల సైన్యాలు.. శుక్రవారం 817 కిలోమీటర్ల మేర ఉన్న సరిహద్దుల వెంట ఇతర ప్రాంతాల్లో శతఘ్నులు, హెవీ మెషీన్ గన్‌లతో భారీగా కాల్పులకు దిగాయి. కాంబోడియా స్వల్పశ్రేణి రాకెట్లు ప్రయోగిస్తుండగా, థాయ్‌లాండ్ డ్రోన్లతో బాంబులు వేస్తోంది. దీనితో సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఇరువైపులా లక్షన్నర మందికిపైగా సరిహద్దుల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలినట్టు అంచనా. కాంబోడియా సరిహద్దుల్లోని తమ ఎనిమిది రాష్ట్రాల్లో థాయ్‌లాండ్ అత్యవసర పరిస్థితి ప్రకటించింది. సరిహద్దుల్లోని ఆరు జాతీయ పార్కులను మూసివేసి, సిబ్బందిని అక్కడి నుంచి తరలించింది. శుక్రవారం నాటికి థాయ్‌లాండ్‌లో మృతుల సంఖ్య 20కి పెరిగింది. మరో 65 మంది తీవ్రంగా గాయపడ్డారు. కాంబోడియాలో ఒకరు మరణించినట్టు, పదుల సంఖ్యలో గాయపడినట్టు ఆ దేశ మీడియా తెలిపింది. యుద్ధం నేపథ్యంలో థాయ్‌లాండ్, కాంబోడియాలకు వెళ్లే తమ దేశ ప్రయాణికులకు భారత్, యూఎస్ఏ, జపాన్ హెచ్చరికలు జారీ చేశాయి.

భద్రతా మండలి అత్యవసర సమావేశం

ఆసియాన్‌కు నేతృత్వం వహిస్తున్న మలేషియా ప్రతిపాదన మేరకు కాల్పుల విరమణకు తాము సిద్ధమైనా.. థాయ్‌లాండ్ వినడం లేదని, ఈ అంశంలో ప్రపంచ దేశాలు జోక్యం చేసుకోవాలని కాంబోడియా ప్రధాని హున్ మానెట్ విజ్ఞప్తి చేశారు. దీనితో ఈ యుద్ధం అంశంపై అత్యవసర సమావేశం నిర్వహించేందుకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సిద్ధమైంది. ఇక థాయ్‌లాండ్‌తో వివాదం నెలకొన్న నాలుగు ప్రాంతాలకు సంబంధించి అంతర్జాతీయ కోర్టు (ఐసీజే)లో కాంబోడియా తాజాగా మళ్లీ ఫిర్యాదు చేసింది. ఇంతకు ముందు ఐసీజే తీర్పులను థాయ్‌లాండ్ తోసిపుచ్చిన నేపథ్యంలో కాంబోడియా తాజా ఫిర్యాదు.. ఉద్రిక్తతలను మరింత పెంచుతుందనే అభిప్రాయం నెలకొంది. మరోవైపు తమ వివాదంలో మూడో దేశం మధ్యవర్తిత్వాన్ని ఒప్పుకోబోమని థాయ్‌లాండ్ ప్రకటించింది.

రక్షణ సామర్థ్యంలో ఎంతో తేడా!

పరస్పరం యుద్ధానికి కాలు దువ్వుతున్న థాయ్‌లాండ్, కాంబోడియాల మధ్య రక్షణ సామర్థ్యంలో తేడా అంతా ఇంతా కాదు. రక్షణ వ్యయం, యుద్ధ విమానాలు, సైన్యం సంఖ్య.. ఇలా ఎలా చూసినా కాంబోడియా కంటే థాయ్‌లాండ్ సామర్థ్యం చాలా ఎక్కువ. అంతర్జాతీయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్ట్రాటజిక్ స్టడీస్ నివేదిక ప్రకారం.. గత ఏడాది థాయ్ రక్షణ బడ్జెట్ సుమారు రూ.49.3 వేల కోట్లు. 3.6 లక్షల మంది సైనికులు ఉన్నారు. 400 యుద్ధ ట్యాంకులు, 2,600 శతఘ్నులు, అమెరికా తయారీ 28 ఎఫ్-16లు సహా 112 యుద్ధ విమానాలు, యుద్ధ హెలికాప్టర్లు, దాడులు చేయగల డ్రోన్లు, ఒక ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, మరో 7యుద్ధ నౌకలు థాయ్ అమ్ములపొదిలో ఉన్నాయి. మరోవైపు కాంబోడియా రక్షణ బడ్జెట్ రూ.11.2 వేల కోట్లు మాత్రమే. సైనికుల సంఖ్య 1.24 లక్షలు. 200 యుద్ధ ట్యాంకులు, 480 శతఘ్నులు, 16 యుద్ధ హెలికాప్టర్లు ఉన్నాయి. ఒక్క యుద్ధ విమానం కూడా లేదు.

ఆహార ధరలపై వాతావరణ మార్పుల ప్రభావం

న్యూఢిల్లీ, జూలై 25: అసాధారణమైన తీవ్రమైన వేడిగాలులు వంటి వాతావరణ మార్పుల కారణంగా భారత్‌లో గత ఏడాది ఆహారం ధరలు భారీగా పెరిగాయని తాజా అధ్యయనం పేర్కొంది. 2024 రెండో త్రైమాసికంలో ఉల్లిపాయలు, బంగాళదుంపల ధరలు 80 శాతానికి పైగా పెరిగాయని తెలిపింది. బార్సిలోనా సూపర్ కంప్యూటింగ్ సెంటర్‌కు చెందిన మాక్సిమిలియన్ కోట్జ్ నేతృత్వంలో 2022-2024 మధ్య 18 దేశాల్లో అధ్యయనం నిర్వహించారు. ప్రతికూల వాతావరణం వలన విపరీతంగా పెరిగిన 16 రకాల ఆహారపు ధరలను పరిశోధకులు విశ్లేషించారు. చాలా వరకు సందర్భాల్లో 2020 కంటే ముందు నాటి ధరలను దాటేశాయని, గ్లోబల్ వార్మింగ్ బలంగా ప్రభావం చూపినట్లు అధ్యయనంలో వెల్లడైంది. 'మే నెలలో వీచే వేడిగాలుల తర్వాత భారత్‌లో 2024 రెండో త్రైమాసికంలో ఉల్లి, బంగాళదుంపల ధరల 80 శాతానికి పైగా పెరిగాయి' అని పరిశోధకులు పేర్కొన్నారు. 2024 అత్యంత వేడి సంవత్సరంగా నమోదైంది. భారత్‌లో మే నెలలో తీవ్రమైన వేడి.. పంట దిగుబడి, సరఫరా చైన్లపై ప్రభావం చూపింది. ఆహార ధరల పెరుగుదల కారణంగా పోషకాహార లోపం, దీర్ఘకాలిక వ్యాధులు వంటి ఆరోగ్య ప్రతికూలతలతో పాటు ఆర్థిక అసమానతలు పెరిగే అవకాశం ఉందని అధ్యయనం హెచ్చరించింది. కోట్జ్ మాట్లాడుతూ ఆహార ధరల పెరుగుదల కారణంగా ఆహార భద్రతపై, ప్రధానంగా అల్పాదాయ కుటుంబాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందన్నారు. 'ధరలు పెరిగినప్పుడు, పేద కుటుంబాలు తక్కువ పోషకాలు కలిగిన, చౌకైన ఆహార పదార్థాలను ఆశ్రయించాల్సి వస్తుంది. ఇలాంటి ఆహారాలు కేన్సర్, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు వంటి అనేక ఆరోగ్య పరిస్థితులతో ముడిపడి ఉంటాయి' అని పేర్కొన్నారు.

25 అశ్లీల ఓటీటీ యాప్‌లపై నిషేధం

- జాబితాలో ఉల్లూ, దేశీఫ్లిక్స్, ఏఎల్‌టీటీ...

న్యూఢిల్లీ, జూలై 25: ఓటీటీల్లో విచ్చలవిడిగా ప్రసారమవుతున్న అసభ్యకర, అశ్లీల కంటెంట్‌కు చెక్ పెట్టే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రముఖ ఓటీటీలు ఉల్లూ, ఏఎల్‌టీటీ, దేశీఫ్లిక్స్ సహా 25 యాప్‌లపై నిషేధం విధించింది. వీటి ప్రసారాలు తక్షణం నిలిపివేయాలంటూ ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ల (ఐఎస్‌పీ)ను ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార శాఖ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. అశ్లీల కంటెంట్ ప్రసారాలను అడ్డుకొనేందుకే ఈ చర్యలు తీసుకున్నామని స్పష్టం చేసింది. నిషేధించిన యాప్‌ల జాబితాలో.... ఏఎల్‌టీబాలాజీ (ఏఎల్‌టీటీ), ఉల్లూ, బిగ్ షాట్స్ యాప్, దేశీఫ్లిక్స్, బూమెక్స్, నియాన్‌ఎక్స్ వీఐపీ, నవరస లైట్, గులాబ్ యాప్, కంగన్ యాప్, బుల్ యాప్, షోహిట్, జల్వా యాప్, వావ్ ఎంటర్‌టైన్‌మెంట్, లుక్ ఎంటర్‌టైన్‌మెంట్, హిట్‌ప్రైమ్, ఫ్యూగీ, ఫీనియో, షోఎక్స్, సోల్ టాకీస్, అడ్డా టీవీ, హాట్‌ఎక్స్ వీఐపీ, హల్‌చల్ యాప్, మూడ్‌ఎక్స్, మోజ్‌ఫ్లిక్స్, ట్రైఫ్లిక్స్ ఉన్నాయి.

ఆకలి చావుల అంచున గాజా



గాజాలోని ఓ శరణార్థి శిబిరంలో ఎముకల గూడులా మారిన చిన్నారి

(మొదటి పేజీ తరువాయి)

తేలిన చిన్నారుల పరిస్థితి హృదయ విదారకంగా తయారైంది. చిన్నారులు కనీసం నడవలేకపోతున్నారు. ఏడిచే ఓపిక కూడా లేని స్థితి. ఆకలి బాధలు తట్టుకోలేక చిన్న పిల్లలు పిట్టల్లా రాలిపోతున్నారు. మొత్తం 113 మంది ప్రాణాలు కోల్పోగా ఇందులో 81మంది చిన్నారులున్నారు. సుమారు లక్షమంది మహిళలు, చిన్నారులు పోషకాహారలోపంతో బాధపడుతున్నారని ఐక్యరాజ్యసమితి తెలిపింది. మరోవైపు ఆసుపత్రుల్లో అవసరమైన ఔషధాలు లేక డాక్టర్లు కూడా చేతులెత్తేస్తున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే పెద్ద సంఖ్యలో మరణాలు సంభవిస్తాయని, తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని 100కు పైగా సహాయ సంస్థలు హెచ్చరించాయి.

ఆరు వేల వాహనాలు సిద్ధం

నిజానికి గాజాలో మానవతా సాయం అందించాలంటే రోజుకు 600 ట్రక్కులు అవసరమవుతాయి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇజ్రాయెల్ ఆంక్షల కారణంగా రోజుకు 69 ట్రక్కులను మాత్రమే అనుమతిస్తున్నారు. ఈ తరుణంలో గాజాలో ప్రజలకు ఆహారం, తాగునీరు, ఔషధాలు అందించేందుకు 6 వేల వాహనాలు సిద్ధంగా ఉన్నాయని ఐక్యరాజ్యసమితి తెలిపింది. ఇజ్రాయెల్ అనుమతిస్తే ఈ వాహనాలన్నీ ఈజిప్ట్, జోర్డాన్ నుంచి గాజాలోకి వస్తాయని వెల్లడించింది. మానవతా సాయం అందించేందుకు ఇజ్రాయెల్ తక్షణమే అంగీకరించాలని సూచించింది.

శాంతి చర్చల నిలిపివేత!

ఇజ్రాయెల్-హమాస్ మధ్య ఈజిప్ట్, ఖతర్ మధ్యవర్తిత్వంలో జరుగుతున్న శాంతి చర్చలు నిలిపివేయాలని అమెరికా నిర్ణయించుకున్నట్లు సమాచారం. హమాస్ తీరుపై అసంతృప్తిగా ఉన్న అగ్రరాజ్యం తమ శాంతి చర్చల బృందాన్ని పశ్చిమాసియా నుంచి వెనక్కి రావాలని పురమాయించినట్లు తెలిసింది. ఇజ్రాయెల్ కూడా తమ శాంతి చర్చల బృందాన్ని తిరిగి వచ్చేయాలని సూచించింది. మరోవైపు పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మ్యాక్రాన్ ప్రకటించారు. సెప్టెంబరులో జరిగే ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో దీనిపై నిర్ణయాన్ని ప్రకటిస్తామంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. గాజాలో తక్షణమే మానవతా సాయం అందాలని ఆయన సూచించారు.


చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

పాటతో ముగించారు



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రం షూటింగ్ పూర్తయింది. సోషియో ఫాంటసీ విజువల్ వండర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి వశిష్ఠ దర్శకుడు. విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మాతలు. ఇప్పటికే ఒక పాట మినహా ఈ చిత్రం పూర్తయింది. చిరంజీవి, మౌని రాయ్‌పై చిత్రీకరించిన అద్భుతమైన డ్యాన్స్ నంబర్‌తో షూటింగ్‌కు గుమ్మడికాయ కొట్టేశారు. ఈ సినిమాకు కీరవాణి సంగీత దర్శకుడు. అయితే యువ సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో తాజా పాటకు స్వరకల్పన చేయడం విశేషం. శ్యామ్ కాసర్ల రాసిన ఈ పాట అభిమానులకు ఒక ట్రీట్‌గా ఉంటుందని దర్శకనిర్మాతలు చెబుతున్నారు. గణేశ్ ఆచార్య నృత్య దర్శకత్వంలో వంద మంది డ్యాన్సర్స్ కూడా పాల్గొనగా ఈ పాటను గ్రాండ్‌గా తీశారు. మెగాస్టార్ చిరంజీవి తన సిగ్నేచర్ గ్రేస్‌తో అదరగొట్టేశారు. త్రిష కథానాయిక. ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ ముఖ్య పాత్రలు పోషించారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాతలు చెప్పారు.

ఇద్దరు వీరుల యుద్ధం



ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'వార్-2' ట్రైలర్ వచ్చేసింది. జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ నటించిన ఈ భారీ యాక్షన్ చిత్రానికి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించారు. యశ్‌రాజ్ ఫిల్మ్స్ బేనర్‌పై ఆదిత్య చోప్రా పాన్ ఇండియా స్థాయిలో నిర్మించారు. కియారా అద్వానీ కథానాయిక. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. తెలుగులో ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ విడుదల చేస్తోంది. కాగా, ఇద్దరు వీరులు యుద్ధానికి తలపడితే ఎలా ఉంటుందో ట్రైలర్‌లో చూపించారు. కియారా అద్వానీ కూడా కొన్ని యాక్షన్ సన్నివేశాలతోపాటు గ్లామర్ సీన్లలో కనిపించారు.

అలరించే ప్రేమకథ



నరేశ్ అగస్త్య, రబియా ఖాతూన్ జంటగా విపిన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ'. సునేత్ర ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై ఉమాదేవి కోట నిర్మించారు. ఆగస్టు 22న థియేటర్లలో విడుదలవుతోంది. ఇప్పటికే రిలీజ్ అయిన రెండు టీజర్లు, పాటలు సినిమాపై అంచనాలు పెంచాయి. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర కథానాయకుడు నరేశ్ అగస్త్య మాట్లాడుతూ 'దర్శకుడు విపిన్ ఈ సినిమాని చాలా అద్భుతంగా తెరకెక్కించారు. రబియా చాలా చక్కగా నటించారు. వెరీ బ్యూటిఫుల్ క్లీన్ ఫిల్మ్ ఇది. అందర్నీ తప్పకుండా అలరిస్తుందీ చిత్రం' అని అన్నారు. 'ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని భావిస్తున్నాం. చాలా ఎఫర్ట్ పెట్టాం. సినిమా హిట్ అవుతుందనే నమ్మకంతో ఉన్నాం. తప్పకుండా ఈ సినిమాను చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను' అని దర్శకుడు విపిన్ అన్నారు. కార్యక్రమంలో హీరోయిన్ రబియా, నటుడు రాజా తదితరులు పాల్గొన్నారు.



ఫిల్మ్ ఛాంబర్‌కు ఎన్నికలు నిర్వహించాలి

షెడ్యూల్ ప్రకారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌కు ఎన్నికలు నిర్వహించాలని, లేకుంటే పోరాటం చేస్తామని పలువురు నిర్మాతలు హెచ్చరించారు. హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఛాంబర్ కార్యాలయంలో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రొడ్యూసర్స్ సెక్టార్ మాజీ అధ్యక్షుడు డా.ప్రతాని రామకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు కె.ఎస్.రామారావు, అశోక్ కుమార్, బసిరెడ్డి, మోహన్ గౌడ్, విజయేందర్‌రెడ్డితోపాటు సి.కల్యాణ్ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.ఎస్.రామారావు మాట్లాడుతూ 'తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌కు 50 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. ఇలాంటి గొప్ప అసోసియేషన్‌ను క్రమశిక్షణ ప్రకారం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నా. అధ్యక్షులు భరత్ భూషణ్‌కి, ఇతర సభ్యులకు షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని అన్నారు. సి.కల్యాణ్ మాట్లాడుతూ' ఈనెల 30న జరగాల్సిన ఈసీ మీటింగ్‌ను తిరుపతిలో నిర్వహిస్తున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని, న్యాయపరంగా పోరాటం చేస్తామని' అన్నారు. అశోక్ కుమార్ మాట్లాడుతూ 'ఈసీ మీటింగ్‌లో అంబికా ప్రసాద్ అనే ఒక చిన్న డిస్ట్రిబ్యూటర్ చెప్పాడని ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు ప్రస్తుత కమిటీ నాయకులు చెప్పడం ఆశ్చర్యంగా ఉంది' అని అన్నారు. ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ 'ఇండస్ట్రీలోని ప్రతి స్టార్‌కు, ప్రొడ్యూసర్‌కు ఇందులో సభ్యత్వం ఉంది. అలాంటి తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో నిరంకుశంగా మేమే కొనసాగుతాం అనడం కరెక్ట్ కాదు. ఎన్నికల నిర్వహణ విషయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలవబోతున్నాం. అలాగే మన ఎంపీలతోనూ పార్లమెంట్‌లో ఈ విషయాన్ని ప్రస్తావింపజేస్తాం' అని అన్నారు.

వినోదాత్మక చిత్రం



ఇటీవలె 'మజాకా'తో ప్రేక్షకులను పలకరించిన దర్శకుడు త్రినాధరావు నక్కిన తెరకెక్కిస్తున్న చిత్రం 'నేను రెడీ'. హవీశ్ కథానాయకుడిగా నిఖిలా కోనేరు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమా కుటుంబ ప్రేక్షకుల్ని ఆకట్టుకునే వినోదాత్మక చిత్రమని మేకర్స్ తెలిపారు. మిక్కీ.జే.మేయర్ సంగీతం అందిస్తున్నారు.



మహీంద్ర రివెక్స్ సిరీస్ ఎస్‌యూవీలు

ప్రారంభ ధర రూ.8.94 లక్షలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎస్‌యూవీ మార్కెట్‌లో అగ్రగామి మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ మార్కెట్‌పై పట్టు బిగిస్తోంది. రివెక్స్ సిరీస్‌లో కొత్తగా మూడు కంపాక్ట్ ఎస్‌యూవీలను మార్కెట్‌లో విడుదల చేసింది. గత ఏడాది ఏప్రిల్‌లో విడుదల చేసిన 'ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ' కంపాక్ట్ ఎస్‌యూవీలను మరింత మెరుగు పరిచి 'రివెక్స్ ఎం, రివెక్స్ ఎం (ఓ), రివెక్స్ ఏ' పేర్లతో ఈ మూడు సరికొత్త కంపాక్ట్ ఎస్‌యూవీలను విడుదల చేస్తున్నట్టు కంపెనీ దక్షిణ భారత విభాగం సేల్స్ జోనల్ హెడ్ అరుణాగ్షు రాయ్ చెప్పారు. ఐదు రంగుల్లో లభించే వీటి బుకింగ్స్, డెలివరీలు ఇప్పటికే ప్రారంభమయ్యాయన్నారు. వీటి ఎక్స్ షోరూమ్ ప్రారంభ ధర వేరియంట్‌ను బట్టి రూ.8.94 లక్షల నుంచి రూ.11.79 లక్షల వరకు ఉంటుందన్నారు. 'ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ' ఎస్‌యూవీల వలెనే రివెక్స్ సిరిస్ ఎస్‌యూవీలకూ మార్కెట్‌లో మంచి ఆదరణ లభిస్తుందని భావిస్తున్నట్టు రాయ్ చెప్పారు.

ఫీచర్స్ రిచ్ ఎస్‌యూవీలు: రివెక్స్ సిరిస్‌లో ప్రవేశపెట్టిన ఈ మూడు ఎస్‌యూవీల్లో అనేక అత్యాధునిక ఫీచర్స్ జోడించినట్టు రాయ్ తెలిపారు. రూ.10 లక్షల లోపు ధర ఉన్న మరే ఇతర కంపెనీ ఎస్‌యూవీల్లోనూ ఇన్ని అద్భుత ఫీచర్లు లేవన్నారు. బ్లాక్ అలాయ్ వీల్స్, సరికొత్త బాడీ కలర్డ్ గ్రిల్, డ్యూయెల్ టోన్ రూఫ్, ఆకర్షణీయమైన ఎక్స్‌టీరియర్స్, కస్టమర్ల అభిరుచులకు అనుగుణమైన ప్రీమియం ఇంటీరియర్స్ ఈ మూడు రివెక్స్ సిరిస్ కంపాక్ట్ ఎస్‌యూవీల ప్రత్యేకత. ఏపీ, తెలంగాణ నుంచి కూడా ఈ మూడు ఎస్‌యూవీలకు మంచి స్పందన లభిస్తోందని రాయ్ చెప్పారు.

రెపో కోతకు ప్రస్తుత ధరలే కొలమానం కాదు

● ద్రవ్యోల్బణం, వృద్ధి ధోరణుల ఆధారంగానే నిర్ణయం ● ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టీకరణ



ముంబై: గత నెలలో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్లకు పైగా కనిష్ఠ స్థాయి 2.1 శాతానికి జారుకున్న నేపథ్యంలో ఆర్‌బీఐ కీలక రెపోరేట్లను మరింత తగ్గించవచ్చన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఇందుకు సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత గణాంకాలు మాత్రమే రెపోరేటు గమనాన్ని ప్రభావితం చేయలేవని.. ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధిపై భవిష్యత్ దృక్పథం ఆధారంగా వడ్డీరేట్ల తగ్గింపుపై నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. వచ్చే 12 నెలల వరకు ద్రవ్యోల్బణ సూచీ గమనం ఎలా ఉండవచ్చన్న అంచనాలను ఇందుకు పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. నాలుగో త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణ సూచీ మళ్లీ 4.4 శాతానికి పెరగవచ్చన్న అంచనాలున్నాయని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అయితే, ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుత పరిణామాలను బట్టి చూస్తే, నాలుగో త్రైమాసిక ద్రవ్యోల్బణ అంచనాను మరింత తగ్గించే అవకాశాలున్నాయని అన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఆర్‌బీఐ రెపో రేటును 1 శాతం తగ్గించింది. దాంతో రెపో 5.50 శాతానికి దిగివచ్చింది. ముంబైలో శుక్రవారం జరిగిన ఓ సదస్సులో పాల్గొన్న మల్హోత్రా ప్రస్తావించిన మరిన్ని విషయాలు..

- ఈ ఏడాదిలో జూన్ వరకు బ్యాంక్‌ల రుణరేట్లు 0.50 శాతం వరకు తగ్గాయి. అప్పటివరకు ఆర్‌బీఐ అర శాతం రెపో తగ్గింపు ప్రయోజనాన్ని బ్యాంక్‌లు కస్టమర్లకు దాదాపుగా బదిలీ చేశాయి. కాగా, ఈ జూన్ 6న ఆర్‌బీఐ రెపోరేటును మరో 0.50 శాతం తగ్గించింది.
- ఆర్‌బీఐ రెపో తగ్గింపు వ్యవస్థలో ఆస్తుల బుడగకు (అసెట్ బబుల్) దారితీయదు. ఆర్థిక వృద్ధికి మద్దతిచ్చేందుకు రెపో తగ్గింపుతోపాటు ఆర్‌బీఐ అమ్ములపొదిలో ఇతర అస్త్రాలూ ఉన్నాయి.
- గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్‌ల రుణ వృద్ధి 12.1 శాతంగా ఉంది. దశాబ్ది సగటు 10 శాతం కంటే మెరుగ్గానే ఉంది. అయితే, ఈ ఆర్థిక సంవత్సరంలో (2025-26) రుణ వృద్ధి 9 శాతానికి పరిమితం కావచ్చు.

యూకేతో ఎఫ్‌టీఏ భారత్‌కు మేలే..

యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని(ఎఫ్‌టీఏ) ఆర్‌బీఐ గవర్నర్ స్వాగతించారు. యూకేతో ఎఫ్‌టీఏ దేశంలోని పలు రంగాల వృద్ధికి తోడ్పడనుందన్నారు. భారత్ మరిన్ని దేశాలతో ఎఫ్‌టీఏలు కుదుర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశకు చేరుకున్నాయన్నారు.

ఇంటెల్‌లో 24,000 ఉద్యోగాల కోత

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన సెమీకండక్టర్ల (చిప్) తయారీ దిగ్గజం ఇంటెల్ ఏకంగా 24,000 ఉద్యోగాల కోత పెట్టే యోచనలో ఉంది. గత ఏడాది చివరినాటికి కంపెనీలో పనిచేస్తున్న 99,500 మంది సిబ్బందిలో ఇది దాదాపు 25 శాతానికి సమానం. ఈ ఏడాది చివరికి సిబ్బందిని 75,000కు తగ్గించుకోవాలని కంపెనీ భావిస్తోంది. జూన్ త్రైమాసికంలోనే కొందరిని ఇంటికి సాగనంపిన ఇంటెల్.. తాజాగా మరిన్ని విభాగాల్లో కోతలను ప్రారంభించింది. ఆర్థిక కష్టాల్లో ఉన్న ఇంటెల్‌ను తిరిగి గాడిలో పెట్టేందుకు కొత్త సీఈఓ లిప్-బు టాన్..భారీ వ్యాపార పునర్‌వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టారు. వ్యయాల్ని తగ్గించేందుకు వేల సంఖ్యలో ఉద్యోగులకు ఉద్వాసన పలకడంతోపాటు జర్మనీ, పోలెండ్‌లో ప్రాజెక్టుల విస్తరణ ప్రణాళికకు స్వస్తి పలికారు.

బిలియనీర్ల క్లబ్‌లోకి సుందర్ పిచాయ్



న్యూఢిల్లీ: అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం గూగుల్, దాని మాతృ సంస్థ ఆల్ఫాబెట్‌కు సారథ్యం వహిస్తున్న సుందర్ పిచాయ్ కూడా బిలియనీర్ల జాబితాలో చేరారు. బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం.. 53 ఏళ్ల పిచాయ్ వ్యక్తిగత సంపద 1.1 బిలియన్ డాలర్లకు (110 కోట్ల డాలర్లు) చేరుకుంది. అమెరికా స్టాక్ మార్కెట్లో ఆల్ఫాబెట్ షేర్లు సరికొత్త జీవనకాల గరిష్ఠానికి ఎగబాకడం ఇందుకు తోడ్పడింది. కనీసం 100 కోట్ల డాలర్ల (మన కరెన్సీలో సుమారు రూ.8,600 కోట్లు) ఆస్తి కలిగిన వారిని బిలియనీర్‌గా పిలుస్తారు. టెక్ ప్రపంచంలో వ్యవస్థాపక సీఈఓ కాని వ్యక్తి బిలియనీర్‌గా అవతరించడం అరుదైన పరిణామమే. ప్రస్తుతం పిచాయ్‌కి ఆల్ఫాబెట్‌లో 0.02 శాతానికి సమానమైన వాటా ఉంది. దాని విలువ 44 కోట్ల డాలర్లు.

ఐటీసీ రూ.20,000 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: విభిన్న వ్యాపార విభాగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న ఐటీసీ తయారీ సామర్థ్యాలు పటిష్ఠం చేసుకోవడం లక్ష్యంగా రూ.20,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు ప్రకటించింది. కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ పురి శుక్రవారం వర్చువల్‌గా నిర్వహించిన వాటాదారుల వార్షిక సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థలోని వృద్ధిని పరిగణనలోకి తీసుకుని ఇటీవల కాలంలో ఎనిమిది ప్రపంచ శ్రేణి తయారీ విభాగాలపై రూ.4,500 కోట్లు ఇన్వెస్ట్ చేశామన్నారు. అయితే కొత్త పెట్టుబడుల వివరాలు గాని, ఎంత కాలపరిమితిలో ఈ పెట్టుబడులు పెట్టేది గాని ప్రకటించలేదు.

రెండు సెషన్లలో రూ.8.67 లక్షల కోట్లు ఆవిరి

నెల రోజుల కనిష్ఠ స్థాయికి సెన్సెక్స్

ముంబై: ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన బలహీన సంకేతాలతో స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజు భారీ పతనాన్ని నమోదు చేసింది. ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లలో అమ్మకాలు, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు మార్కెట్‌ను శుక్రవారం కుంగదీశాయి. ఫలితంగా సెన్సెక్స్ 721.08 పాయింట్లు నష్టపోయి 81,463.09 వద్ద ముగిసింది. ఇది నెల రోజుల కనిష్ఠ స్థాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 786.48 పాయింట్ల నష్టంతో 81,397.69 స్థాయికి దిగజారింది. నిఫ్టీ కూడా 225.10 పాయింట్ల నష్టంతో 24,837 వద్ద ముగిసింది. రెండు సెషన్లలో సెన్సెక్స్ 1263.55 పాయింట్లు నష్టపోయింది. దీంతో బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.8,67,406.75 కోట్లు దిగజారి రూ.4,51,67,858.16 కోట్ల వద్ద స్థిరపడింది. కాగా వారం మొత్తం మీద సెన్సెక్స్ 294.64 పాయింట్లు, నిఫ్టీ 131.4 పాయింట్లు నష్టపోయాయి. స్టాక్ ఎక్స్ఛేంజిల వద్ద ఉన్న గణాంకాల ప్రకారం శుక్రవారం విదేశీ ఇన్వెస్టర్లు రూ.1979.96 కోట్ల విలువ గల షేర్లు విక్రయించారు. ఆసియా, యూరోపియన్ మార్కెట్లలో బలహీన ట్రెండ్, నిరుత్సాహపూరితమైన కార్పొరేట్ ఫలితాలు ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను బలహీనపరిచాయని విశ్లేషకులంటున్నారు. లార్జ్‌క్యాప్ షేర్ల అధిక విలువలు, ఎఫ్‌పీఐల వద్ద ఉన్న షార్ట్ పొజిషన్లు మార్కెట్లో ఒత్తిడిని పెంచాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు.

- ఫారెక్స్ మార్కెట్లో రూపాయి అమెరికన్ డాలర్ మారకంలో మరో 12 పైసలు దిగజారి 86.52 వద్ద ముగిసింది. విదేశీ నిధుల తరలింపు, అమెరికన్ కరెన్సీ బలం పుంజుకోవడం ఇందుకు దోహదపడ్డాయి.
- ఈ నెల 18వ తేదీతో ముగిసిన వారంలో విదేశీ మారకం నిల్వలు 118.3 కోట్ల డాలర్ల మేరకు దిగజారి 68,548.9 కోట్ల డాలర్ల వద్ద స్థిరపడ్డాయి.

ఎన్ఎస్‌డీఎల్ షేరు ధర శ్రేణి రూ.760-800

ఐపీఓకు రానున్న నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ షేరు ధర శ్రేణిని రూ.760-800గా నిర్ణయించింది. ఈ ఇష్యూ ద్వారా రూ.4011 కోట్లు సేకరించాలన్నది కంపెనీ లక్ష్యం. ఇష్యూ వచ్చే బుధవారం ప్రారంభమై శుక్రవారం ముగుస్తుంది.

జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇష్యూ సూపర్ హిట్

జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇష్యూ సూపర్ డూపర్ హిట్ అయింది. శుక్రవారం ఇష్యూ ముగిసే సమయానికి 146.90 రెట్ల అధిక బిడ్లు దాఖలయ్యాయి. రూ.460.43 కోట్ల సమీకరణ లక్ష్యంగా కంపెనీ రంగంలోకి దిగింది. మొత్తం 1,41,88,644 ఈక్విటీలు జారీ చేయగా 208,43,32,446 బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగం 45.32 రెట్ల అధిక సబ్‌స్క్రిప్షన్ సాధించింది.

లారస్ ల్యాబ్స్ లాభం రూ.163 కోట్లు

హైదరాబాద్: స్థానిక ఫార్మా కంపెనీ లారస్ ల్యాబ్స్ వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ రూ.1,570 కోట్ల ఆదాయంపై రూ.163 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 31.3 శాతం మాత్రమే పెరిగినా, నికర లాభం మాత్రం 1,185 శాతం పెరిగింది. కంపెనీ స్థూల లాభం కూడా 127 శాతం వృద్ధితో రూ.389 కోట్లకు చేరింది. కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఆర్గనైజేషన్ (సీడీఎంఓ), జనరిక్, ఫినిష్ డోసేజి ఫార్మ్స్ (ఎఫ్‌డీఎఫ్) వ్యాపారాలు పుంజుకోవడం క్యూ1లో బాగా కలిసి వచ్చాయని కంపెనీ వ్యవస్థాపకులు, సీఈఓ చావా సత్యనారాయణ తెలిపారు. సీడీఎంఓ, జనరిక్, ఎఫ్‌డీఎఫ్ వ్యాపారాలను మరింత విస్తరించనున్నట్టు చెప్పారు.

నష్టాల్లోకి జారుకున్న సిగాచి

హైదరాబాద్: ఇటీవల పాశమైలారం ప్లాంటులో జరిగిన ప్రమాదం సిగాచీ ఇండస్ట్రీస్‌కు పెద్ద నష్టాలే మిగిల్చింది. దీంతో తొలి త్రైమాసికంలో కంపెనీ రూ.128.2 కోట్ల ఆదాయంపై రూ.101 కోట్ల నష్టాలను చవి చూసింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.95.7 కోట్ల ఆదాయంపై రూ.12.8 కోట్ల నికర లాభం నమోదు చేసింది. ఈ ఏడాది డిసెంబరు త్రైమాసికం నుంచి కంపెనీ ఆర్థిక పరిస్థితి గాడిలో పడే అవకాశం ఉందని కంపెనీ యాజమాన్యం భావిస్తోంది. ప్రమాదంలో దెబ్బతిన్న పాశమైలారం ప్లాంటును దశల వారీగా పునరుద్ధరించాలని కంపెనీ యోచిస్తోంది.

హైదరాబాద్‌లో రెండో డెలివరీ సెంటర్

బిండ్జ్ కన్సల్టింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆఫ్‌షోర్ ఫైనాన్సియల్ కన్సల్టింగ్ సేవల సంస్థ బిండ్జ్ కన్సల్టింగ్ హైదరాబాద్‌లో తన రెండో డెలివరీ కేంద్రాన్ని ప్రారంభించింది. హైటెక్ సమీపంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు కంపెనీ తెలిపింది. ఈ కేంద్రం ద్వారా కంపెనీ విదేశాల్లోని క్లయింట్లకు టాక్స్ అడ్వైజరీ, వాల్యుయేషన్, అకౌంటింగ్, కంప్లయెన్స్, టెక్నాలజీ సేవలు అందించనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



26వ తేదీ			
హైదరాబాద్	425	విజయవాడ	475
వరంగల్	427	గోదావరి	455
చిత్తూరు	503	విశాఖపట్నం	465
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	114
వరంగల్	115	గుంటూరు	119
కరీంనగర్	115	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	113
కర్నూలు	115	నెల్లూరు	118
విశాఖపట్నం	97	అనంతపురం	118
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,480 ▼	92,100 ▼	1,28,000 ▼
విజయవాడ	1,01,400 ▼	96,200 ▼	1,18,000 ▼
విశాఖపట్నం	1,01,420 ▼	91,200 ▼	1,28,000 ▼
రాజమండ్రి	1,00,470 ▼	92,100 ▼	1,18,200 ▼
ప్రొద్దుటూరు	98,700 ▼	90,800 ▼	1,17,500 ▲
ముంబై	98,390	90,120	1,14,340

వెన్నెల, తన్వికి పతకాలు ఖరారు

ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్‌లో సెమీస్‌కు





సోలో (ఇండోనేసియా): తెలుగమ్మాయి వెన్నెల కలగొట్ల, మరో భారత షట్లర్ తన్వీ శర్మ ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పతకాలు ఖరారు చేసుకున్నారు. ఈ ఇద్దరు మహిళల సింగిల్స్‌లో సెమీఫైనల్స్ చేరారు. సెమీస్‌లో ఓడినా, కనీసం కాంస్య పతకాలు దక్కుతాయి. హైదరాబాద్‌కు చెందిన వెన్నెల క్వార్టర్స్‌లో 21-18, 17-21, 21-17తో జన్యాపోర్న్ మీపాన్‌థాంగ (థాయ్‌లాండ్)పై గెలిచింది. మరో క్వార్టర్స్‌లో తన్వి 21-19, 21-14తో ఐదో సీడ్ తలిట రమధాని విర్యావాన్ (ఇండోనేసియా)ను ఓడించింది. ఫైనల్ బెర్త్ కోసం సెమీస్‌లో 8వ సీడ్ యిన్ యి కింగ్ (చైనా)తో తన్వి, లూ సియా (చైనా)తో వెన్నెల తలపడతారు. ఈ టోర్నీ మహిళల సింగిల్స్‌లో ఒకేసారి ఇద్దరు భారత షట్లర్లు సెమీస్ చేరడం ఇదే తొలిసారి కావడం విశేషం.







హంపి x దివ్య

'చెక్' చెప్పేదెవరో?

నేటి నుంచి మహిళల చెస్ ప్రపంచ కప్ ఫైనల్

బటూమి (జార్జియా): విశ్వ చెస్‌లో భారత్ ఆధిపత్యానికి తాజా నిదర్శనం.. మహిళల వరల్డ్ కప్ ఫైనల్. శనివారం ఆరంభమయ్యే రెండు రోజుల తుదిపోరులో భారత్‌కు చెందిన కోనేరు హంపి, దివ్యా దేశ్‌ముఖ్ అమీతుమీ తేల్చుకోనున్నారు. 38 ఏళ్ల హంపి డిఫెండింగ్ వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్ కాగా, 19 ఏళ్ల దివ్య వర్ధమాన సంచలనం. వరల్డ్ నెం. 5 హంపి, 18వ ర్యాంకర్ దివ్యా దేశ్‌ముఖ్ సెమీఫైనల్స్‌లో చైనా స్టార్లకు షాకివ్వడం విశేషం. ప్రపంచ కప్‌లో ఇద్దరు భారత క్రీడాకారిణులు ఫైనల్‌కు చేరడం చరిత్ర. టైటిల్ ఫైట్‌కు చేరడం ద్వారా గ్రాండ్‌మాస్టర్ హంపి, ఇంటర్నేషనల్ మాస్టర్ దివ్య ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు క్వాలిఫై అయ్యారు. క్యాండిడేట్స్ టోర్నీ ద్వారా ప్రపంచ చాంపియన్ జు వెన్‌జున్‌తో టైటిల్‌కోసం తలపడే క్రీడాకారిణిని నిర్ణయిస్తారు. ఇక..వరల్డ్ కప్ ఫైనల్లో శనివారం జరిగే క్లాసికల్ ఫార్మాట్ మొదటి గేమ్‌లో హంపి, దివ్య తలపడతారు. ఇరువురి మధ్య ఆదివారం రెండో గేమ్ జరగనుంది. ఒకవేళ రెండు గేముల్లో విజేత తేలకపోతే..సోమవారం టైబ్రేకర్ నిర్వహిస్తారు. మరి ఈ ఆసక్తికర అంతిమ సమరంలో అనుభవజ్ఞురాలైన హంపి విజేతగా నిలుస్తుందా లేక దివ్య సంచలనం సృష్టిస్తుందా? ఎవరు నెగ్గినా వరల్డ్ కప్‌లో స్వర్ణ, రజత పతకాలు భారత్‌కే దక్కనున్నాయి.

ప్రపంచ జూనియర్ స్క్వాష్‌లో

అనహత్‌కు కాంస్యం



కైరో: భారత టీనేజ్ సంచలనం అనహత్ సింగ్ ప్రపంచ స్క్వాష్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో పతకంతో సత్తా చాటింది. శుక్రవారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో అనహత్ 6-11, 12-14, 10-12తో నదియెన్ ఎల్‌హమామి (ఈజిప్టు) చేతిలో ఓటమిపాలై కాంస్యం అందుకుంది. కాగా, 2010లో దీపికా పల్లికల్ తర్వాత ఈ టోర్నీలో సెమీస్ చేరిన తొలి భారత క్రీడాకారిణిగా 17 ఏళ్ల అనహత్ రికార్డుకెక్కింది.

సెమీస్‌లో సాత్విక్ జోడీ

ముగిసిన ఉన్నతి పోరు● చైనా ఓపెన్

చాంగ్‌ఝౌ: చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి జోడీ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. అయితే మహిళల సింగిల్స్‌లో వర్ధమాన షట్లర్ ఉన్నతి హుడా పయనం ముగిసింది. డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో సాత్విక్/చిరాగ్ జోడీ 21-18, 21-14తో మలేసియా జంట ఆంగ్ యూ సిన్/టో యీ యీని చిత్తు చేసింది. ఇక పీవీ సింధుకు ప్రీక్వార్టర్ ఫైనల్లో షాకిచ్చిన ఉన్నతి..వరల్డ్ నెం. 4 అకానె యమగూచి చేతిలో పరాజయం చవిచూసింది. క్వార్టర్‌ఫైనల్లో హుడా 16-21, 12-21తో యమగూచి (జపాన్) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

మైనర్‌పై అత్యాచారం

పేసర్ యశ్ దయాళ్‌పై ఎఫ్ఐఆర్



జైపూర్: రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) పేసర్ యశ్ దయాళ్‌పై మరో అత్యాచారం కేసు నమోదైంది. ఈమేరకు జైపూర్ పోలీసులు అతడిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. పోలీసులు అందించిన వివరాల మేరకు..యశ్ దయాళ్ తొలిసారి 2023లో 17 ఏళ్ల బాలికపై అత్యాచారం చేశాడు. క్రికెటర్‌గా ఎదిగేందుకు సాయం చేస్తాననే సాకుతో దయాళ్ పలుమార్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడట. ఈమేరకు బాలిక చేసిన ఫిర్యాదుతో భారత న్యాయ సంహితలోని సెక్షన్ 64తోపాటు, పోక్సో చట్టం కింద 27 ఏళ్ల యశ్ దయాళ్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కాగా దయాళ్‌పై అత్యాచారం కేసు నమోదు కావడం ఇది రెండోసారి. యూపీకి చెందిన ఓ మహిళను పెళ్లి చేసుకుంటానని ఐదేళ్లపాటు ఆమెతో సహజీవనం చేసి మోసం చేసిన కేసులో పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు.

వేద కృష్ణమూర్తి వీడ్కోలు



న్యూఢిల్లీ: భారత మహిళల జట్టు మిడిలార్డర్ బ్యాటర్ వేద కృష్ణ మూర్తి క్రికెట్‌కు వీడ్కోలు పలికింది. 2017 వన్డే వరల్డ్‌కప్, 2020 టీ20 వరల్డ్‌కప్‌ల్లో రన్నరప్‌గా నిలిచిన భారత జట్టులో వేద సభ్యురాలు. కర్ణాటకలోని కడురు అనే చిన్న పట్టణం నుంచి భారత జట్టు జెర్సీని ధరించే స్థాయికి ఎదిగినందుకు సంతోషంగా ఉందని 32 ఏళ్ల వేద పేర్కొంది. 2011లో అరంగేట్రం చేసిన వేద.. భారత్ తరఫున ఐదేళ్ల క్రితమే చివరి మ్యాచ్ ఆడింది. మొత్తంగా తన కెరీర్‌లో 48 వన్డేల్లో 829, 76 టీ20ల్లో 875 రన్స్ సాధించింది.

పట్టు బిగించారు

186 పరుగుల ఆధిక్యంలో ఇంగ్లండ్ ● తొలి ఇన్నింగ్స్ 544/7

- జో రూట్ శతకం
- స్టోక్స్, పోప్ హాఫ్ సెంచరీలు
- భారత్‌తో నాలుగో టెస్టు



జో రూట్ (150)

మాంచెస్టర్: నాలుగో టెస్టులో వరుసగా మూడో రోజూ ఇంగ్లండ్‌దే ఆధిపత్యం సాగింది. వరల్డ్ నెంబర్‌వన్ జో రూట్ (150) మరోసారి తన అత్యుత్తమ ఆటతీరుతో అదరగొట్టాడు. అతడికి జతగా కెప్టెన్ బెన్ స్టోక్స్ (77 బ్యాటింగ్), పోప్ (71) అర్ధసెంచరీలతో రాణించగా, ప్రస్తుతం ఆతిథ్య జట్టు 186 పరుగుల భారీ ఆధిక్యంతో దూసుకెళుతోంది. భారత బౌలర్లు ఎప్పటిలాగే నిరాశపర్చడంతో శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 135 ఓవర్లలో 544/7 స్కోరుతో నిలిచింది. క్రీజులో స్టోక్స్‌తో పాటు డాసన్ (21 బ్యాటింగ్) ఉన్నాడు. ఇద్దరూ బ్యాటర్లే కావడంతో నాలుగో రోజు వీలైనంత వేగంగా ఆడి తమ ఆధిక్యాన్ని పెంచాలనే భావనలో ఉన్నారు. జడేజా, సుందర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

వికెట్ కోల్పోకుండా..: 225/2 ఓవర్‌నైట్ స్కోరుతో ఇంగ్లండ్ మూడో రోజు ఆటను ఆరంభించగా.. రూట్, పోప్ తొలి సెషన్‌లో పూర్తి ఆధిపత్యం చూపారు. భారత బౌలర్లు ఈ జోడీని విడదీయడంలో విఫలమయ్యారు. పసలేని బౌలింగ్‌తో నిరాశపర్చారు. దీంతో ఇద్దరు బ్యాటర్లు తమ అర్ధసెంచరీలను పూర్తి చేసుకున్నారు. బుమ్రా సైతం ఎలాంటి ప్రభావం చూపకపోగా.. అతడి ఓవర్లలో సులువుగా పరుగులు రాబట్టారు. పోప్ 48 రన్స్ దగ్గర ఉన్నప్పుడు అన్షుల్ ఓవర్‌లో ఇచ్చిన క్లిష్టమైన క్యాచ్‌ను కీపర్ జురెల్ అందుకోలేకపోయాడు. మొత్తంగా ఈ సెషన్‌లో 107 పరుగులు రాబట్టిన ఇంగ్లండ్ లంచ్ విరామానికి వెళ్లింది.

రూట్ శతకం: వికెట్ కోసం నిరీక్షిస్తున్న భారత్‌కు సెషన్ ఆరంభంలోనే ఆ అవకాశం దక్కింది. పాత బంతితో స్పిన్నర్ సుందర్ చక్కటి టర్న్ రాబట్టి ముందుగా పోప్‌ను అవుట్ చేశాడు. దీంతో మూడో వికెట్‌కు 144 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే హ్యారీ బ్రూక్ (3) సుందర్ ఓవర్‌లో ముందుకు వచ్చి స్టంపౌట్ కావడంతో భారత్ పైచేయి సాధించినట్టు కనిపించింది. ఈ దశలో గిల్ కొత్త బంతి తీసుకోకుండా స్పిన్నర్లతోనే ఓవర్లు వేయించాడు. కానీ రూట్‌తో జత కట్టిన కెప్టెన్ స్టోక్స్ భారత్ సంబరాలకు చెక్ పెట్టాడు. ఓవైపు అన్షుల్ ఓవర్‌లో ఫోర్‌తో రూట్ శతకం పూర్తి చేశాడు. అటు 91వ ఓవర్ మధ్యలో రెండో కొత్త బంతిని తీసుకున్నా పేసర్లు ఎలాంటి ఒత్తిడి తేలేకపోయారు. సెషన్‌లో 101 పరుగులు సాధించిన ఇంగ్లండ్ జట్టు.. ఇన్నింగ్స్ 100వ ఓవర్‌లోనే స్కోరును 400 దాటించింది. ఇక డ్రింక్స్ విరామంలో వాష్‌రూమ్‌కు వెళ్లిన బుమ్రా ఐదు ఓవర్ల తర్వాత మైదానంలోకి వచ్చాడు. అయితే తను మెట్ల మీద నుంచి జారి పడినందుకే సమయం తీసుకున్నాడని వ్యాఖ్యాత నాసిర్ హుసేన్ తెలిపాడు.

చివర్లో ఊరట: ఆఖరి సెషన్ చివర్లో భారత బౌలర్లు మూడు వికెట్లు తీయగలిగారు. కానీ ఆరంభంలో రూట్, స్టోక్స్ అవలీలగా బంతులను ఎదుర్కొంటూ అడపాదడపా ఫోర్లతో తమ ఆధిక్యాన్ని పెంచుకుంటూ వెళ్లారు. ఈక్రమంలో స్టోక్స్ 15 ఇన్నింగ్స్ తర్వాత భారత్‌పై అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అయితే తొడ కండరాలు పట్టేయడంతో 116వ ఓవర్ ముగిశాక తను రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. అప్పటికి రూట్‌తో కలిసి ఐదో వికెట్‌కు 142 పరుగులు జత చేయడం విశేషం. అలాగే డ్రింక్స్ తర్వాత భారత్‌కు కాస్త కలిసివచ్చింది. క్రీజులో పాతుకుపోయిన రూట్‌ను జడేజా అవుట్ చేయగా.. స్వల్ప వ్యవధిలో స్మిత్ (9)ను బుమ్రా, వోక్స్ (4)ను సిరాజ్ వెనక్కిపంపారు. ఈ దశలో స్టోక్స్ తిరిగి బ్యాటింగ్‌కు రాగా, డాసన్‌తో కలిసి వికెట్ కోల్పోకుండా రోజును ముగించాడు.

టెస్టుల్లో అత్యధిక శతకాలు

సచిన్	51
కలిస్	45
పాంటింగ్	41
రూట్	38
సంగక్కర	38

1 భారత్‌పై ఎక్కువ శతకాలు (12) బాదిన ప్లేయర్‌గా జో రూట్. స్టీవ్ స్మిత్ (11)ను దాటేశాడు. అలాగే మాంచెస్టర్ స్టేడియంలో వెయ్యికి పైగా పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గానూ నిలిచాడు.

టెస్టుల్లో అత్యధిక పరుగులు

సచిన్	15,291
జో రూట్	13,409
పాంటింగ్	13,378
కలిస్	13,289
ద్రవిడ్	13,288

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 358.

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) రాహుల్ (బి) జడేజా 84; డకెట్ (సి) జురెల్ (బి) అన్షుల్ 94; పోప్ (సి) రాహుల్ (బి) సుందర్ 71; రూట్ (స్టంప్ సబ్) జురెల్ (బి) జడేజా 150; బ్రూక్ (స్టంప్ సబ్) జురెల్ (బి) సుందర్ 3; స్టోక్స్ (బ్యాటింగ్) 77; స్మిత్ (సి సబ్) జురెల్ (బి) బుమ్రా 9; డాసన్ (బ్యాటింగ్) 21; వోక్స్ (బి) సిరాజ్ 4; **ఎక్స్‌ట్రాలు: 31; మొత్తం: 135 ఓవర్లలో 544/7. వికెట్ల పతనం:** 1-166, 2-197, 3-341, 4-349, 5-499, 6-515, 7-528. **బౌలింగ్:** బుమ్రా 28-5-95-1; అన్షుల్ 18-1-89-1; సిరాజ్ 26-4-113-1; శార్దూల్ 11-0-55-0; జడేజా 33-0-117-2; సుందర్ 19-4-57-2.

అన్ ఎయిడెడ్ కాలేజీల్లో ఫీజుల నిర్ధారణకు కమిటీ

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేట్ అన్-ఎయిడెడ్ ప్రొఫెషనల్ కాలేజీల్లో 2025-28 కాలానికిగాను ఫీజుల నిర్ధారణకు తీసుకోవాల్సిన ప్రామాణికతలపై సిఫారసు చేయడానికి ఉన్నత స్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఫీజుల ఖరారు కోసం ఏయే అంశాలను ప్రామాణికంగా తీసుకోవాలి? సుప్రీంకోర్టు/హైకోర్టు తీర్పులు ఎలా ఉన్నాయి? ఇతర రాష్ట్రాల్లో ఫీజుల నిర్ధారణకు ఏయే అంశాలు పరిగణనలోకి తీసుకుంటున్నారు? వంటి అంశాలపై అధ్యయనం చేసి సిఫారసులు చేసేందుకు శుక్రవారం ఈ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా జీవో నం 29ను జారీ చేశారు. ఈ కమిటీ చైర్మన్‌గా ఉన్నత విద్యామండలి చైర్మన్ జి.బాలకిష్టారెడ్డి, సభ్యులుగా సాంకేతిక విద్య కమిషనర్ ఎ.శ్రీదేవసేన, ఎస్సీ అభివృద్ధి విభాగం డైరెక్టర్ ఎస్.క్షితిజ, స్టేట్ ఆడిట్ విభాగం డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డీటీసీపీ డైరెక్టర్ ఎస్.దేవేందర్‌రెడ్డి, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు, ఓయూ ఇంజనీరింగ్ కాలేజీలోని ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ ఎ.కృష్ణయ్య, సభ్య కార్యదర్శిగా ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్ ఉంటారు. మరో ఇద్దరు నిపుణులను చైర్మన్ నియమించుకోవచ్చు.

గురుకుల హాస్టల్‌లో ఎలుకల కలకలం

» ఇద్దరు విద్యార్థులకు గాయాలు

హుజూరాబాద్, జూలై 25(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని సైదాపూర్ బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థులను ఎలుకలు కొరికాయి. దీంతో ఆ ఇద్దరితో పాటు గదిలో ఉన్న 10మంది విద్యార్థులను హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి టీటీ ఇంజక్షన్లు ఇప్పించారు. హాస్టల్‌కు సమీపంలో రైస్ మిల్లులు ఉండడంతో ఎలుకలు వస్తున్నాయని, బోన్లు ఏర్పాటు చేస్తున్నామని ప్రిన్సిపాల్ రాణి తెలిపారు. విద్యార్థులు క్షేమంగా ఉన్నారని చెప్పారు.

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై కేసు కొట్టివేత

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై 2021లో చౌటుప్పల్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. చౌటుప్పల్ మండలం లక్కారంలో రేషన్ కార్డుల పంపిణీ కోసం నిర్వహించిన సభలో గందరగోళం సృష్టించారంటూ ఆయనపై కేసు నమోదయింది. నాటి మంత్రి జగదీశ్‌రెడ్డి నుంచి మైక్ లాక్కున్నారని, కార్యక్రమ నిర్వహణను అడ్డుకున్నారంటూ తహసీల్దార్ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ కేసును కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది.

తప్పుల తడకగా కుల గణన: కవిత

రాష్ట్ర ప్రభుత్వం కుల గణనపై చేపట్టిన సర్వే తప్పుల తడకగా ఉందని.. 52% ఉన్న బీసీ జనాభాను 46 శాతంగా చూపారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఈ సర్వేను సమాజపు ఎక్స్‌రేగా కాంగ్రెస్ అభివర్ణించడాన్ని ఖండిస్తున్నామని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'మీ సర్వే నిజమైతే.. గ్రామపంచాయతీలు, కులాలవారీగా ఆ వివరాలను బహిర్గతం చేయాలి' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డికి ఆమె సవాల్ విసిరారు. అబద్ధాలతో కాంగ్రెస్ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని, కుల సర్వే పారదర్శకంగా జరగలేదని, అందులో ఎన్నో లోపాలున్నాయన్నారు.

ఈబీసీలపై ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయి

» ఈబీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ఆరోపణ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అగ్రవర్ణాల నిరుపేదలపై వివక్ష చూపుతున్నాయని ఈబీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి ఆరోపించారు. అగ్రవర్ణాల వారంతా సంపన్నులనే భావనతో సంక్షేమ పథకాలను వర్తింప చేయడం లేదన్నారు. జూబ్లీహిల్స్‌లో జరిగిన ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సర్వసభ్య సమావేశంలో రవీందర్ రెడ్డి మాట్లాడారు. ఈబీసీల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, కార్పొరేషన్, ఈబీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నూతన జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు రవిశంకర్ ఎన్నికయ్యారు.

హీరోయిన్ల ఫోన్లు హ్యాక్ చేయిస్తున్న రేవంత్: కౌశిక్

"సినీరంగ ప్రముఖులు, హీరోయిన్ల ఫోన్లను హ్యాక్ చేయిస్తూ వారిపై సీఎం రేవంత్‌రెడ్డి దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. రేవంత్‌రెడ్డి చరిత్ర నాకు పూర్తిగా తెలుసు." అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఫోన్లు ట్యాపింగ్ చేశారని తప్పుడు ప్రచారం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. తానే ఫోన్లు ట్యాపింగ్ చేయిస్తున్నానని, తప్పు ఒప్పుకొన్నారని పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా.. అధికారులతో ఫోన్లు ట్యాప్ చేయిస్తున్నా.. తప్పేంటని సీఎం ప్రశ్నించారని గుర్తుచేశారు. తనఫోన్‌తో పాటు తన సతీమణి ఫోన్ కూడా సీఎం హ్యాక్ చేయిస్తున్నారని కౌశిక్‌రెడ్డి ఆరోపించారు.

ప్రతి చిన్నారికీ రక్షణ!

» సంక్షేమ కమిటీల ఏర్పాటుకు సర్కారు పచ్చజెండా

» మరో 16 జువైనల్ జస్టిస్ బోర్డులు కూడా..

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బాలల సంరక్షణ, పునరావాస కార్యక్రమాలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ), జువైనల్ జస్టిస్ బోర్డు (జేజేబీ)ల నియామకాలకు ప్రకటన జారీ చేసింది. ఈ నియామకాలను పిల్లల సంరక్షణ, మోడల్ రూల్స్ 2016లోని నిబంధనలకు అనుగుణంగా చేపట్టనున్నారు. ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయబోయే ఒక్కో చైల్డ్ వెల్ఫేర్ కమిటీలో ఒక చైర్ పర్సన్‌తో పాటు నలుగురు సభ్యులుంటారు. రాష్ట్రంలో ప్రస్తుతం 36 సీడబ్ల్యూసీలు ఉండగా.. 17 జేజేబీలు పనిచేస్తున్నాయి. వీటితోపాటు ఈ సారి కొత్తగా మరో 16 జేజేబీలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ కమిటీలు, బోర్డులు బాలల సంరక్షణ, రక్షణ, పునరావాసం, నేరాలకు పాల్పడిన బాలలకు న్యాయం అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నియామకాల ద్వారా రాష్ట్రంలోని బాలల సంరక్షణ వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఆగస్టు 8వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

దివ్యాంగజన్ పథకం అమలుకు కార్యాచరణ!

» తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య వెల్లడి

తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి, గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ను పునరుద్ధరించాలని ఆ సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య జాతీయ దివ్యాంగజన్ ఆర్థికాభివృద్ధి కార్పొరేషన్(ఎన్‌డీఎఫ్‌డీసీ) అధికారులకు విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలోని ఎన్‌డీఎఫ్‌డీసీ కార్యాలయంలో ఆ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్‌తో ఆయన సమావేశమై చర్చలు జరిపారు. అధికారులు సానుకూలంగా స్పందించారని సమావేశం తర్వాత వీరయ్య తెలిపారు. రాష్ట్రంలో దివ్యాంగజన్ స్వావలంబన్ పథకం అమలుకు త్వరలోనే కార్యాచరణ ప్రారంభిస్తామని అధికారులు హామీ ఇచ్చారని వీరయ్య చెప్పారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకం అమలుకు సహకరించలేదని అధికారులు చెప్పారని ఆయన తెలిపారు.

బీసీ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలి!

» కేంద్ర మంత్రి జోషికి ఆర్ కృష్ణయ్య వినతి

రాంనగర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే బీసీ బిల్లును ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి వినతి పత్రం అందజేశారు. బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, జనాభా ప్రాతిపదికన బడ్జెట్లో నిధులు కేటాయించాలని కోరారు. విద్య, ఉద్యోగాలలో బీసీలకు అవకాశాలు కల్పించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు జరిగేలా చూడాలని కేంద్ర మంత్రిని కోరినట్లు ఆర్ కృష్ణయ్య తెలిపారు.

ఏపీ, తెలంగాణలో నియోజకవర్గాల
పునర్విభజనకు సుప్రీం నో

» అసెంబ్లీ సీట్లు పెంచాలన్న పిటిషన్ తిరస్కరణ

» తెలుగు రాష్ట్రాలను జమ్మూ కశ్మీర్‌తో పోల్చలేమని వెల్లడి



న్యూఢిల్లీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. 2022లో పునర్విభజన జరిగిన జమ్ము కశ్మీర్‌తో సమానంగా ఏపీ, తెలంగాణను పరిగణించాలంటూ కె.పురుషోత్తమ్‌రెడ్డి చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్ మూడో అధ్యాయం కిందకు జమ్ము కశ్మీర్ రాదని, ఆ రాష్ట్రంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లను పోల్చలేమని న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్ అభిప్రాయపడ్డారు. ఏపీ, తెలంగాణలో పునర్విభజన చేపడితే.. మిగిలిన అన్ని రాష్ట్రాల నుంచీ అవే డిమాండ్లు వస్తాయన్నారు. 2014 ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం ఏపీ, తెలంగాణలో అసెంబ్లీ సీట్లను పెంచాలని పిటిషనర్ కోర్టు తలుపు తట్టారు. అయితే.. రాజ్యాంగంలోని 170వ అధికరణకు లోబడి పునర్విభజన చట్టంలోని సెక్షన్ 26ను అమలు చేస్తామని చెప్పిన విషయాన్ని సర్వోన్నత న్యాయస్థానం గుర్తుచేసింది. 2026 తర్వాత చేపట్టే తొలి జనగణన జరిగేంత వరకూ అసెంబ్లీల సీట్ల సర్దుబాటు చేయాల్సిన అవసరం లేదని 170(3) స్పష్టం చేస్తోందని పేర్కొంది. విస్తృత రాజ్యాంగ ప్రణాళిక ప్రకారమే పునర్విభజన తప్పనిసరిగా చేపట్టాల్సి ఉంటుందని తెలిపింది. కేంద్రపాలిత ప్రాంతమైన జమ్ము కశ్మీర్‌కు ఆర్టికల్ 170 వర్తించదని, 239(ఏ) వర్తిస్తుందని వివరించింది. ఈ రాష్ట్రానికి సంబంధించి పార్లమెంట్ చట్టాలు చేయాల్సి ఉందని గుర్తు చేసింది. ఏపీ, తెలంగాణలో పునర్విభజన చట్టానికి అనుగుణంగా నియోజకవర్గాల సంఖ్యను పెంచాలన్న అభ్యర్థన న్యాయసమ్మతమే అయినా.. రాజ్యాంగ ప్రణాళికకు అనుగుణంగానే ఈ విభజన జరగాల్సి ఉంటుందన్న కేంద్ర ప్రభుత్వ వాదనతో సుప్రీంకోర్టు ఏకీభవించింది. రాజ్యాంగ సూత్రాలకు భిన్నంగా విభజన చట్టాన్ని పరిగణించలేమని స్పష్టం చేసింది.

2026 ఎంతో దూరంలో లేదు: వినోద్‌కుమార్

ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 26ను సవరించి 'సబ్జెక్ట్ టు' అనే పదానికి బదులుగా 'నాట్‌విత్‌స్టాండింగ్' అన్న పదాలు చేర్చి ఉంటే ఏపీ, తెలంగాణలో అసెంబ్లీ స్థానాలు ఎప్పుడో పెరిగి ఉండేవని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అన్నారు. అయినా 2026 ఎంతో దూరంలో లేదని, నియోజకవర్గాల పునర్విభజన జరిగిన వెంటనే ఏపీ, తెలంగాణలో సీట్లు పెరుగుతాయని తెలిపారు. కేంద్రం విభజన చట్టాన్ని సవరించేందుకు మొగ్గు చూపకపోవడం వల్లనే ఈ ఆలస్యం జరిగిందన్నారు.

హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజ్ అరెస్టు

పుణెలో త్రీస్టార్ హోటల్‌లో మకాం.. కేసు నమోదైనప్పటి నుంచి పరారీలోనే దేవరాజ్

» 7 రాష్ట్రాలు తిరిగిన నిందితుడు

» 36 గంటల పాటు ట్రాక్ చేసిన సీఐడీ

» రంగంలోకి దిగిన ఆరు ప్రత్యేక బృందాలు

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) కార్యదర్శి దేవరాజ్ రామచందర్ ఎట్టకేలకు అరెస్టయ్యారు. నిధుల దుర్వినియోగం, ఫోర్జరీ, బ్లాక్‌మెయిలింగ్‌పై సీఐడీ కేసు నమోదు చేసినప్పటి నుంచి దేవరాజ్ పరారీలో ఉన్న విషయం తెలిసిందే.! ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన సమాచారంతోనే దేవరాజ్ తప్పించుకున్నాడనే ఆరోపణలు రావడంతో.. ఇన్‌స్పెక్టర్‌పై బదిలీ వేటు పడింది. అయితే.. దేవరాజ్ హైదరాబాద్ నుంచి పారిపోయాక.. తన ఫోన్‌ను స్విచాఫ్ చేసుకున్నారు. 17 రోజుల్లో ఏడు రాష్ట్రాల్లో తిరిగి.. చివరకు మహారాష్ట్రలోని పుణె చేరుకున్నారు. కొత్త ఫోన్, కొత్త సిమ్‌కార్డులను వాడుతూ.. పోలీసులకు చిక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దేవరాజ్‌ను అరెస్టు చేసేందుకు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన సీఐడీ.. తాజాగా అతను కొత్త సిమ్‌ను వాడుతున్నట్లు గుర్తించింది. అయితే.. అతని లొకేషన్‌ను తెలుసుకుని, అక్కడికి వెళ్లే సరికి.. దేవరాజ్ పారిపోతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో భద్రాచలం, కాకినాడ, వైజాగ్, తిరుపతి, నెల్లూరు, చెన్నై, కాంచీపురం, బెంగళూరు, గోవా, పుణె, ఊటీ, యానాం ప్రాంతాల్లో తిరిగి.. మళ్లీ పుణె చేరుకున్నారు. ఎక్కడికి వెళ్లినా.. 24 గంటల్లోపే మకాం మార్చేవారు. పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాల్లో తిరుగుతూ.. ప్రైవేటు వాహనాలు, బస్సుల్లో ప్రయాణించేవారు. ఈక్రమంలో సీఐడీ అధికారులు 36 గంటల పాటు దేవరాజ్‌ను ట్రాక్ చేశారు. అతను పుణెలోని ఓ త్రీస్టార్ హోటల్‌లో ఉన్నట్లు గుర్తించి, శుక్రవారం అరెస్టు చేశారు. వెంటనే అతణ్ని హైదరాబాద్‌కు తరలించారు. "దేవరాజ్‌ను న్యాయ



మూర్తి ఎదుట హాజరుపరిచాం. అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు" అని సీఐడీ అదనపు డీజీ చారుసిన్హా వెల్లడించారు.

రూ.4 కోట్ల గోల్‌మాల్

హెచ్‌సీఏ అధ్యక్షుడి హోదాలో జగన్ మోహన్‌రావు వీలు చిక్కినప్పుడల్లా నిధులను స్వాహా చేసినట్లు సీఐడీ గుర్తించింది. క్రికెట్ బంతులను కొనకున్నా.. వాటిని కొనుగోలు చేసినట్లు చూపించి రూ.3 లక్షలు కొట్టేసిన వ్యవహారం ఇప్పటికే వెలుగులోకి రాగా.. తాజాగా విద్యార్థుల కోసం వేసవి శిబిరాల పేరుతో రూ.4 కోట్ల బీసీసీఐ నిధులను గోల్‌మాల్ చేసిన వ్యవహారం బయటపడింది. హెచ్‌సీఏ గత ఏడాది వేసవిలో రాష్ట్రవ్యాప్తంగా 28 సమ్మర్ క్యాంపులను నిర్వహించింది. ప్రతి క్యాంపులో సగటున వంద మందికి క్రికెట్ కోచింగ్ ఇచ్చినట్లు లెక్కలు చూపింది. ఒక్కో సమ్మర్ క్యాంపునకు రూ.4 లక్షల ఖర్చయినట్లు పేర్కొంటూ.. విద్యార్థులకు ఒక్కోటి చొప్పున క్రికెట్ కిట్స్‌ను ఇచ్చినట్లు రికార్డుల్లో నమోదు చేసింది. జగన్‌ను కస్టడీకి తీసుకున్న సీఐడీ.. క్షేత్రస్థాయిలో జరిపిన దర్యాప్తులో అసలు సమ్మర్‌క్యాంపులకు అంత మంది విద్యార్థులు హాజరుకాలేదని తేలింది. ఒక్కో శిబిరంలో సగటున రూ.లక్ష చొప్పున కూడా ఖర్చు కాలేదని ఆధారాలను సీఐడీ సేకరించింది. రూ.28 లక్షల లోపే నిధులను వినియోగించినట్లు పేర్కొంది.

ముగ్గురికి బెయిల్..

ఈ కేసులో అరెస్టయిన హెచ్‌సీఏ కోశాధికారి శ్రీనివాసరావు, శ్రీచక్ర క్లబ్ సెక్రటరీ రాజేందర్ యాదవ్, ఆయన భార్య కవితలకు మల్కాజిగిరి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. తమ కస్టడీలో జగన్ మోహన్‌రావు సహకరించలేదని, అతడి కస్టడీని పొడిగించాలని సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. జగన్ మోహన్‌రావు, సీఈవో సునీల్ కాంతే బెయిల్ పిటిషన్లపై విచారణను వాయిదా పడింది.

హెచ్‌సీఏ లీగ్ మ్యాచ్‌ల నిర్వహణకు ఏకసభ్య కమిటీ

మాజీ జడ్జి జస్టిస్ నవీన్‌రావు నియామకం

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) 2025- 26 సీజన్‌లో లీగ్ మ్యాచ్‌లను నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు హైకోర్టు ఏకసభ్య కమిటీని నియమించింది. హైకోర్టు కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నవీన్‌రావుకు ఈ బాధ్యతలను అప్పగించింది. గతంలో జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు తరహాలోనే జస్టిస్ నవీన్‌రావు హెచ్‌సీఏ విధులను పర్యవేక్షిస్తారని స్పష్టం చేసింది. హెచ్‌సీఏ ఆర్థిక అవకతవకలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ సఫిల్‌గూడ క్రికెట్ క్లబ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అప్పటివరకు కార్యకలాపాల పర్యవేక్షణకు ఓ కమిటీని నియమించాలని విజ్ఞప్తి చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. జస్టిస్ నవీన్‌రావు నేతృత్వంలో ఏకసభ్య కమిటీని నియమిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చారు.

రాష్ట్ర పన్ను రాబడి పెరిగింది..!

జూన్‌లో రూ.13,122 కోట్ల రాక

మే కంటే రూ.1,420 కోట్లు అదనం

గత నెలలో ఏకంగా 10,876 కోట్ల అప్పు

ఆదాయ, వ్యయాలపై కాగ్ నివేదిక

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పన్ను రాబడి పెరిగింది. జూన్‌లో ఈ ఆదాయం పెరిగినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తెలిపింది. గత నెలలో పన్ను రాబడి రూ.13,112 కోట్లు వచ్చినట్లు వెల్లడించింది. ఈ మేరకు జూన్ నెలలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ, వ్యయాలకు సంబంధించి కాగ్ శుక్రవారం నివేదికను విడుదల చేసింది. వస్తు సేవల పన్ను, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, అమ్మకం పన్ను, రాష్ట్ర ఎక్సైజ్ సుంకాలు, కేంద్ర పన్నుల్లో వాటా, ఇతర పన్నులు, సుంకాల ద్వారా గత ఏప్రిల్‌లో రూ.10,916 కోట్ల ఆదాయం వచ్చింది. మేలో రూ.11,692 కోట్లు రాగా.. జూన్‌లో రూ.13,112 కోట్లు వచ్చింది. అంటే.. రూ.1,420 కోట్లు అదనంగా వచ్చాయి. దీంతో జూన్ నాటికి జీఎస్టీ ద్వారా రూ.12,622 కోట్లు, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.3,712 కోట్లు, అమ్మకం పన్ను ద్వారా రూ.8,466 కోట్లు, ఎక్సైజ్ సుంకాల ద్వారా రూ.4,595 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ.4,385 కోట్లు, ఇతర పన్నులు, సుంకాల ద్వారా రూ.1,940 కోట్ల రాబడులు సమకూరాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నికర అప్పు రూ.20,266 కోట్లకు చేరింది. ఒక్క జూన్‌లోనే రూ.10,876 కోట్ల రుణాలు తీసుకుంది. ఆ నెలలో రైతు భరోసా పథకాన్ని అమలు చేయడం వల్ల ఎక్కువ అప్పు తీసుకోవాల్సి వచ్చింది. ఇలా అన్ని రకాల రాబడుల ద్వారా ప్రభుత్వానికి జూన్ నాటికి రూ.57,499 కోట్లు సమకూరాయి. ఇది అంచనా వేసిన రాబడి రూ.2,84,837 కోట్లలో 20.19 శాతం. కాగా, జూన్ నాటికి ప్రభుత్వం అన్ని రకాలుగా రూ.52,559 కోట్లను ఖర్చు చేసింది. ఇది అంచనా వ్యయం రూ.2,63,846 కోట్లలో 19.95 శాతం. మూలధన వ్యయం కింద అంచనా వేసిన రూ.36,504 కోట్లలో జూన్ నాటికి రూ.4,755 కోట్లను ఖర్చు చేసింది.

ఔషధ దుకాణంలో లింగ నిర్ధారణ పరీక్షలు

యజమాని, స్కానింగ్ నిర్వాహకుడి అరెస్టు

భానుపురి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ఔషధ దుకాణంలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలోని చర్చి కాంపౌండ్ రోడ్డులో ఉన్న మహాగణపతి ఔషధ దుకాణంలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు మెటర్నల్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం ఇన్‌చార్జి డాక్టర్ నాజియాకు శుక్రవారం సమాచారం అందింది. వెంటనే ఆమె సిబ్బందితో కలిసి తనిఖీకి వెళ్లగా.. అక్కడ లింగ నిర్ధారణ స్కానింగ్ యంత్రాన్ని గుర్తించారు. అక్కడున్న నిర్వాహకుడు నల్లగట్టు నగేశ్‌ను ప్రశ్నించగా 'రూ.5 వేలు ఇస్తే కడుపులో ఉన్నది బాబా, పాప అనేది చెప్తే స్తామని' బదులిచ్చాడు. కొంతమంది ఆర్‌ఎంపీలతో కలిసి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించాడు. తాను ఓ రేడియాలజిస్ట్ వద్ద పనిచేశానని, తన యజమాని వేలాద్రి ఓ వైద్యుడి వద్ద కంపౌండర్‌గా పనిచేసిన అనుభవంతో దుకాణం ఏర్పాటు చేశాడని తెలిపాడు. డాక్టర్ నాజియా ఇచ్చిన సమాచారం మేరకు ఔషధ దుకాణాన్ని సీజ్ చేసి, నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ వెంకటయ్య తెలిపారు. సూర్యాపేటలో లింగ నిర్ధారణ పరీక్షల నిర్వాహణ కేసులు పెరిగిపోతున్నాయి. కమీషన్లకు కక్కుర్తిపడి ఆర్‌ఎంపీలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి మహిళలను తీసుకువచ్చి లింగ నిర్ధారణ పరీక్షలు చేయించడం పట్టణంలో పరిపాటిగా మారింది. గతంలోనూ పలు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లను సీజ్ చేసిన విషయం తెలిసిందే. లింగ నిర్ధారణ పరీక్షలో పుట్టబోయేది ఆడ శిశువు అని తెలిసి అబార్షన్ చేయడంతో రక్తస్రావమై ఓ మహిళ మృతి చెందింది. యాపిల్ స్కానింగ్ సెంటర్ వ్యవహారంలో అప్పటి డీఎస్పీతో పాటు సీఐ కూడా సస్పెండ్ కాగా డీఎంహెచ్‌వో కోటాచలం బదిలీ అయ్యారు.

న్యాయవిద్య కోర్సుల్లో అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి):న్యాయవిద్య కోర్సుల్లో ప్రవేశానికి షెడ్యూల్ విడుదలైంది. లాసెట్-2025 ద్వారా కోర్సుల్లో ఆగస్టు 4 నుంచి 14 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కమ్ వెరిఫికేషన్, ఫీజు చెల్లింపు ఉంటుంది. ప్రత్యేక కేటగిరీ విద్యార్థుల ఫిజికల్ వెరిఫికేషన్ ఆగస్టు 11 నుంచి 14 వరకు ఉంటుంది. తొలి విడత వెబ్ ఆప్షన్ల దాఖలు ఆగస్టు 16, 17న ఉంటుంది. కాలేజీల్లో రిపోర్టు చేయడం, ఫీజుల చెల్లింపు ఆగస్టు 22 నుంచి 25వ తేదీ దాకా ఉంటుంది. పీజీ లా కోర్సుల్లో ప్రవేశానికిగాను ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 1 దాకా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఉంటుంది. ప్రత్యేక కేటగిరీ విద్యార్థుల సర్టిఫికెట్ల ప్రత్యక్ష పరిశీలన ఆగస్టు 27-29 మధ్యలో ఉంటుంది. అర్హులైన విద్యార్థుల వివరాలు సెప్టెంబరు 2న ప్రదర్శిస్తారు. వెబ్‌ఆప్షన్ల దాఖలు సెప్టెంబరు 3, 4 తేదీల్లో ఉంటుంది. ప్రాథమికంగా ప్రవేశానికి అర్హత సాధించిన విద్యార్థుల వివరాలు సెప్టెంబరు 8న ప్రదర్శిస్తారు. మరిన్ని వివరాలకు http://lawcetadm.tgche.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

వరంగల్ ఎయిర్‌పోర్టుకు 205 కోట్లు

» విడుదల చేసిన రాష్ట్రప్రభుత్వం

» టైటిల్ క్లియర్‌గా ఉన్న 15 మంది రైతులకు రూ.13.74 కోట్ల చెల్లింపు

» ఇల్లు కోల్పోతున్న కుటుంబాలకిచ్చే పరిహారంపై రాని స్పష్టత

» కోచి తరహాలో మామునూరు విమానాశ్రయం: కొండా సురేఖ

హైదరాబాద్, వరంగల్, మామునూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా మామునూరులో నిర్మించ తలపెట్టిన విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రూ.205 కోట్లు విడుదల చేసింది. విమానాశ్రయానికి 949.14 ఎకరాల భూమి అవసరం కాగా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) ఆధీనంలో ప్రస్తుతం 696.14 ఎకరాల భూమి ఉంది. మరో 253 ఎకరాల భూమి సేకరణ కోసం రూ.205 కోట్లు కేటాయిస్తూ గతేడాది నవంబరులో ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ భూసేకరణ తుది దశకు చేరడంతో పరిహారం చెల్లించేందుకు ఇప్పుడు నిధులు విడుదల




చేశారు. నిధులు విడుదలైన వెంటనే.. టైటిల్ క్లియర్‌గా ఉన్న 15మంది రైతుల ఖాతాల్లో రూ.13.74కోట్ల పరిహారాన్ని జమ చేశామని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద ప్రకటించారు. భూసేకరణలో భాగంగా మామునూరు పరిసర ప్రాంతాలైన గాడిపల్లి, నక్కలపల్లి, గుంటూరుపల్లి గ్రామాల్లో 240 ఎకరాల వ్యవసాయ భూమి, 61,134.5 చదరపు గజాల వ్యవసాయేతర భూమిని సేకరిస్తున్నారు. ఈ సేకరణలో 12మంది తమ ఇళ్లను కోల్పోతున్నారు. అయితే, పలుమార్లు చర్చల అనంతరం వ్యవసాయ భూమికి ఎకరాకు రూ.1.20కోట్లు, వ్యవసాయేతర భూమి గజానికి రూ.4,887 పరిహారంగా నిర్ణయించారు. కాగా, ఇళ్లు కోల్పోతున్న వారికి ఎంత పరిహారం ఇవ్వాలనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఇల్లు కోల్పోతున్న ఒక్కో కుటుంబానికి రూ.11.56 లక్షలు చొప్పున ఇస్తామని గాడేపల్లిలో శుక్రవారం జరిగిన గ్రామసభలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. అంతేకాక, భవన నిర్మాణ ఖర్చులను అదనంగా చెల్లిస్తామని ప్రతిపాదించారు. ఇందుకు సమ్మతమైతే తహసీల్దార్‌కు లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. అయితే, ఈ ప్రతిపాదనపై అసంతృప్తి వ్యక్తం చేసిన బాధితులు మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో ఈ అంశం పెండింగ్‌లో పడింది. భూసేకరణ పూర్తయితే మూడేళ్లలో ఎయిర్‌పోర్టు పనులు పూర్తవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. కాగా, వరంగల్ ఎయిర్‌పోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం పట్ల మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కొండా సురేఖ ధన్యవాదాలు తెలియజేశారు. కేరళలోని కోచి అంతర్జాతీయ విమానాశ్రయం తరహాలో మామునూరు ఎయిర్‌పోర్టు ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లుగా మంత్రి పేర్కొన్నారు.

సీఎం రమేశ్‌కు 1600 కోట్ల కాంట్రాక్టు..!

» రేవంత్ అప్పగిస్తుంటే కళ్లుమూసుకున్న రాహుల్ గాంధీ

» రాష్ట్రాన్ని దోచుకుంటున్న రేవంత్‌రెడ్డిని మోదీ ప్రభుత్వం కాపాడుతోంది: కేటీఆర్



హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకం విషయంలో రేవంత్‌రెడ్డికి మద్దతిచ్చి.. కమీషన్లు ఇప్పించిన బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కు క్విడ్‌ప్రోకో కింద రాష్ట్ర ముఖ్యమంత్రి వందల కోట్ల కాంట్రాక్టు కట్టబెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్రీయ విద్యార్థి సేన పరిషత్ (టీఆర్‌వీఎస్‌పీ)ను బీఆర్ఎస్ విద్యార్థి విభాగంలో విలీనం చేసిన సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మాట్లాడారు. బీజేపీ ఎంపీకి రాష్ట్ర ముఖ్యమంత్రి ఫోర్త్‌సిటీలో రూ.1600 కోట్ల విలువైన రోడ్డు కాంట్రాక్టులిస్తుంటే.. రాహుల్ గాంధీ కళ్లు మూసుకున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకుంటున్న రేవంత్‌రెడ్డిని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాపాడుతోందని ఆరోపించారు. రేవంత్ సర్కార్ అక్రమాలు, అవినీతిని నిరూపించే సాక్ష్యాలను కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చినా ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీల రాజకీయ అక్రమ సంబంధం నిస్సిగ్గుగా నడుస్తోందని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డికి బీజేపీ పెద్దల ఆశీస్సులుంటే ఉండొచ్చు కానీ తెలంగాణ ప్రజల మద్దతు ఏమాత్రం లేదన్నారు. సోనియాగాంధీ తనకు రాసిన లేఖను చదివే తెలివి కూడా రేవంత్‌కు లేదనిపిస్తోందన్నారు. కార్యక్రమానికి రాలేనని లేఖలో ఆమె చెప్పినమాటను అర్థం చేసుకోలేక తనను ప్రశంసించారని, అది ఆస్కార్ అవార్డుతో సమానమంటున్న ఆయనకు ఆస్కార్‌కాదు.. భాస్కార్ అవార్డు ఇవ్వాలని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణలోని యూనివర్సిటీల విద్యార్థుల పోరాట ఫలితంగా.. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం గడగడలాడి ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిందన్నారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో దళితబిడ్డ సాయిలును రేవంత్‌రెడ్డి పోలీసులు ఎక్కడ అవమానించారో అక్కడే.. ఆయనకు సన్మానంచేసి అధికారులకు ఓ హెచ్చరిక చేశామని కేటీఆర్ వెల్లడించారు.

బీసీ బిల్లు బీజేపీ వల్ల అవుతుందా.. లేదా?

రఘునందన్ ఆ పాఠాలేవో వారి పార్టీకే చెప్పుకోవాలి: ఆది శ్రీనివాస్

బీజేపీ.. అగ్రవర్ణ పార్టీ: కవ్వంపల్లి.. దళితులకు బీఆర్ఎస్ ద్రోహం: అద్దంకి

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆమోదించిన బిల్లులను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చడం బీజేపీ వల్ల అవుతుందో.. కాదో.. చెప్పాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిలదీశారు. బీజేపీ వల్ల కాకపోతే రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యాక ఆమోదించుకుంటామని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు కాంగ్రెస్‌కు పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని, ఆవేవో ఆయన పార్టీకే చెప్పుకోవాలన్నారు. బీజేపీ అగ్రకుల పార్టీ అని, బీసీ బిల్లు అమలు కావడం రఘునందన్‌రావుకు ఇష్టం లేదని మండిపడ్డారు. బీసీ బిల్లులకు ఆమోదం తెలపకుండా బీజేపీ నేతలు పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. సామాజిక న్యాయం అంటేనే కాంగ్రెస్ అని.. సీఎం రేవంత్‌రెడ్డి బీసీ బిడ్డ కాకున్నా బీసీ బిల్లులు తీసుకువచ్చారని కొనియాడారు. బీజేపీ.. అగ్రవర్ణ పార్టీ అని కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న బీజేపీకి.. బీసీల గురించి మాట్లాడే అర్హతే లేదని విరుచుకుపడ్డారు. గాంధీభవన్‌లో 'అందుబాటులో ప్రజాప్రతినిధులు' కార్యక్రమంలో భాగంగా కవ్వంపల్లి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లో బూతులను ప్రవేశ పెట్టిందే కేసీఆర్ అని, కేటీఆర్ ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో దళితులకు ద్రోహం చేసిన పార్టీ ఏదైనా ఉందంటే.. అది బీఆర్‌ఎస్సేనని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. దళితుల గురించి కేటీఆర్ మాట్లాడుతుంటే విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. దళితులపై బీఆర్ఎస్ నేతలు దాడులు, విధ్వంసాలు ఇంకా ఎవరూ మర్చిపోలేదన్నారు. పాత పథకాల పేరుతో రైతులు, దళితులను కేటీఆర్ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడని ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. కౌశిక్‌రెడ్డి బతుకు కుక్కలు చింపిన విస్తరి కావడం ఖాయమని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ధ్వజమెత్తారు. పిచ్చిలేసినట్లు ఏది పడితే అది మాట్లాడితే.. ప్రజలు రాళ్లతో కొట్టి ఎర్రగడ్డ పిచ్చాసుపత్రిలో చేరుస్తారన్నారు. చిన్న బాసు డ్రామారావు చేసిన పనులన్నీ కౌశిక్‌రెడ్డికి గుర్తుకు వస్తున్నట్టున్నాయని, అందుకే అవే విషయాలను కలవరిస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఈటల రాజేందర్ ఎక్కడ మళ్లీ బీఆర్ఎస్‌లోకి వస్తాడోనన్న భయంతో కల్వకుంట్ల కుటుంబం వద్ద పేరు తెచ్చుకునేందుకు తెగ తాపత్రయపడుతన్నారని విమర్శించారు.

ఎస్ఏఆర్ డేటాతో పంటల వివరాల నమోదు

» సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి: తుమ్మల



హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో సాగవుతున్న పంటల వివరాల నమోదులో ఎస్ఏఆర్ డేటాను వినియోగించాలి. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిపాదించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి' అని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఎస్ఏఆర్ డేటా వినియోగానికి సంబంధించిన ప్రాజెక్టుపై మంత్రి తుమ్మల సచివాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సాగవుతున్న పంటల విస్తీర్ణం అంచనా వేయటం ద్వారా రానున్న కాలంలో ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేయడానికి వీలుంటుందన్నారు. మరోవైపు.. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ వీసీ, అధికారులతోనూ మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. సహకార సంఘాల ద్వారా విత్తనోత్పత్తి అవకాశాలను పరిశీలించాలని అధికారులకు ఆయన సూచించారు. కాగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం, పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్, మంథని మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాలను నియమించినట్లు మంత్రి తుమ్మల తెలిపారు.

నవంబరులో వెయ్యి అంగన్‌వాడీల నిర్మాణం

» శిథిలావస్థకు చేరిన భవనాలపై దృష్టి: మంత్రి సీతక్క

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జయంతి (నవంబరు 19) నాటికి రాష్ట్రంలో వెయ్యి అంగన్‌వాడీల భవనాలను ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. అదనపు నిధులు అవసరమైతే.. మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సచివాలయంలో అంగన్‌వాడీ కేంద్రాల పని తీరుపై నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన ఆహారం అందించాలని, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కాగా, టీజీపీఎస్సీ ద్వారా సీడీపీవోలుగా ఎంపికైన 23 మందికి సచివాలయంలో మంత్రి సీతక్క నియామక పత్రాలు అందజేశారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఆమె సూచించారు. కాగా, వానాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీతక్క సూచించారు. జిల్లాల అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీపీవోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ మిషన్ భగీరథ పైప్‌లైన్లను నిత్యం పరిశీలించాలని, పైపుల లీకేజీలను నివారించాలని సూచించారు.

ఆరుగురు ఇన్‌స్పెక్టర్లకు డీఎస్పీలుగా పదోన్నతి

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులను కట్టడి చేసే ఆపరేషన్లలో విశేష ప్రతిభ కనబరిచిన ఆరుగురు ఇన్‌స్పెక్టర్లకు డీఎస్పీలుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఈమేరకు హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో బొడ్డు అశోక్, ఎస్ఐబీలో పనిచేస్తున్న పెండెం శ్రీనివాస్, అరుణ్‌కుమార్, కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్‌లో పనిచేస్తున్న వాసాల తిరుపతికి డీఎస్పీ(సివిల్)గా పదోన్నతి కల్పించారు. అలాగే గ్రేహౌండ్స్ అటాచ్‌మెంట్‌లో పనిచేస్తున్న తెలంగాణ స్పెషల్ పోలీసు బెటాలియన్లకు చెందిన కె.సమరసింహారెడ్డి, పి.మల్లేశ్‌కు అసిస్టెంట్ కమాండెంట్‌గా పదోన్నతి లభించింది.

మరో 3,500 కోట్ల అప్పు తీసుకోనున్న రాష్ట్రం

రాష్ట్రప్రభుత్వం మరో రూ.3,500 కోట్ల అప్పు తీసుకోనుంది. ఈమేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు శుక్రవారం ఇండెంటు పెట్టింది. 2053లో అప్పు తీర్చేలా రూ.1000 కోట్లు, 2056లో తీర్చేలా రూ.1000 కోట్లు, 2057లో తీర్చేలా రూ.1000 కోట్లు, 2063లో తీర్చేలా రూ.500 కోట్ల అప్పును తీసుకోనుంది. ఈ నెల 29న ఆర్‌బీఐ నిర్వహించే ఈ-వేలం ద్వారా ఈ అప్పును సేకరించనుంది.

నీళ్లున్నా.. ఏపీ దురాశకు అంతులేదు

» కృష్ణా ట్రిబ్యునల్-2లో తెలంగాణ వాదనలు

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలు శాస్త్రీయ విధానంలో పంటలకు అందిస్తే సరిపోతాయని, కానీ.. ఏపీ దురాశకు అంతులేకపోవడం వల్లే సమస్యలు వస్తున్నాయని తెలంగాణ తరఫు న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ అభిప్రాయపడ్డారు. ఢిల్లీలోని జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్(కృష్ణా-2)లో తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ విచారణ సందర్భంగా శుక్రవారం ఆయన వాదనలు వినిపించారు. కృష్ణా బేసిన్ పరిధిలోని తెలంగాణలో కరువు పీడిత, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగునీటిని అందించే ప్రాజెక్టులకు నికర జలాలు కేటాయించాలని నివేదించారు. తెలంగాణకు నీటి కేటాయింపుల వల్ల ఏపీకి ఏ విధంగానూ నష్టం జరగదని, ఇతర బేసిన్లకే నీటిని తరలిస్తున్నందున.. ఆయా ప్రాంతాల్లో శాస్త్రీయ పద్ధతులు అనుసరిస్తే సాగు అవసరాలకు నీరు సరిపోతుందని పేర్కొన్నారు. కాగా, తదుపరి విచారణ వచ్చే నెల 28, 29వ తేదీల్లో జరగనుంది.

జిల్లాలకు ప్రత్యేకాధికారులు

» ఐఏఎస్‌లను నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును మరింత సమర్థంగా పర్యవేక్షించేందుకు ప్రభుత్వం జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించింది. ఐఏఎస్ అధికారులకు ఈ బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ కె.రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జనవరిలో చేపట్టిన నియామకాల్లో కొన్ని మార్పులుచేసి కొత్త జాబితాను విడుదల చేశారు. ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్- ఉమ్మడి ఆదిలాబాద్, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్- ఉమ్మడి కరీంనగర్, మహిళా సంక్షేమ కార్యదర్శి అనితా రామచంద్రన్- ఉమ్మడి నల్లగొండ, రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హన్మంతు- ఉమ్మడి నిజామాబాద్, సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్- ఉమ్మడి రంగారెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి- ఉమ్మడి మహబూబ్‌నగర్, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక- ఉమ్మడి వరంగల్, గిరిజన సంక్షేమ కార్యదర్శి శరత్- ఉమ్మడి మెదక్, రవాణా శాఖ కమిషనర్ కె.సురేంద్ర మోహన్- ఉమ్మడి ఖమ్మం, పురపాలక శాఖ కార్యదర్శి ఇలంబర్తి- హైదరాబాద్ జిల్లాలకు ప్రత్యేకాధికారులుగా వ్యవహరిస్తారు.

పీఎంఏవైలో రాయితీల నిర్ణయానికి కమిటీ

హైదరాబాద్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస యోజన అర్బన్(పీఎంఏవై (యు.2.0) కింద రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో అఫర్డబుల్ హౌసింగ్ పాలసీ కింద నిర్మించే ఇళ్లకు ఇవ్వాల్సిన రాయితీలు, ప్రోత్సాహకాలను నిర్ణయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. ఈమేరకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ శుక్రవారం జీవో ఆర్టీ 335ను జారీ చేశారు.

'అగ్నివీర్'లో తెలుగు రాష్ట్రాల వెనుకంజ

» మంత్రి జూపల్లితో ఏఎస్‌సీ కమాండింగ్ ఆఫీసర్ భేటీ

తెలంగాణ నుంచి అగ్నివీర్ పోటీదారుల సంఖ్య చాలా స్వల్పంగా ఉందని ఎయిర్‌మెన్ సెలెక్షన్ సెంటర్ కమాండింగ్ ఆఫీసర్ యాకూబ్ అలీ మంత్రి జూపల్లి కృష్ణారావుకు తెలిపారు. ఏఎస్‌సీఈ కమాండింగ్ ఆఫీసర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శుక్రవారం మంత్రి జూపల్లిని మర్యాదపూర్వకంగా కలిశారు. అగ్నివీర్‌లో చేరేందుకు తెలుగు రాష్ట్రాల యువత ఆసక్తి చూపడం లేదని తెలిపారు.

పవర్ లూం కార్మికులను ఆదుకోవాలి

» సీఎం రేవంత్‌రెడ్డికి పద్మశాలి సంఘం వినతి

ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న పవర్‌లూం కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌కు అఖిల భారత పద్మశాలి సంఘం రాజకీయ విభాగం అధ్యక్షుడు బొల్ల శివశంకర్ విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా చేనేత కార్మికులకు వర్తింపజేస్తున్న త్రిఫ్ట్, ఆరోగ్య బీమా, వర్కర్ టు ఓనర్ పథకాలను పవర్‌లూం కార్మికుల కుటుంబాలకు విస్తరించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుక్రవారం లేఖ రాసినట్టు ఆయన పేర్కొన్నారు.

28న రాష్ట్ర క్యాబినెట్ భేటీ!

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28 మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర క్యాబినెట్ సమావేశం జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఈ నెల 24న జరగాల్సిన క్యాబినెట్ సమావేశం వాయిదా పడింది. ఏఐసీసీ ఓబీసీ సమావేశంలో పాల్గొనేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి.. ఢిల్లీకి వెళ్లడంతోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కూడా అక్కడే ఉండటంతో ఈ నెల 24న జరగాల్సిన క్యాబినెట్ భేటీని వాయిదా వేశారు.

నా నాయకుడి మాటలు.. పోరాటానికి స్ఫూర్తినిచ్చాయి

» కులగణనపై రాహుల్ వ్యాఖ్యల పట్ల సీఎం రేవంత్ పోస్ట్

» నేడు 'ఇక్ఫై' కార్యక్రమానికి హాజరుకానున్న ముఖ్యమంత్రి

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కులగణన నిర్వహించడంపై తమను అభినందిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మాట్లాడిన మాటలు తనకు సామాజికన్యాయ లక్ష్యాలను సాధించేదాకా పోరాడే స్ఫూర్తినిచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కులగణన, దానిని విజయవంతంగా పూర్తిచేయడం పట్ల సీఎం రేవంత్‌ను గురువారం ఢిల్లీలో రాహుల్‌గాంధీ అభినందించిన విషయం తెలిసిందే. "తెలంగాణలో కులసర్వే నిర్వహించాలని నేను మొదట రేవంత్‌ను అడిగినప్పుడు.. నాకే కొన్ని సందేహాలున్నాయి. కానీ, నా అంచనాలను అధిగమించి చేశారు. దేశంలో సామాజిక న్యాయానికి ఇదొక మైలురాయి" అని రాహుల్ అన్నారు. ఈ వ్యాఖ్యలపై సీఎం రేవంత్ స్పందిస్తూ.. "నా నాయకుడు చెప్పిన ఈ మాటలు సామాజికన్యాయ లక్ష్యాలను సాధించే వరకు ఎదురయ్యే అన్ని అడ్డంకులకు వ్యతిరేకంగా పోరాడే స్ఫూర్తినిచ్చాయి" అంటూ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. కాగా, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ ఫైనాన్షియల్ అనలిస్ట్స్ ఆఫ్ ఇండియా (ఇక్ఫై) ఫౌండేషన్ ఫర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. ఈ సందర్భంగా క్యాపిటల్ ఫౌండేషన్ సొసైటీ తరఫున మోహన్ గురుస్వామి అనే పాలసీ అడ్వైజర్‌కు 'ఎస్.జైపాల్‌రెడ్డి డెమోక్రసీ అవార్డు'ను అందించనున్నారు.

మేం అధికారంలో ఉన్నప్పుడే కులగణన చేయాల్సింది

(మొదటిపేజీ తరువాయి)

పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. 2004 నుంచి 21 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, వెనక్కి తిరిగి చూసుకుంటే తాను, కాంగ్రెస్ పార్టీ ఒక తప్పు చేశామని చెప్పారు. ఓబీసీ వర్గాన్ని రక్షించే విషయంలో వెనుకబడ్డానని అంగీకరించారు. ఓబీసీల సమస్యలను లోతుగా అవగాహన చేసుకోలేక పోయానన్నారు. 15 ఏళ్లకు ముందు దళితులు, ఆదివాసీల సమస్యలను అర్థం చేసుకోగలిగానని, వారి మీదే పూర్తిగా దృష్టి కేంద్రీకరించానని చెప్పారు. అది కాంగ్రెస్ తప్పు కాదని, మార్గదర్శక పాత్రలో ఉన్న తనదే కచ్చితంగా తప్పు అవుతుందని చెప్పారు. ఆ సమయంలోనే కులగణన చేయించి ఉంటే ఫలితం వేరేగా ఉండేదని అన్నారు. ఇప్పుడు తాను చేయాలని చూస్తున్నది 15 ఏళ్ల క్రితమే సాకారమయ్యేదని చెప్పారు. అప్పుడు చేయలేక పోయినందుకు ఇప్పుడు రెట్టింపు వేగంతో చేయబోతున్నానని ప్రకటించారు. తెలంగాణ కులగణన గురించి ప్రస్తావిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లో ఉన్న డేటాకు దేశంలో ఎక్కడా ఎదురు లేదని చెప్పారు. ఈ డేటాతో రాష్ట్రంలో కార్పొరేట్ సంస్థల్లో ఎంత మంది ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు ఉన్నారో నిమిషంలో తెలుస్తుందన్నారు. కార్పొరేట్ సంస్థల యజమానుల్లో ఎంతమంది ఓబీసీలు, దళితులు ఉన్నారో కూడా కులగణన డేటా చెప్పగలదని ప్రకటించారు. ఈ వర్గాల్లో లక్షలు, కోట్ల రూపాయల ప్యాకేజీలు ఎంత మందికి లభిస్తున్నాయని అడిగితే జీరో అనే సమాధానమే వస్తుందని చెప్పారు. దేశంలో దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు నేటికీ కూలీలుగానే జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ బ్యూరోక్రసీలో అణగారిన, బలహీన వర్గాలకు సరైన ప్రాతినిధ్యం లేదన్నారు. 'దేశ జనాభాలో దళితులు, ఓబీసీలు, గిరిజనులు, మైనారిటీలంతా కలిపి 90% మంది ఉంటారు. అయితే బడ్జెట్‌లో హల్వా పంచేటప్పుడు.. (అంటే కేటాయింపులు చేసేటప్పుడు) ఈ 90 శాతం మందికి ఏమీ లేదు. దేశ ఉత్పాదక శక్తిలో 90 శాతం వీరే కదా! హల్వా తయారుచేసేది మీరే. కానీ తింటున్నదేమో వాళ్లు.



భాగీదారీ న్యాయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు

వాళ్లు తినకూడదని చెప్పడం లేదు. కానీ మీకు కనీసం కొంచెమైనా దక్కాలి కదా' అని అన్నారు. తెలంగాణలో కులగణనతో రేవంత్ బృందం ఇప్పటి దాకా రిజర్వేషన్ల విషయంలో ఉన్న 50 శాతం అడ్డుగోడను పడగొట్టేశారని ప్రశంసించారు. చదువుకున్న వారు వేగంగా అభివృద్ధి చెందుతారని తెలంగాణ సర్వేలో నిరూపితం అయ్యిందని తెలిపారు. విద్యతో పాటు ఇంగ్లీష్ ఉంటే రెండింతల అభివృద్ధి ఉంటుందని తేలిందని చెప్పారు. ఇంగ్లీష్‌ను దేశం నుంచి వెళ్లగొడతామని చెబుతున్న బీజేపీ నేతల పిల్లలు ఎక్కడ చదువుతున్నారని ప్రశ్నించారు. లండన్, అమెరికాలో ఉంటున్న నాయకుల పిల్లలు హిందీ మీడియంలో చదువుతున్నారా? అని నిలదీయాలని ప్రజలకు సూచించారు. ప్రాంతీయ భాషలు ఎంత ముఖ్యమో, ఇంగ్లిష్ కూడా అంతే ముఖ్యమన్నారు. ప్రైవేట్ విద్యలో దళితులు, ఆదివాసీలు, ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనేది కాంగ్రెస్ పార్టీ నినాదమని చెప్పారు.

ఓబీసీల చరిత్రను చెరిపేశారు

కులగణన ద్వారా దేశంలో ఉత్పాదక శక్తికి తగిన గౌరవం దక్కేలా చూడటమన్నది తన లక్ష్యమని రాహుల్‌గాంధీ అన్నారు. ఓబీసీ యువతతమలోని శక్తిని అర్థం చేసుకుంటే పరిస్థితులు తారుమారు అవుతాయని చెప్పారు. దళితులు, ఆదివాసీలు తమ చరిత్రను కాపాడుకున్నారని, దేశానికి ఉత్పాదక శక్తి అయిన ఓబీసీల చరిత్రను ఆర్ఎస్ఎస్, బీజేపీలు కలిసి చెరిపేసే ప్రయత్నంలో ఉందని అన్నారు. దేశ జనాభాలో 55 నుంచి 60 శాతం ఉన్న ఓబీసీల చరిత్ర భారతదేశ చరిత్ర పుస్తకాల్లో ఎందుకు కనబడటం లేదని ప్రశ్నించారు. దీన్ని కావాలనే చెరిపేశారనేవిషయం తెలిసిన రోజు ఓబీసీల అసలు శత్రువు ఆర్ఎస్ఎస్ అని తెలుస్తుందని వ్యాఖ్యానించారు. విద్య, ఉద్యోగం, న్యాయ వ్యవస్థలో కూడా ఓబీసీల పట్ల వివక్ష ఉందన్నారు. ఓబీసీల భూములు లాక్కుని అదానీ, అంబానీలకు ఇస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ప్రతీచోట కులగణనతో పాటు సమాజ స్థితిగతులపై ఎక్స్‌రే, ఎంఆర్ఐ చేస్తామని చెప్పారు. ఓబీసీలు ఎంత మంది ఉన్నారు? ఎక్కడున్నారు? సంపదలో భాగస్వామ్యం ఎంత? అనేది తేలుస్తామని ప్రకటించారు. జాతీయ స్థాయిలో కుల గణన జరిగేట్లు చూస్తామని, రిజర్వేషన్లకు ఉన్న 50 శాతం అడ్డుగోడలని పడగొడతామని చెప్పారు.

దమ్ములేని మోదీ!: రాహుల్

ప్రధాని మోదీదంతా ప్రదర్శన మాత్రమేనని.. ఆయనలో సరుకేమీ లేదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. 2-3 సార్లు ఆయనతో సమావేశమయ్యాక ఆయనలో దమ్ములేదని తెలుసుకున్నానని చెప్పారు. మీడియా ఆయన ఇమేజ్‌ను అతిగా పెంచేసిందని ఆక్షేపించారు. మోదీకి మరీ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. ఆయన మనకో సమస్యే కాదని వ్యాఖ్యానించారు.

మరో 25 సీట్లు వస్తే మోదీ సర్కారు కూలేది: ఖర్గే

నరేంద్ర మోదీ అబద్ధాల కోరని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకడిన వారికి రిజర్వేషన్లు ఇవ్వడానికి మోదీ సిద్ధంగా లేరని చెప్పారు. రాజకీయంగా ఎదిగినప్పుడే వెనకబడిన వర్గాలు హక్కులను సాధించుకో గలుగుతాయని అన్నారు. మోదీ ముఖ్యమంత్రి అయ్యాక తన కులాన్ని ఓసీ నుంచి ఓబీసీగా మార్చుకున్నారని తెలిపారు. అందరినీ మట్టిలో కలిపేసి ఒక్కడే బతకాలి అనుకునే రకం మోదీ అని వ్యాఖ్యానించారు. "మోదీ అబద్ధాలకు సర్దార్. చివరికి.. పార్లమెంటులోనూ అసత్యాలే. అబద్ధాలు చెప్పే ప్రధాని సమాజానికి మంచి చేయలేరు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మరో 25 సీట్లు ఎక్కువ వస్తే మోదీ అదృష్టం తిరగబడేది" అన్నారు. 75 ఏళ్ల తర్వాత పదవుల్లో ఉండొద్దని ఆర్ఎస్ఎస్ చెప్పగానే అద్వానీ, మురళీ మనోహర్ జోషి లాంటి నేతలను మోదీ ఇంటికి పంపించేశారని, ఇప్పుడు తనకు 75 ఏళ్లు నిండబోతున్నాయని ప్రస్తావించారు.

రాహుల్‌ది కపటత్వం: బీజేపీ

రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జి అమిత్ మాలవీయ విరుచుకుపడ్డారు. 'ఎత్తిపొడుపులకేం తక్కువ లేదు.. కానీ దాని వెనుక ఆయన కపటత్వమే ఎక్కువగా ఉంది' అని విమర్శించారు. రాహుల్ కులమేంటని పరోక్షంగా ప్రశ్నిస్తూ.. 'కేథలిక్ తల్లి, పార్సీ తండ్రికి పుట్టిన కొడుకు ప్రతి ఒక్కరి కులం గురించి అడుగుతూ ఉంటే ఇలాంటివే జరుగుతాయి' అని ఎద్దేవాచేశారు.



ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న పొన్నం. చిత్రంలో కొండా సురేఖ, వాకిటి శ్రీహరి

బీసీల నోటి కాడి బువ్వను తన్నేందుకు బీజేపీ కుట్రలు

» కిషన్‌రెడ్డి బీసీ వ్యతిరేకి.. రామచందర్‌రావు ఫ్యూడలిస్టు

» బీసీ రిజర్వేషన్లు అడ్డుకుంటే సకలజనుల సమ్మెను మించి ఉద్యమం

» పొన్నం, కొండా సురేఖ, వాకిటి

న్యూఢిల్లీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బీసీల నోటి కాడి బువ్వను బీజేపీ నేతలు తన్నే కుట్రలు చేస్తున్నారని మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి దుయ్యబట్టారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బీసీ వ్యతిరేకి అని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఫ్యూడలిస్టు అని మండిపడ్డారు. శుక్రవారం ఢిల్లీలోని థల్ కటోరా స్టేడియంలో ఏఐసీసీ బీసీ సంఘం నేతృత్వంలో 'భాగీదారీ న్యాయ సమ్మేళన్' కార్యక్రమంలో మంత్రులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం తెలంగాణభవన్‌లో మంత్రులు పొన్నం, కొండా సురేఖ, వాకిటి మీడియాతో మాట్లాడారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ బ్రాండ్ అంబాసిడర్ అని.. ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానిక ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఆనాడు సొంత పార్టీతోనే పోరాడామని, దమ్ముంటే బీజేపీ రాష్ట్ర నేతలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల్లోని బీసీ నేతలు ఆ పార్టీల తీరుపై ఆలోచించాలని, అధిష్ఠానాలను ప్రశ్నించాలని సూచించారు. కిషన్ రెడ్డిది ద్వంద వైఖరి అని, ఆయన బీసీ వ్యతిరేకి అని మండిపడ్డారు. బిల్లులపై స్పష్టత ఇవ్వకుండా మతం పేరుతో తాత్సారం చేయాలనుకుంటే బీజేపీ నేతలను బీసీలు బయట తిరగనివ్వబోరని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే సకల జనుల సమ్మెను మించిన ఉద్యమాన్ని చూస్తారన్నారు. ఇకనైనా కిషన్‌రెడ్డి బీసీ రిజర్వేషన్లపై చర్చించేందుకు ప్రధాని అపాయింట్‌మెంట్ కోరాలని, తెలంగాణ ప్రజలు ఓట్లేసి గెలిపిస్తేనే కేంద్రమంత్రి అయ్యాననే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితబోధ చేశారు. కులగణనలో భాగం కాని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే హక్కే లేదని వ్యాఖ్యానించారు. కాగా, భాగీదారీ న్యాయ సమ్మేళన్ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, షబ్బీర్ అలీ, వి.హన్మంతరావు, కైలాశ్ నేతతో పాటు తెలంగాణ నుంచి పలువురు నేతలు హాజరయ్యారు.

టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టండి

» తెలంగాణలో అపార అవకాశాలు

» తైవాన్ పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానం

» ఈ-గవర్నెన్స్‌లో ఎస్తోనియా సహకారం తీసుకుంటామని వెల్లడి



మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన తైవాన్ టెక్స్‌టైల్ ఫెడరేషన్ అధ్యక్షుడు జస్టిన్ వాంగ్, ప్రతినిధులు

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): టెక్స్‌టైల్ రంగం అభివృద్ధికి ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో అపారమైన అవకాశాలున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టి రైజింగ్ తెలంగాణలో భాగస్వామ్యం కావాలని తైవాన్ పారిశ్రామికవేత్తలను కోరారు. శుక్రవారం సచివాలయంలో తైవాన్ టెక్స్‌టైల్స్ ఫెడరేషన్ (టీటీఎఫ్) అధ్యక్షుడు జస్టిన్ వాంగ్ నేతృత్వంలో 11 మంది ప్రతినిధుల బృందం మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "స్వల్ప కాలంలోనే టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు దీటుగా ఎదిగింది. రాష్ట్ర పారిశ్రామిక జీఎస్‌వీఏ (రాష్ట్ర స్థూల విలువ జోడింపు) 2024-25లో రూ.2.77 లక్షల కోట్లుగా ఉంది. ఇందులో టెక్స్‌టైల్ రంగం కీలక పాత్ర పోషించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో అభివృద్ధి చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ) గేమ్ చేంజర్‌గా మారింది. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణ పారిశ్రామికాభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది" అని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. తైవాన్ పారిశ్రామికవేత్తలు ముందుకొస్తే 'తెలంగాణ - తైవాన్ మాన్యుఫాక్చరింగ్ జోన్' పేరిట ప్రత్యేక టెక్స్‌టైల్ క్లస్టర్లను అభివృద్ధి చేస్తామన్నారు. కాగా, ఈ-గవర్నెన్స్, హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌లో ప్రపంచంలోనే అద్భుత ప్రగతి సాధించిన ఎస్తోనియా దేశ సహకారం తీసుకుంటామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం ఎస్తోనియా రాయబారి మ్యారియే లూప్ ఆధ్వర్యంలో ఆ దేశ వాణిజ్య ప్రతినిధులు మంత్రిని కలిశారు. తెలంగాణ ప్రజల ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్‌లో ఇంకా ప్రథమ దశలోనే ఉందని శ్రీధర్‌బాబు తెలిపారు. వంద శాతం ప్రగతి సాధించిన ఎస్తోనియా తమకు సాంకేతిక సహకారం అందించాలని కోరారు.

తొలి స్వదేశీ సెమీకండక్టర్ చిప్

» ఆవిష్కరించిన వీసీ ప్రొఫెసర్ కుమార్

» రికార్డు సృష్టించిన ఉస్మానియా వర్సిటీ

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ చరిత్రలో మరో మైలురాయి నమోదైంది. భారతదేశంలోని రాష్ట్ర స్థాయి యూనివర్సిటీల చరిత్రలోనే తొలిసారిగా స్వదేశీ సెమీకండక్టర్ చిప్‌ను అభివృద్ధి చేయడం ద్వారా ఓయూ రికార్డు సృష్టించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం, చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) సహకారంతో భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ(ఎంఈఐటీవై), సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సీ-డాక్) మద్దతుతో చిప్స్-టు-స్టార్టప్(సీ2ఎస్) కార్యక్రమం కింద ఆల్-డిజిటల్ ఫేజ్-లాక్డ్ లూప్(ఏడీపీఎల్ఎల్) ఏఎస్ఐసీ చిప్ నమూనా రూపుదిద్దుకుంది. ఈ చొరవలో భాగంగా, మొహాలీలోని సెమీకండక్టర్ ల్యాబ్(ఎస్‌సీఎల్)లో 180ఎన్ఎం సీఎంఓఎస్ టెక్నాలజీని ఉపయోగించిన ఓయూ బృందం ఏడీపీఎల్ఎల్ చిప్‌ను విజయవంతంగా తయారు చేసింది. అకడమిక్ కౌన్సిల్ సభ్యులు, విశ్వవిద్యాలయ అధికారులు, యూసీఈ ఓయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.మంగు, ఇంజనీరింగ్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ ఎ.కృష్ణయ్య, ఓయూ విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ బి.రాజేంద్ర నాయక్, ఈసీఈ హెడ్ ప్రొఫెసర్ పి.నవీన్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు, బీఓఎస్ చైర్‌పర్సన్‌లు, ప్రాజెక్ట్ బృందం సమక్షంలో ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం ఈ చిప్‌ను అధికారికంగా శుక్రవారం ఆవిష్కరించారు.

రూ. 5కోట్ల సాయం..

యూసీఈఓయూ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్ నేతృత్వంలోని బృందం కృషిని వైస్‌చాన్సలర్ ఎం.కుమార్ ప్రశంసించారు. ప్రొఫెసర్ నాయకత్వం సీ2ఎస్ కార్యక్రమం కింద రూ.5కోట్లు అందజేయడంతోపాటు.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్(సీఏఐసీ)లో ఎక్సలెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం, సౌకర్యాలు, పారిశ్రామిక సహకారాలకు మద్దతు ఇస్తానని ఆయన హామీ ఇచ్చారు.

దాతల మద్దతుతో..

చిప్ తయారీకి బీసీ ఈసీఈ 1983 బ్యాచ్ రూ.50లక్షల విలువైన సర్వర్‌లను, మరో రూ.50 లక్షల విలువైన జీపీజీపీయూ సర్వర్‌లను చావాస్క్ సంస్థ అందించిందని ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. వారితో పాటు పూర్తి స్థాయి ఈడీఏ సాధనాలను అందించడంలో మద్దతు ఇచ్చినందుకు ఎంఈఐటీవై, సీడీఏసీలకు, ఓయూ వీసీకి కృతజ్ఞతలు తెలిపారు. తన బృంద సభ్యులను, సీబీఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జహంగీర్, ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ మిస్బాహుద్దీన్‌లను అభినందించారు.

ఆరోగ్యశ్రీలో 27% కిడ్నీ చికిత్సలే!

(మొదటిపేజీ తరువాయి)

ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యసేవలు పొందే వారి సంఖ్య భారీగా పెరిగిందని వైద్యవర్గాలు వెల్లడించాయి. ఆరోగ్యశ్రీ కింద ఏడాదిన్నర కాలంలో 10.70 లక్షల చికిత్సలను అందించారు. ఇందులో ఐదు విభాగాల్లోనే 6.55 లక్షల చికిత్సలు జరిగినట్లు వైద్యవర్గాలు పేర్కొన్నాయి. మూత్రపిండాల విభాగంలో 2.13 లక్షలు, క్యాన్సర్‌లో 1.90 లక్షలు, పాలీట్రామాలో 88 వేలు, యూరినరీ సర్జరీల్లో 81, జనరల్ మెడిసిన్ విభాగంలో 81 వేల కేసులకు చికిత్సలందించారు. మిగిలిన అన్ని విభాగాల్లో కలిపి 4.60 లక్షల చికిత్సలు అందించినట్లు తెలిపాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత 2023 డిసెంబరు వరకు ఆరోగ్యశ్రీ కింద మొత్తం 30.17 లక్షల వైద్య చికిత్సలు అందించారు. ఇందులో ఒక్క ప్రైవేటులోనే 19.06 లక్షలు కాగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో 11.10లక్షల చికిత్సలు అందించారు. పదేళ్లలో ఏడాదికి సగటున 3 లక్షల కేసులకు ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు అందించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. కాగా, గతంలో ఎంతో పలుకుబడి ఉంటే తప్ప ప్రైవేటు ఆస్పత్రులు ఆరోగ్యశ్రీలో ఎంప్యానెల్ అయ్యేవికావు. మూడు నాలుగేళ్లకోసారి ఎంప్యానెల్ అయ్యేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరేవారు. దీంతో పరిమిత సంఖ్యలోనే ప్రైవేటు ఆస్పత్రులు అనుసంధానమయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండల, నియోజకవర్గ స్థాయి ఆస్పత్రులకు సైతం ఎంప్యానెల్ అయ్యేందుకు అవకాశం కల్పించింది. నిబంధనల్లో మార్పులు చేశారు. 15 అంచెలను 10కి కుదించారు. దరఖాస్తు చేసిన కొద్దిరోజుల్లోనే తనిఖీలు పూర్తి చేసి ఎంప్యానెల్ జాబితాలో చేర్చారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రులు ఎంప్యానెల్ కోసం పోటీపడుతున్నాయి.



హైకోర్టు సీజే ఏకే సింగ్‌ను సన్మానిస్తున్న హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు

హైకోర్టును నడిపించేది సీజే ఒక్కరే కాదు

- అందరి కృషితోనే న్యాయం: చీఫ్ జస్టిస్ ఏకే సింగ్

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హైకోర్టును నడిపించేది ప్రధాన న్యాయమూర్తి (సీజే) మాత్రమే అన్న తప్పుడు అభిప్రాయం తనకు లేదని నూతన చీఫ్ జస్టిస్ ఏకే సింగ్ చెప్పారు. అందరి సహకారంతో న్యాయ వ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు. న్యాయవాదులు లేకుండా న్యాయం లేదని, వారి వల్లే బాధితులకు న్యాయం అందుతుందని పేర్కొన్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో సింహభాగం బార్ నుంచి వచ్చిన వారేనని గుర్తుచేశారు. తెలంగాణ హైకోర్టు ఏడో ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ ఏకే సింగ్‌ను శుక్రవారం హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో అందరూ యజమానులేనని చెప్పారు. న్యాయవాదులు, రిజిస్ట్రీ సభ్యులు, ఇతర సిబ్బందికి తగిన గౌరవం ఉంటుందని, అంతా తన అన్నదమ్ములని ఉద్ఘాటించారు. అత్యంత జూనియర్ న్యాయవాది నుంచి అత్యంత సీనియర్ న్యాయవాది వరకు అందరినీ సమాన భావనతో చూస్తానని తెలిపారు. భయం, పక్షపాతం, రాగద్వేషాలకు అతీతంగా న్యాయం అందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, ఏజీ సుదర్శన్‌రెడ్డి, ఏఏజీలు ఇమ్రాన్‌ఖాన్, తేరా రజనీకాంత్‌రెడ్డి, పీపీ పల్లె నాగేశ్వర్‌రావు, కార్యదర్శులు విజారత్ అలీ, ఇంద్రసేనారెడ్డి, బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు సునీల్‌గౌడ్ పాల్గొన్నారు.

కంపెనీ ఎండీ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టి.. కార్యాలయం ఉద్యోగి నుంచి 1.94 కోట్లు స్వాహా

హైదరాబాద్ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఓ కంపెనీ ఎండీ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టి.. ఉద్యోగులను బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు రూ. 1.94 కోట్లు కొల్లగొట్టారు. రంగంలోకి దిగిన నగర పోలీసులు ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేశారు. వారిలో ఒకరు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వైష్ణ, మరొకరు మధ్యప్రదేశ్‌కు చెందిన అజ్జు అలియాస్ అజయ్ సాహుగా పోలీసులు తేల్చారు. డీసీపీ కవిత తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన బాధితునికి ఒక వాట్సాప్ మెసేజ్ వచ్చింది. ఆ వాట్సాప్ డీపీగా అతను పనిచేస్తున్న కంపెనీ ఎండీ ఫొటో ఉంది. 'ఒక కొత్త ప్రాజెక్టు పనిలో బిజీగా ఉన్నాను.. నేను ఆఫీస్‌కు వచ్చిన తర్వాత ఆ ప్రాజెక్టు వివరాలు తెలియజేస్తాను.' అని ఆ మెసేజ్‌లో ఉంది. దానికి బాధితుడు సమాధానం ఇచ్చిన తర్వాత మరోసారి ఓ బ్యాంకు ఖాతా వివరాలు మెసేజ్ చేశారు. కొత్త ప్రాజెక్టు నిమిత్తం 1.94 కోట్లు అవసరం అయ్యాయని వెంటనే బదిలీ చేస్తే కార్యాలయానికి వచ్చిన తర్వాత వివరంగా చెప్తానని ఆ మెసేజ్‌లో ఉంది. దాంతో నిజంగానే తన ఎండీ మెసేజ్ చేసినట్లు భావించిన బాధితుడు అందులో సూచించిన ఖాతాకు 1.94 కోట్ల కంపెనీ డబ్బు బదిలీ చేశాడు. ఆ తర్వాత తన ఎండీని కలవడంతో అసలు విషయం తెలిసింది. ఆయన ఎలాంటి మెసేజ్ చేయలేదని, ఏ ప్రాజెక్టు కోసం వెళ్లలేదని, ఆ నంబర్ ఆయనది కాదని తెలిసింది. దాంతో బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఏసీపీ శివమారుతి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు బృందం రంగంలోకి దిగింది. సాంకేతిక ఆధారాలతో ఈ మోసానికి పాల్పడింది యూపీకి చెందిన వైష్ణ, మధ్యప్రదేశ్‌కు చెందిన అజ్జు అలియాస్ అజయ్‌సాహుగా గుర్తించి అరెస్టు చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు.

ఎన్‌హెచ్‌ఎం కింద రెండేళ్లలో రాష్ట్రానికి 1,675 కోట్లు

న్యూఢిల్లీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద తెలంగాణకు గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో రూ.1,675 కోట్లకు పైగా నిధులు విడుదల చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. శుక్రవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ఓ ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 2023-24లో రూ.564.93 కోట్లు, 2024-25లో 1,110.43 కోట్లు విడుదల చేశామని, ఈ నిధుల్లో రాష్ట్ర ప్రభుత్వ వాటా లేదని వెల్లడించారు.

సాగర్ దిశగా కృష్ణమ్మ

ఆల్మట్టి నుంచి శ్రీశైలం దాకా అన్నీ నిండు కుండలా..

- సాగర్‌లోకి 98వేల క్యూసెక్కుల వరద
- సామర్థ్యం 312 టీఎంసీలు.. ప్రస్తుతం 276 టీఎంసీలు
- గోదావరి ప్రాజెక్టులకు పుంజుకోని వరద
- కాళేశ్వరం వద్ద 9 అడుగుల ఎత్తులో.. భద్రాద్రి వద్ద 26 అడుగుల ఎత్తులో..
- ఇప్పటికే 1000 మిలియన్ యూనిట్లు దాటిన జల విద్యుదుత్పత్తి
- ఆగని జల్లులు.. నేడూ కొన్ని జిల్లాల్లో వర్షాలు.. 29 దాకా ఎల్లో అలర్ట్



నల్లగొండ జిల్లా కేంద్రం పానగల్‌లోని చందనపల్లి సమీపంలో వాన ముసురులోనే వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆల్మట్టి నుంచి శ్రీశైలం దాకా అన్ని ప్రాజెక్టులను నిండుగా నింపిన కృష్ణమ్మ.. నాగార్జునసాగర్‌నూ జలసిరితో ఉప్పొంగించేందుకు బిరబిరా పరుగు తీస్తోంది. ప్రస్తుతం సాగర్‌లోకి 98,413 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా ప్రస్తుతం 276.09 టీఎంసీల నీరు ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులైతే ఇప్పటికే 579 అడుగులకు నీరు చేరుకోవడం గమనార్హం. ప్రాజెక్టు నుంచి దిగువకు 6,134 క్యూసెక్కులను మాత్రమే వదులుతున్నారు. శ్రీశైలం నుంచి రెండు గేట్ల ద్వారా 1.57 లక్షల క్యూసెక్కుల నీరు సాగర్ దిశగా వెళుతోంది. పులిచింతల కూడా నీటితో కళకళలాడుతోంది. పూర్తి సామర్థ్యం 45.77 టీఎంసీలకు ప్రస్తుతం 19.70 టీఎంసీలల మేర నీటి నిల్వ ఉంది. గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులకు వరద ఇంకా పుంజుకోలేదు. ఎగువన భారీ వర్షాలు పడుతుండటంతో ప్రవాహం పెరుగుతుందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ త్రివేణి సంగమం వద్ద గోదావరి 9మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం 26 అడుగులుగా నమోదైంది. ఇక.. ఈ సీజన్‌లో ముందే వరద వచ్చిచేరడంతో జల విద్యుదుత్పాదన జోరందుకుంది. రాష్ట్రంలోని జలవిద్యుత్తు కేంద్రాల్లో ఇప్పటిదాకా 1,065 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగింది. ప్రతిరోజు 28 మిలియన్ యూనిట్ల జలవిద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు. జూరాలలో 4.19 మిలియన్ యూనిట్లు, లోయర్ జూరాలలో 4.59 మిలియన్ యూనిట్లు, శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్తు కేంద్రంలో 17.75 మిలియన్ యూనిట్లు, నాగార్జునసాగర్ ప్రధాన కేంద్రంలో 1.61 మిలియన్ యూనిట్లు, నాగార్జునసాగర్ ఎడమ కాల్వ మీద ఉన్న కేంద్రంలో 0.52 మిలియన్ యూనిట్ల మేర ఉత్పత్తి చేస్తున్నారు. ఈ సీజన్‌లో 1065 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి కాగా, అత్యధికంగా 489 మిలియన్ యూనిట్లు శ్రీశైలంలో, ఆ తర్వాత నాగార్జునసాగర్‌లో 202 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగింది. మరోవైపు.. రాష్ట్రవ్యాప్తంగా జల్లులు పడుతూనే ఉన్నాయి. ఖమ్మం జిల్లా కల్లూరులో 4.5 సెం.మీ వర్షపాతం నమోదైంది. ములుగు జిల్లా మంగపేటలో 3 సెం.మీ, మెదక్ జిల్లా పాపన్నపేటలో 2.6సెం.మీ, పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 2.5 సెం.మీ, యాదాద్రి జిల్లా పాముకుంట, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 1.8 సెం.మీ చొప్పున, నల్లగొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లిలో 1.5 సెం.మీ, కరీంనగర్ జిల్లా చొప్పదండిలో 1.4 సెం.మీ, సిరిసిల్ల జిల్లా వీరన్నపల్లి, నారాయణపేట కోస్గిలో 1.3 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. సిద్దిపేట రూరల్‌లోని నారాయణపేటలో ఇంటిపైకప్పు, గోడ కూలిపోయింది. ఆసిఫాబాద్ జిల్లా చింతమానెపల్లి మండలం కర్జెల్లిలో ఓ ఇల్లు కూలిపోయింది.

ఆ 5 జిల్లాల్లో నేడు భారీ వర్షాలు!

ఈనెల 29 వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ మేరకు అప్పటివరకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. శనివారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ముఖ్యంగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. మిగిలిన అన్ని జిల్లాల్లోనూ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడా కురుస్తాయని తెలిపింది. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. వర్షాల నేపథ్యంలో పరిస్థితులను పరిశీలించడానికి జిల్లాల సందర్శనకు వెళ్లాలని ఉమ్మడి జిల్లాల ప్రత్యేకాధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశించారు. సీనియర్ ఐఏఎస్‌లను ఉమ్మడి జిల్లాల ప్రత్యేకాధికారులుగా నియమించాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు శుక్రవారం నియామకాల ఉత్తర్వులను సీఎస్ జారీ చేశారు. అనంతరం వారితో సచివాలయంలో సమావేశం నిర్వహించారు. వర్షాలు, రేషన్ కార్డుల పంపిణీ, యూరియా సరఫరా వంటి అంశాలపై చర్చించారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు ప్రభావవంతంగా అమలయ్యేలా చూడాలని వారిని సీఎస్ ఆదేశించారు. వర్షాలు, వరదల నేపథ్యంలో అన్ని జిల్లాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ విషయంలో ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. కాగా వర్షాల నేపథ్యంలో 'ఆపద మిత్రా'లను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్లకు విపత్తు నిర్వహణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ సూచించారు.

ప్రాజెక్టులు	పూర్తిస్థాయి సామర్థ్యం	ప్రస్తుత సామర్థ్యం	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
	(టీఎంసీల్లో)		(క్యూసెక్కుల్లో)	
ఆల్మట్టి	129.72	102.65	32923	43140
నారాయణపూర్	37.64	35.12	41580	57776
ఉజ్జయిని	117.24	114.64	5504	4093
జూరాల	9.66	8.11	65551	72067
తుంగభద్ర	105.79	78.07	26478	28397
శ్రీశైలం	215.81	203.43	110653	156863
నాగార్జునసాగర్	312.05	276.09	98413	8986
పులిచింతల	45.77	19.70	681	400
జైక్వాడి	102.73	86.38	4250	2564
సింగూరు	29.91	19.46	1976	633
నిజాంసాగర్	17.80	4.14	863	0
శ్రీరాంసాగర్	80.50	21.54	2505	622
మిడ్‌మానేరు	27.50	6.95	955	110
లోయర్ మానేరు	24.03	6.40	955	214
కడెం	4.70	3.53	2256	1932
శ్రీపాద ఎల్లంపల్లి	20.18	9.33	3651	639

రూ.2 లక్షల లంచంతో పట్టుబడ్డ డిప్యూటీ కమిషనర్ రవికుమార్

- నిబంధనలకు విరుద్ధమని హోటల్ యజమానికి బెదిరింపులు
- రూ.5 లక్షల లంచం డిమాండ్
- లంచావతారాలకు కేరాఫ్ జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్
- 8 నెలల్లో ఏసీబీ వలలో ఐదుగురు అధికారులు

రాజేంద్రనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ) రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తున్న కె.రవి కుమార్ శుక్రవారం రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. సర్కిల్ పరిధిలోని ఒక హోటల్.. నియమ నిబంధనలకు విరుద్ధంగా ఉందంటూ దాని యజమానిని వారం రోజులుగా రవి కుమార్ బెదిరిస్తున్నాడు. 'మీ మీద చర్యలు తీసుకోవద్దంటే నాకు రూ.5 లక్షలు ఇవ్వాలి' అని డిమాండ్ చేశాడు. దీంతో బుద్వేల్‌లోని రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ చాంబర్‌లో ఆయనకు శుక్రవారం సదరు హోటల్ యజమాని రూ.2 లక్షల ఇస్తుండగా, ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మీడియాకు ఇవ్వడానికి తీసుకున్నట్లు రవి కుమార్ తమ విచారణలో చెప్పాడని, దీనిపై దర్యాప్తు చేస్తున్నామని ఏసీబీ హైదరాబాద్ రేంజ్ డీఎస్పీ కె.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆయన్ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తున్న కె.రవి కుమార్‌కు ఇటీవల సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి లభించిన తర్వాత బదిలీ కావాల్సి ఉన్నా, తనకున్న పరిచయాలతో ఇక్కడే కొనసాగుతున్నారు. రవి కుమార్‌తో ఇదే సర్కిల్‌లో 8 నెలల్లో లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అధికారుల సంఖ్య ఐదుగురికి చేరుకుంది. ఇంతకు ముందు సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం ఏఈ బల్వంత్‌రెడ్డి, ఏఈ వెంకోబా, బిల్ కలెక్టర్ మధు, అతడి అసిస్టెంట్ రమేశ్‌లను ఏసీబీ అరెస్టు చేసింది.

సిగాచి ప్రమాదంపై సీఎస్‌కు ఉన్నతస్థాయి నివేదిక

అమీన్‌పూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సిగాచి ప్రమాదంపై దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)కి తన నివేదిక సమర్పించింది. కమిటీ తన నివేదికలో ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసినట్లు తెలిసింది. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చేసేందుకు ఇండస్ట్రియల్ మేనేజ్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాలని కమిటీ ప్రతిపాదించినట్లు సమాచారం. పారిశ్రామికవాడల్లోనే అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేయాలని, విపత్తు నిర్వహణ సంస్థలతో వాటిని సమన్వయం చేయాలని పేర్కొంది. అలాగే, ప్రమాదాలు జరిగిన సమయంలో ఎలా వ్యవహరించాలనే అంశంపై ఆయా సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇవ్వాలని సూచించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అత్యాధునిక భద్రతా వ్యవస్థలు పరిశ్రమల్లో ఏర్పాటు చేసుకునేలా చేయాలని పేర్కొంది. ఉపాధి నిమిత్తం ఇతర రాష్ట్రాల నుంచి పారిశ్రామికవాడలకు వచ్చే వారి వివరాలు సేకరించి గుర్తింపు కార్డులు జారీ చేయాలని సూచన చేసింది. ఈ నివేదికపై మంత్రి వర్గంలో చర్చించిన తర్వాత ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించే అవకాశముంది.

Printed and Published by ***Koganti Venkata Seshagiri Rao*** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor:* ***N.Rahul Kumar.*** *Ph. No. (0870) 2100480/84,*
RNI No:APTEL/2003/9741, ***Managing Director : Vemuri Radha Krishna*** *Founder: K.L.N.Prasad.*